epaper.vaartha.com
WWW.VAARTHA.COM
1-6-2025 ఆదివారం సంపుటి: 31
సంచిక: 120 పేజీలు: 8+16 వెల: 8.00

ఖమ్మం
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

: fb.com/vaartha Digital


మిస్ వరల్డ్ వేడుకలను తిలకిస్తున్న సిఎం రేవంత్, మెగాస్టార్ చిరంజీవి

# మిస్ వరల్డ్-2025 థాయ్ సుందరి

## ప్రపంచ సుందరి కిరీటాన్ని ధరించిన ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ

**పోటీల్లో పాల్గొన్న 108 దేశాల సుందరీమణులు**

**టాప్8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్ అయ్యారు.**

**టాప్ ఎనిమిదిలో మార్టినిక్, బ్రెజిల్, ఇథియోపియా, నమీబియా, పోలండ్, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ దేశాల సుందరీమణులు.**

**మిస్ వరల్డ్ జడ్జీలుగా జూలియా మోర్లీ (మిస్ వరల్డ్ సిఇఒ), సోనూ సూద్ (ప్రముఖ నటుడు), సుధారెడ్డి (మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్), రానా దగ్గుబాటి (సినీ హీరో), జయేశ్ రంజన్, మనూషి చిల్లర్ (బాలీవుడ్ నటి),నమ్రత శిరోద్కర్, డోనా వాల్ష్, డాక్టర్ కరినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014) వ్యవహరించారు. .**

**ప్రముఖ నటుడు సోనూ సూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు ప్రదానం.**

**ఖండాల వారీగా టాప్ 10 నుంచి ఐదుగురిని షార్ట్ లిస్ట్ చేశారు. తర్వాత ఇద్దరిని షార్ట్ లిస్ట్ చేశారు. ఈ క్రమంలో మిస్ వరల్డ్ నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా నిష్క్రమించారు.**



**విజేతకు అభినందనలు తెలిపిన సిఎం రేవంత్**

**రన్నరప్ -1: మిస్ ఇథియోపియా; 2: మిస్ పోలెండ్; 3: మిస్ మార్టినిక్**

**టాప్ 8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్**

**హైదరాబాద్‌లో అట్టహాసంగా వేడుకలు**


మిస్ వరల్డ్ 2025 విజేతగా నిలిచిన ఓపల్ సుచాత చవాంగ్‌కు కిరీటాన్ని ధరిస్తున్న మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా


మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న పలు దేశాలకు చెందిన సుందరీమణులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** హైదరాబాద్ వేదికగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ (ఆసియా ఖండం) సుందరి ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకున్నారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని సుచాతా చువాంగ్‌కు ధరింపజేశారు. 3వ రన్నర్ అప్ గా మిస్ మార్టినిక్(అమెరికా ఖండం), 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్(యూరప్ ఖండం), 1వ రన్నర్ అప్‌గా ఇథియోపియా (ఆఫ్రికా ఖండం) నిలిచారు. మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుచాతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కింది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు సుచాత. ఈ పోటీల్లో మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు పాల్గొన్నారు. అంతకుముందు మిస్ వరల్డ్ 2025 పోటీల్లో టాప్8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్ అయ్యారు. టాప్ 8మందిలో మార్టినిక్, బ్రెజిల్, ఇథియోపియా, నమీబియా, పోలెండ్,

>>2


శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నిరసన దీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న కవిత

# నవ చైతన్యంతో తెలంగాణ జాగృతి

## కెసిఆర్‌కు నోటీసులపై 4న మహాధర్నా

### 2న సిఎం రేవంత్ జై తెలంగాణ నినాదం చేయాలి

### ఎపి నీటిని తరలించుకుపోతుంటే సిఎం ఏంచేస్తున్నారు?

### జాగృతి కొత్త కార్యాలయం ప్రారంభించిన కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.చంద్రబాబు బనకచర్ల ద్వారా 200 టీఎంసీలు తీసుకెళ్తున్నారు. చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తామంటే రేవంత్‌రెడ్డి నోరు విప్పడం లేదు. పక్కరాష్ట్ర ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. శనివారం బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ సంస్థ భవిష్యత్ కార్యచరణతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు,ఇప్పటి కాంగ్రెస్ పాలనకు చాలా తేడా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా జైతెలంగాణ అనాలి.తెలంగాణ అమర వీరులకు నివాళులు అర్పించాలి. కనీసం జూన్ 2న జరగబోయే రాష్ట్ర

>>2

# గోశాలలకు కొత్తరూపు

## 50 ఎకరాలకు తగ్గకుండా ఏర్పాటు

### పూర్తిస్థాయి ప్రణాళికకు కమిటీ

### సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్


శనివారం హైదరాబాద్‌లో గోశాలలపై సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని సూచించిన ముఖ్యమంత్రి కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను సిఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ

>>2

## అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ వయసు 65కు పెంపు 2


ఇంగ్లండ్‌లో నాలెడ్జి సెంటర్‌ను ప్రారంభిస్తున్న కెటిఆర్

# ఇండియా ఫస్ట్ తెలంగాణ ఫస్ట్

## అదే మా విధానం: ఇంగ్లండ్‌లో నాలెడ్జి సెంటర్‌ను ప్రారంభించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** దిగ్గజ కార్పోరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలు అందించడం మనందరికీ గర్వకారణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతం, ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్ అన్నదే తన విధానం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు దొరకాలన్నారు. అందుకోసం తమ సర్వశక్తులు ఉపయోగిస్తామన్నారు. ఇంగ్లాండ్ వార్విక్ యూనివర్సిటీ లో ఏర్పాటుచేసిన పిడిఎస్ఎల్(ప్రాగ్‌మటిక్ డిసైన్ సొల్యూషన్స్ లిమిటెడ్) నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్..తెలంగాణ విజయాల గురించి మాట్లాడటానికి ఎల్లప్పుడూ తనకు

>>2

# 10న భారత్ బంద్

## మావోయిస్టుల పిలుపు


### 11 నుంచి ఆగస్టు 3 దాకా అమరవీరుల స్మారక సభలు

### కేశవరావు ఆశయాలు కొనసాగిస్తాం: అభయ్

**చర్ల, ప్రభాతవార్త:** భారత విప్లవోద్యమ నాయకుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బసవరాజ్ (నంబాలకేశవరావు) మృతి పార్టీకి తీరని లోటని ఆయన ఆశయాల సాధనకు కృషిచేస్తామని మావోయిస్టు కేంద్ర కమిటి అధికార ప్రతినిధి అభయ్ అన్నారు. ఈ మేరకు శనివారం పత్రికలకు లేఖ విడుదల చేసారు.కేంద్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు కామ్రేడ్ బసవరాజ్ సహా 27 మంది పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. కార్యకర్తలను హత్య చేయడాన్ని ఖండిస్తూ జూన్ 10న దేశవ్యాప్తంగా బంద్‌ను పాటించాలని పిలుపునిచ్చారు.

జూన్ 11 నుండి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా కామ్రేడ్ బసవరాజ్ (బీఆర్) సహా 27 మంది అమరుల స్మారక సభలు నిర్వహించాలని అన్నారు. మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటిరోజు అని ఆ రోజున దేశ ప్రధాని నరేంద్రమోదీ హోంమంత్రి అమిత్‌షాల ఆదేశాలను అనుసరించి భారత సైన్యం, పారామిలిటరీ, కమాండో బలగాలు, ఛత్తీస్ గర్ రాష్ట్ర పోలీసు బలగాలు నారాయణపూర్ జిల్లా, మాడ్ ప్రాంతంలో సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ లో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజ్ సహా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ.కు చెందిన వివిధ స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను, సభ్యులను హత్య చేసాయి. ఈ హత్యకాండ సాగించిన భద్రతా బలగాల పట్ల తనకెంతో గర్వంగా ఉందని మోదీ, ఇది

>>2



# కొవిడ్‌కు మరో ఏడుగురు మృతి

## దేశంలో 3395కి పెరిగిన కేసులు

**న్యూఢిల్లీ, మే 31:** దేశంలో కరోనా వైరస్ వేగంగా వ్యాపిస్తోంది. ఇప్పటికే కొవిడ్ కేసులు3395కు పెరిగాయి. గడిచిన 24 గంటల్లో మరో ఏడుగురు మృతి చెందారు. రాష్ట్రాల వారీగా కొవిడ్ 19 కేసులుకూడా పెరిగాయి. కేంద్ర ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం కొవిడ్ కేసుల సంఖ్య 3395కి చేరింది.కొత్తగా 685 మందికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు ఆరోగ్యశాఖప్రకటించింది. అత్యధికంగా కేరళలో1,336 నమోదయ్యాయి. మరణాల్లో ఢిల్లీ, కేరళ,యూపి,కర్ణాటకల్లోఒక్కొక్కరుచొప్పున మరణించారు. 424 కేసులతో మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానంలోఉంది. ఢిల్లీలో 294, గుజరాత్ 223, కర్ణాటక148,

>>2

# గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు ఫుల్!




## నేటితో దరఖాస్తుల గడువు పూర్తి

### 15 నుంచే ఆన్‌లైన్ క్లాసులు ఆరంభించిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు

### కొన్ని గురుకుల కాలేజీలకు సైతం రాని గుర్తింపు

### రికగ్నిషన్ కోసం కోసం 3152 కాలేజీల దరఖాస్తు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెంగాణ రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో వింత పరిస్థితి నెలకొంది. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఇప్పటి వరకు ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు రాకున్నప్పటికీ రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్లను పూర్తి చేశాయి. పూర్తి చేయడమే కాకుండా ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం క్లాసులను ప్రారంభించగా.. మరికొన్ని కాలేజీలు అయితే ఏకంగా భౌతికంగానే క్లాసులను నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల, కెజిబివి, మోడల్ స్కూల్స్ మొత్తం కలిపి 3152 కాలేజీలు 2025-26 విద్యా సంవత్సరానికి గుర్తింపు ఇవ్వడం కోసం ఇంటర్ బోర్డుకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే వాటిల్లో ఇప్పటి వరకు కేవలం 1005 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది ఇంటర్ బోర్డు. గుర్తింపు పొందిన వాటిలో 405 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా.. ప్రైవేటు కాలేజీలు 212 ఉన్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు 1364 గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో కేవలం 212 కాలేజీలకు మాత్రమే 2025-26 విద్యా సంవత్సరానికి గుర్తింపు ఇచ్చారు. మిగిలిన కాలేజీలకు శుక్రవారం సాయంత్రం వరకు గుర్తింపు ఇవ్వలేదు. గుర్తింపు రాకపోయినప్పటికీ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల ప్రక్రియు ఇప్పటికే పూర్తి చేశాయి. ప్రతి ఏడాది కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సుమారు5.40 లక్షలకిపైగా అడ్మిషన్లు జరుగుతుండగా.. వాటిలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లోనే 4 లక్షలకి పైగా అడ్మిషన్లు అవుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఆన్‌లైన్ క్లాసులను కొనసాగిస్తున్నాయి. ఇంటర్‌బోర్డు ఈనెల 1న జూనియర్ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో

>>2



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జంతు బలులను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న జంతు హక్కుల కార్యకర్తలు

# బిఆర్ఎస్.. బిజెపిలో కలిసే ప్రసక్తే లేదు

## తేల్చిచెప్పిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలవబోతుంది అనే కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగిందని, ప్రతికూల పరిస్థితుల్లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించాని చెప్పారు. తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ పార్టీని పెట్టారని, కాంగ్రెస్, టీడీపీలకు ధీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌ను కేసీఆర్ ఎదుర్కొన్నారని, తెలంగాణ సాధించి కేసీఆర్ సీఎం అయ్యి అభివృద్ధి చేశారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారని. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడవని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సీఎంగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ పాలన చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీల రాజకీయ పునాదులు కదులుతాయని చెప్పారు. పరిపాలనలో కాంగ్రెస్, బీజేపీ ప్రజల మెప్పు పొందాలి. కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని చెప్పారు. కేసీఆర్ ఆలోచనలు నాకు తెలుసు. తెలంగాణ ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లో భంగం కలగదన్నారు. తెలంగాణ ప్రజలు ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని, పార్టీలో ఏ నిర్ణయం అయినా కేసీఆర్ తీసుకుంటారని చెప్పారు.

**జూన్ 2న కాళేశ్వరంపై హారీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజంటేషన్**

జూన్ 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారు అని మధుసూదనాచారి తెలిపారు. కాళేశ్వరంప్రాజెక్టుపై కాంగ్రెస్,బీజేపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, వాస్తవాలనుప్రజల ముందు ఉంచాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు హారీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు.

# 10న భారత్ బంద్

>> చారిత్రాత్మక విజయమని అమిత్ షాలు ప్రకటించారు. ఈ ప్రకటనల ద్వారా వారు తమ రక్తపిపాస నరహంతక స్వభావాన్ని మరోమారు ప్రకటించుకున్నారని విమర్శించారు.

మార్చి చివరి వారంలో జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వంలో హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ ఏర్పడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రకటన విడుదల చేసిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పిస్తే మా పార్టీ అందుకు సిద్ధమేనని మార్చి 28న పత్రికా ప్రకటన ద్వారా మా వైఖరిని ప్రకటించామని, ఆ తర్వాత రెండు సార్లు మా కేంద్రకమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ అభయ్, దండకారణ్య స్పెషల్ జోన్ లోని ఉత్తర్ పశ్చిమ్ సబ్ జోన్ల మీడియా ప్రతినిధి కామ్రేడ్ రూపేష్ రెండు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖగార్ యుద్ధాన్ని ఆపివేసి శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పించాలని కోరారని పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 85 మంది కామ్రేడ్స్ ను హత్య చేసారని ఏప్రిల్ 21 నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని బొకారో జిల్లాలో మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ (ప్రయాగ్ మాంజీ)ని హత్య చేసారని, 24 ఏప్రిల్ నుండి మే 8 మధ్య కుర్రెగుట్టల్లో 31 మందిని హత్యచేసారు. గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు దాదాపు 540 మంది విప్లవకారులను, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడుతున్న సాధారణ ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేసాయని, మావోయిస్టు రహిత భారత్ ఏర్పాటు కోసం మార్చి 31, 2026 వరకు ఈ హత్యకాండను కొనసాగిస్తామని దేశప్రధాని, హోంమంత్రులు పదే పదే ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించినప్పటి నుండి దాదాపు గత 2 నెలలుగా మేము ప్రభుత్వ సాయుధ బలగాలపై దాడులు చేయకుండా సంయమనం పాటించామని, ఈ స్థితిలో శాంతి చర్చలకు సిద్ధంగా లేని బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన, విశాలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా యావత్తుదేశ ప్రజానీకానికిపిలుపునిస్తున్నట్ల పేర్కొన్నారు.

# గోశాలలకు కొత్తరూపు

>> విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**ఉద్యోగుల సమస్యలపై త్రిసభ్య కమిటీ నివేదిక**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారుల త్రిసభ్య కమిటీ తన నివేదికను మంత్రుల సబ్ కమిటీకి సమర్పించింది. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 57 ప్రధాన సమ్యలపై ఉద్యోగ సంఘాలు కమిటీకి తెలిపాయి. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంఘాల నేతలు కోరారు. ఈ నేపథ్యంలో త్రిసభ్య కమిటీ తన నివేదికను శనివారం మంత్రుల సబ్‌కమిటీకి సర్పించింది. కమిటీ నివేదిక నేపథ్యంలో త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రుల సబ్ కమిటీ భేటీ కావాలని నిర్ణయించినట్టు తెలిసింది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కార కోసం రాష్ట్ర ప్రభుత్వం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్‌తో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగ సంఘాలతో భేటీ అయిన త్రీమెన్ కమిటీ వారి సమస్యలకు సంబంధించిన విజ్ఞాపన పత్రాలు స్వీకరించింది. వాటిపై రూపొందించిన నివేదికను అధికారుల కమిటీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఏర్పడిన సబ్ కమిటీకి శనివారం సాయంత్రం ప్రజాభవన్‌లో అందజేసింది. సబ్ కమిటీలో సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు సమావేశానికి హాజరయ్యారు. అధికారుల నుంచి నివేదిక స్వీకరించిన సబ్ కమిటీ ఆ నివేదికను పూర్తిగా అధ్యయన చేసి అతి త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం కావాలని నిర్ణయించింది. నివేదికలోని అంశాలను ఉద్యోగ సంఘాలతో చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి అనుమతితో సమస్యల పరిష్కారం చేయాలని సబ్ కమిటీ భావిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ఏమి చేయనుంది రాష్ట్ర అవతర దినోత్సవమైన జూన్ 2న ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# నేడు ఎడ్ సెట్ పరీక్ష

## నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

## 38,758 మంది దరఖాస్తు

## 2 సెషన్‌లలో పరీక్ష నిర్వహణ

## 74 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడీ కాలేల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 పరీక్షను నేడు(ఆదివారం) నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోనికి అనుమతించ బోరని అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడ్‌సెట్-2025కి 38,758 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 7,218 మంది పురుషులు ఉండగా, 31,539 మంది మహిళలున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మరో సెషన్‌ను నిర్వహించనున్నారు. పరీక్షను సిబిటి విధానంలో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రంలోనికి పరీక్షకు 2 గంటల ముందునుంచే అనుమతించనున్నట్టు అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని.. ఆలస్యం కాకుండా చూసుకోవాలని అధికారులు తెలిపారు.

# అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ వయసు 65కు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయస్సును పెంచుతూ జీఓ జారీ చేసింది. ఈ మేరకు శనివారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంపుతో పాటు, పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష ఉండగా తాజా ఉత్తర్వుల్లో దానిని రూ. 2 లక్షలకు పెంచింది. అంగన్‌వాడీ హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 50వేలు ఉండగా దాన్ని రూ. లక్షకు ప్రభుత్వం పెంచింది. అంగన్‌వాడీ సిబ్బంది పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు కాగా, వివిధ కారణాలతో 60 ఏళ్లు దాటిన తరువాత విఆర్ఎస్ తీసుకునే టీచర్లు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్తింపచేయనున్నట్లు ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## వారం - వర్జ్యం

తేది : 01-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి సా.8.06
ఆశ్లేష రా.9.41
వర్జ్యం ఉ.10.11-11.49
దు.సా.4.49-5.41
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

మేషం : పారిశ్రామిక, రాజకీయ, కళారంగాలలోని వారికి సన్మానాల యోగం ఉంటుంది.

వృషభం : గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. వృత్తి-వ్యాపారాలలో అనుకూలంగా వుంటుంది.

మిథునం: రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అనవసర ఆహ్వానాలు అందుతాయి.

కర్కాటకం : తండ్రి నుండి కీలక సమాచారం అందుకొంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

సింహం:జీవితభాగస్వామ్య సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

కన్య : కుటుంబ సమస్యలు తీరిపోవడం వల్ల ప్రశాంతత లభిస్తుంది. సంఘంలో గౌరవంపొందుతారు.

తుల : సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మీలోని ప్రతిభా పాటవాలకు గుర్తింపు లభిస్తుంది.

వృశ్చికం: పూర్వపు మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. స్థలాలు కొంటారు.

ధనస్సు: ఊహించని విధంగా ఆహ్వానాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

మకరం: రచన, వ్యాసంగాల వల్ల అధిక ఆసక్తి చూపుతారు. పండితులు, ప్రముఖులను కలుస్తారు.

కుంభం: కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్త్రలాభం.

మీనం : ఆరోగ్యంవల్ల చెల్లించవలసిన అవసరం. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కేశ, హైదరాబాద్



శనివారం హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న పలు దేశాలకు చెందిన సుందరీమణులు



శనివారం హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ ఫైనల్స్‌లో సిఎం రేవంత్

# 'మిస్ వరల్డ్' థాయ్ సుందరి

>> ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ దేశాల సుందరీమణులు నిలిచారు. ఖండాల వారీగా టాప్ ఇద్దరి నుంచి ఒక్కరిని ఎంపిక చేశారు. నువ్వు మిస్ వరల్డ్ అయితే ఏం చేస్తావు అని అడిగిన ప్రశ్నకు 45 సెకన్లలో మెరుగైన సమాధానం ఇచ్చిన వారికి నిర్వాహకులు అవకాశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,మంత్రి పొన్నం ప్రభాకర్.మెగాస్టార్ చిరంజీవి తదితరులు హాజరయ్యారు. మిస్ వరల్డ్ విజేతకు సిఎం రేవంత్‌రెడ్డి లేచి నిలబడి చప్పట్ల ద్వారా అభినందనలు తెలిపారు. 72వ మిస్ వరల్డ్ ఫైనల్స్ అట్ట హాసంగా శనివారం సాయంత్రం హైటెక్స్ వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. మిస్ వరల్డ్ కోసం ఫైనల్‌కు చెరిన వారు పోటీపడ్డారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటడంతో పాటు తెలంగాణలో ప్రముఖ పర్యాటక,ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. మిస్ వరల్డ్ ఫైనల్ ప్రారంభానికి ముందు 71వ మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిజ్కోవా అద్భుతమైన డ్రెస్‌తో హర్షధ్వానాల మధ్య స్టేజ్‌పైకి విచ్చేశారు. కాగా, మిస్ వరల్డ్ జడ్జీలుగా జూలియా మోర్లీ(మిస్ వరల్డ్ సీఈఓ),సోనూ సూద్(ప్రముఖ నటుడు), సుధారెడ్డి(మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్), రానా దగ్గుబాటి(సినీ హీరో),జయేశ్ రంజన్,మనూషి చిల్లర్(బాలీవుడ్ నటి),నమ్రత శిరోద్కర్,డోనా వాల్ష్, డాక్టర్ కరినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014)వ్యవహరించారు.

**సోనూ సూద్‌కు హ్యూమానిటేరియన్ అవార్డు**

కాగా, ప్రముఖ నటుడు సోనూ సూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు వేదికపై ప్రధానం చేశారు. కరోనా సమయంలో ఆయన చేసిన మానవతా చర్యలు గుర్తింపుగా అవార్డు అందించారు. రానా దగ్గుబాటి చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. స్టేజ్‌పైన వదల బొమ్మాళీ డైలాగ్ చెప్పి ప్రేక్షలను సోనూ సూద్ ఉత్సాహ పరిచారు. తర్వాత మిస్ వరల్డ్ ఫైనల్స్ ముందు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల వెలుగులో ఖండాల వారీగా అద్భుతంగా డిజైన్ చేసిన స్టేజీపై 108 దేశాల ప్రతినిధులు ర్యాంపు వాక్ చేశారు. తర్వాత ఒక్కో ఖండం నుంచి 10 మంది ఫాస్ట్ ట్రాక్ విన్నరల్‌ను ఫైనల్ ఈవెంట్‌కు నిర్వాహకులు పరిచయం చేశారు. అద్భుతమైన ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వానికి,టూరిజం శాఖకు సుధారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మిస్ వరల్డ్ బ్యూటీ విత్ పర్పస్‌గా మిస్ ఇండోనేషియా ఎన్నికైంది. పరిశుభ్రమైన నీరు అందరికీ అవసరమనే విషయంపై ఆమె ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా, ఫైనల్స్‌లో నిర్వాహకులు ఖండాల వారీగా టాప్ 10 నుంచి ఐదుగురిని షార్ట్ లిస్ట్ చేశారు. తర్వాత ఇద్దరేసిని షార్ట్ లిస్ట్ చేశారు. ఈ క్రమంలో మిస్ వరల్డ్ నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా నిష్క్రమించారు. తర్వాత ఖండాల వారీగా టాప్ ఇద్దరి నుంచి ఒక్కరిని షార్ట్ లిస్ట్ చేశారు.జడ్జీలు అడిగిన ప్రశ్నలకు కంటెస్టెంట్‌లు ఇచ్చిన సమాధానాల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. ఫైనల్ పోటీ ప్రారంభంలో బాలీవుడ్ స్టార్ ఇషాన్ కట్టర్ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఉర్రూతలూగించారు.

**ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్ , సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం కావటంపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో, దిశానిర్దేశంతో అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ వేడుకలను తెలంగాణలో ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మిస్ వరల్డ్ సంస్థ, ప్రపంచ వ్యాప్తంగా పాల్గొన్న పోటీదారులు, అధికారులు, అవిశ్రాంతంగా శ్రమించిన బృందాలు, విభాగాలు సహాయకుల అసమానమైన అంకితభావం, సమన్వయంతో కృషి చేసిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమగ్ర కార్యాచరణ, సమన్వయంతో నిర్విరామంగా కృషి చేయడం వల్ల ఈ ఈవెంట్ ఇంత గ్రాండ్ సక్సెస్ అయిందని చెప్పారు.అందరి సహకారంతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చెప్పగలిగామని పేర్కొన్నారు. సాంస్కృతిక వినిమయాన్ని ప్రోత్సహించే, తెలంగాణను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపే అంతర్జాతీయ కార్యక్రమాలను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రం సదా సమాయత్తంగా ఉంటుందని మంత్రి పునరుద్ఘాటించారు. 2025 మిస్ వరల్డ్ విజేతకు మంత్రి జూపల్లి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు



గౌహతిలో శనివారం భారీ వరదలతో చెరువులను తలపిస్తున్న రహదారిపై పడవల్లో ప్రజలను తరలిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

# నవ చైతన్యంతో తెలంగాణ జాగృతి

>> అవతరణ దినోత్సవం రోజైనా ఆయన జైతెలంగాణ నినాదంచేయాలని ఆమె డిమాండ్ చేశారు.జై తెలంగాణ అనని, అమరవీరులకు నివాళులు అర్పించని వ్యక్తి సీఎంగా అనర్హుడు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన రాజీవ్ యువ వికాసం పథకం పేరుపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. "జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు?రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం? తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదు. తెలంగాణ యువ వికాసం అని పేరు పెట్టాలి" అని ఆమె వ్యాఖ్యానించారు. బీజేపీ లక్ష్యంగా కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని, పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆమె హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా తమ పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్‌కు తాము అండగా ఉంటామని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌పై ఈగ వాలినా మేం సహించం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే అది యావత్ తెలంగాణ ప్రజానీకానికి నోటీసులు ఇచ్చినట్లేనన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఆయన ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు. తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్ అని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మహాధర్నాలో నోటీసుల వెనుక ఉన్న కుట్రను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. నదీ జలాల పంపిణీ విషయంలోనూ కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "గోదావరి-కావేరీ నదుల అనుసంధానంతో తెలంగాణకు రావాల్సిన నీళ్లు శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉంది.బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తరలించుకుపోతుంటే సిఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. నదుల అనుసంధానాన్ని కేసీఆర్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. కానీ, కేంద్రం ఇచ్చంపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని చెబుతోందని చెప్పారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నదీ జలాలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలని సిఎంను కోరారు. తెలంగాణ జాగృతి ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిని కూడా కవిత గుర్తు చేసుకున్నారు. "కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే తెలంగాణ జాగృతిని ఏర్పాటు చేశాం" అని ఆమె తెలిపారు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పని చేస్తామని, ఒక కన్ను బీఆర్ఎస్ అయితే, రెండోది జాగృతి సంస్థ అని పునరుద్ఘాటించారు. గతంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ జాగృతి కార్యక్రమాలు చేపట్టినప్పుడు అనేక అవరోధాలు ఎదురయ్యాయని, తెలంగాణ జాగృతి అంటేనే మిమ్మల్ని తొక్కేస్తారు అని చాలా మంది మేధావులు హెచ్చరించారు. ఆంధ్ర పాలకుల వివక్ష తీవ్రంగా ఉన్నప్పటికీ, వెనకడుగు వేయకుండా ముందుకు సాగాం అని కవిత వివరించారు. తెలంగాణ జాగృతి సంస్థ ఆవిర్భావం, ప్రస్థానం గురించి కవిత వివరిస్తూ, కేసీఆర్, ఆచార్య జయశంకర్ సార్‌ల స్ఫూర్తితో తెలంగాణ జాగృతి ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి నేటికి 18సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇన్నాళ్లూఅశోక్‌నగర్‌లోని కార్యాలయం నుంచి కార్యకలాపాలు నిర్వహించామని చెప్పారు.. యూఎస్ నుంచి వచ్చాక జయశంకర్ మాకు మార్గదర్శనం చేశారని తెలిపారు.

# ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్

>> గర్వంగా ఉంటుందన్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినందుకు పిడిఎస్ఎల్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఆటోమొబైల్ రంగంలో పిడిఎస్ఎల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పిడిఎస్ఎల్ తమ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరిన కేటీఆర్, ఇంగ్లాండ్ లో యూనివర్సిటీ, ఇండస్ట్రీల మధ్య ఉన్న పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ, వార్విక్ యూనివర్సిటీలో తన నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించుకోవడం తెలంగాణ టాలెంట్‌కు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఆటోమోటివ్ హబ్ గా పూణే, చెన్నైల సరసన హైదరాబాద్ నిలిచిందన్నారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్ తో పాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు. ఆటోమోటివ్ రంగంలో కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కే పరిమితం కాకుండా తయారీ రంగంలో కూడా తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీలు ఉపయోగపడతా యన్నారు. భారతదేశంలో ఫార్ములా ని రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్న కేటీఆర్, పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందన్నారు. తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందన్నారు. పిడిఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల మాట్లాడుతూ..కేటీఆర్ ఆలోచనలు, పనితీరు కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఆయన చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషి తో ఐటీ ఒక్కటే కాదు అనేక రంగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలబడిందన్నారు. అనేక దిగ్గజ కంపెనీలను హైదరాబాద్ కు రప్పించి తన పనితీరు ఆలోచనా దృక్పథంతో గ్లోబల్ లీడర్ గా ఎదిగిన కేటీఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్ ను ప్రారంభించుకోవడం తమ కంపెనీ కి అత్యంత గౌరవం అన్నారు. నాలెడ్జ్ సెంటర్ ను ప్రారంభించిన ఆనంతరం అక్కడ జరిగే కార్యకలాపాలను కేటీఆర్ పరిశీలించారు. తమ సంస్థ గురించి పిడిఎస్ఎల్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఆ తరువాత కంపెనీ సిబ్బంది,ఉద్యోగులతో కేటీఆర్ ఇంటరాక్ట్ అయ్యారు.

# గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు ఫుల్!

>> మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నెల 31 వరకు అంటే నేటి(శనివారం)తో అడ్మిషన్ల దరఖాస్తు గడువు ముగియనుంది. అడ్మిషన్ల దరఖాస్తు గడువు మే 31తో ముగిసినప్పటికీ .. అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30లోగా పూర్తి చేయాలని నోటిఫికేషన్‌లో ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. అదే నోటిఫికేషన్‌లో గుర్తింపులేని కాలేజీల్లో విద్యార్థులెవరూ అడ్మిషన్లు తీసుకోవద్దని ఇంటర్ బోర్డు సూచించింది. కానీ రాష్ట్రంలోని 80 శాతానికిపైగా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు ఇప్పటికీ ఇంటర్ బోర్డు గుర్తింపు రాలేదు.. అయినప్పటికీ ఆయా కాలేజీలను అడ్మిషన్లను పూర్తి చేశాయి. ఇప్పటి వరకు గుర్తింపు రాకున్నా అడ్మిషన్లను తీసుకున్నారని పేర్కొంటూ గుర్తింపు రాని ఏ ఒక్క కాలేజీకి కూడా ఇంటర్ బోర్డు నోటీసులను జారీ చేసినట్టు సమాచారం లేదు. అయితే రాష్ట్రంలో కొనసాగుతున్న 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కూడా శుక్రవారం సాయంత్రం వరకు 424 కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 415 కాలేజీలకి ఇంటర్ బోర్డు గుర్తింపును ఇచ్చింది. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు 30 వేలు దాటనట్టుగా తెలుస్తోంది. జిల్లాల నుంచి పూర్తి సమాచారం ఇంటర్ విద్య కమిషనరేట్‌కి అందించనట్టు తెలుస్తోంది. ఈ నెల 1 నుంచి 31 వరకు అడ్మిషన్లు తీసుకోనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. జూన్ 2 నుంచి క్లాసులను ప్రారంభించాలని.. జూన్ 30లోపు మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వులో పేర్కొంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అపరాధ రుసుం లేకుండా మే 4 వరకు.. అపరాధ రుసుంతో జూన్ 8 వరకు అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీలు, కంపోజిట్ కాలేజీలు అన్ని కూడా ఈ షెడ్యూల్‌ను అమలు చేయాలని బోర్డు కార్యదర్శి ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 3152 కాలేజీలు ఇంటర్ బోర్డు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో 1005 కాలేజీలకు గుర్తింపును ఇచ్చింది. గత ఏడాది మొత్తం 3247 కాలేజీలు గుర్తింపు పొందాయి. బిసి గురుకులాలు 239 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా.. 66 కాలేజీలకు గుర్తింపును ఇచ్చారు. కెజిబివిల్లో 296 దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 40 కెజిబివిలకు అనుమతించారు. మోడల్ స్కూల్స్‌లో 192 దరఖాస్తు చేసుకోగా ..61కి అనుమతి లభించింది. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు 1364 దరఖాస్తు చేసుకోగా అందులో 212 కాలేజీలకు గుర్తింపు ఇచ్చారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల జూనియర్ కాలేజీలు 233 దరఖాస్తు చేసుకుంటే ..వాటిలో 57 కాలేజీలకి గుర్తింపు ఇచ్చారు. మైనారిటీ గురుకుల కాలేజీలు 194 దరఖాస్తు చేసుకుంటే వాటిలో 90 కాలేజీలకు గుర్తింపు వచ్చింది. ట్రైబల్ గురుకుల కాలేజీలు 114 దరఖాస్తు చేసుకోగా అందులో 46 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది ఇంటర్ బోర్డు.

# కొవిడ్‌కు మరో ఏడుగురు మృతి

>> తమిళనాడు148, పశ్చిమ బెంగాల్‌లో116 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. రాజస్థాన్ లో 51, ఉత్తరప్రదేశ్ 42, పుదుచ్చేరి 25, హరియాణా 20, ఆంధ్రప్రదేశ్ 16, మధ్యప్రదేశ్ 10, గోవా 7, ఒడిశా4, పంజాబ్4, జమ్మూకశ్మీర్4, తెలంగాణ3, అరుణాచల్ ప్రదేశ్ 3, చండీగఢ్3, మిజోరం2, అసోం2 చొప్పున కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. గతవారంలో 5 రెట్ల వేగంతో కొవిడ్ కేసులు పెరిగినట్టు అధికారులు చెప్పారు. కరోనా వైరస్ కారణంగా మహారాష్ట్రలో ఇద్దరు, దిల్లీ, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, తమిళనాడులో ఒక్కొక్కరు చొప్పున చనిపోయారు. వైరస్ వ్యాప్తి వేగంగా జరగుతుండడం, మరణాలు కూడా క్రమంగా పెరగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కొవిడ్ లక్షణాలు ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపవద్దని ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విడిగా ఉండాలని, వైద్యుల సలహాలు, సూచనలు అనుసరించి మందులు వాడాలని చెబుతున్నారు. రుచి, వాసనలను కోల్పోవడం లేదా వాటిని గుర్తించే సామర్థ్యం తగ్గడం, చలి, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం ఈ లక్షణాలు ఉన్నవారు కూడా కరోనా టెస్ట్‌లు చేయించుకోవడం మంచిది.

# నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్‌తో తెలంగాణ జూడాల భేటీ

## పిజి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ జూనియర్ డాక్టర్లు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసి) ఛైర్మన్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు పిజి విద్యార్థుల సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసు కొచ్చారు. శనివారం ఎన్ఎంసీ ఛైర్మన్ డాక్టర్ బిఎన్ గంగాధర్‌తో సమావేశమైన జూడాలు .. పిజి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అలాగే జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న అధిక ఒత్తిడి, తీవ్రమైన విధులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరాన్ని వివరించినట్టు తెలిపారు. తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జుడా)లతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని.. విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు ఎదుర్కొం టున్న సమస్యలను నిరంతరం చర్చించి పరిష్కరించాల్సిందిగా ఎన్ఎంసీకి విజ్ఞప్తి చేసినట్టు జూడా అధ్యక్షులు ఐజాక్ న్యూటన్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటితోపాటు తెలంగాణలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఉన్న స్టైపెండ్ సమస్యలను కూడా ఎన్ఎంసి ఛైర్మన్‌కు వివరించినట్టు తెలిపారు.



# కుమారుడి పెళ్లికి రావాల్సిందిగా సిఎం రేవంత్‌కు నాగార్జున ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** అక్కినేని ఇంట మరోసారి పెళ్లిబాజాలు మోగనున్నాయి. గతేడాది నాగార్జున పెద్దకుమారుడు నాగ చైతన్యశోభితా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన చిన్నకొడుకు అఖిల్ కూడా పెళ్లి చేసుకోబోతున్నారు. ప్రముఖ బిజినెస్‌మెన్ జుల్ఫీ రవ్‌డ్జీ కుమార్తె జైనబ్‌తో గతేడాది నవంబర్ 26న అఖిల్ నిశ్చితార్థం జరిగింది. జూన్ 6న అఖిల్ జైనబ్ పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. దీంతో తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని నాగార్జున ఆహ్వానించారు. శనివారం ఉదయం భార్య అమల, వియ్యంకులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిశారు. అనంతరం అఖిల్ వెడ్డింగ్ కార్డుని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా నాగార్జున దంపతులు సీఎం రేవంత్ రెడ్డితో కాసేపు ముచ్చటించారు. కాగా, అన్నపూర్ణ స్టూడియోలో అఖిల్ వివాహం జరుగు తుందని సమాచారం. ఆ తర్వాత రాజస్థాన్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# అథఃపాతాళానికి గురుకులాలు

## బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** సీఎం రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు అధఃపాతాళానికి వెళ్తున్నాయని బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. సీఎం నిర్లక్ష్యం వల్ల అనేకమంది పేద పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు వాళ్ళ టాయిలెట్స్ వాళ్ళు కడుక్కుంటే తప్పు ఏంటని ఒక ఐఏఎస్ అధికారి అంటున్నారు. మరి రేవంత్ రెడ్డి ఇంట్లో టాయిలెట్ రేవంత్ రెడ్డినే కడుగుతున్నారా? మీ మంత్రుల ఇళ్ళల్లో వాళ్ళ టాయిలెట్స్ మంత్రులే కడుగుతున్నారా? మీ పిల్లల స్కూల్లో టాయిలెట్స్ మీ పిల్లలే కడుగుతున్నారా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు. ఎస్సీ వర్గాల పట్ల ఐఏఎస్ అలుగు వర్షిణి వివక్ష చూపుతున్నారు. పేద పిల్లలు టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎట్లా చెప్పిస్తారు? గురుకులాల్లో చదువుకునే పిల్లలు సంపన్న వర్గాల నుంచి రాలేదని అలుగు వర్షిణి అంటున్నారు. సంపన్న వర్గాల పిల్లలకు ఒక రూల్, పేద పిల్లలకు ఒక రూల్ ఉందా రేవంత్ రాజ్యాంగంలో. మరి మేము మీ ప్రభుత్వానికి పన్నులు ఎందుకు కట్టాలి? ఇదేనా మీ రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని చెప్తున్న రాజ్యాంగం? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# ఆహార కమిషన్ కార్యదర్శి నరేందర్ విఆర్ఎస్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఆహార కమిషన్‌లో సభ్య కార్యదర్శిగా పని చేస్తున్న నరేంద్రరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ఆయన్ను, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫుడ్‌కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. అంతకు ముందు ఆయన సచివాలయంలో రెవెన్యూశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసేవారు. ఏఎస్‌వోగా సచివాలయ సర్వీసులోకి వచ్చిన నరేంద్రరావు సెక్షన్ అధికారిగా, సహాయ కార్యదర్శిగా, డిప్యూటీ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా పదోన్నతులు పొందారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి పదేళ్లుగా సచివాలయ ఉద్యోగులసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు.



వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లిం సంఘాల నేతలు

# వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

## తెలంగాణ, ఎపి జెఎసి, పలు ముస్లిం సంఘాల నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 31, ప్రభాతవార్త:** వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని తెలంగాణ, ఎపి జాయింట్ యాక్షన్ కమిటీ,పలు ముస్లిం సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్రం ఇటీవల తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మార్చ్, భారీ బహిరంగ సభ నిర్వ హించారు. ఈ సభకు జెఎసి కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్, ఎంబిటి అధ్యక్షుడు మాజిదుల్లాఖాన్, ఫరహత్, కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎంపిలు వి.హనుమంత రావు, అజీజ్‌పాషా, కాంగ్రెస్ నేత ఒసామా మహ్మద్ తదితరులు పెద్దఎత్తున హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టం వల్ల ముస్లింల వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యా క్రాంతమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై పునరాలోచన చేసి, ఉపసంహరించుకోవాలని, లేదా దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని మార్చే హక్కు బిజెపికి లేదని, ఈ నల్ల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు ముస్లిం మైనారిటీలంతా ఏకతాటిపైకి వచ్చి, పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు టిఎఫ్ఆర్‌సి షాక్!

## విద్యార్థులకు చెల్లించిన స్టయిపెండ్ వివరాలను 10లోగా అందించాలి: రెగ్యులేటరీ కమిటీ లేఖలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు విద్యార్థులకు సక్రమంగా స్టయిపెండ్ చెల్లించడం లేదని.. అలాగే ప్రైవేటు మెడికల్ కాలేజీలు నిబంధనలను పాటించకపోవడంపై తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సి) సీరియస్ అయింది. వెంటనే వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ప్రైవేటు మెడికల్ కాలేజీలకు లేఖలు రాసింది. జూన్ 10లోగా పూర్తి వివరాలను అందించాలని పేర్కొంటూ టిఏఎఫ్ఆర్‌సి లేఖలో స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటా (ఎ-కేటగిరి),మేనేజ్‌మెంట్ కోటా (బి-కేటగిరి) కింద అడ్మిషన్ పొందిన యుజి విద్యార్థులతోపాటు పిజి విద్యార్థుల నుండి తమ కార్యాలయానికి ఫిర్యాదు అందిందని లేఖలో ఏఎఫ్ఆర్‌సి పేర్కొంది.

మెడికల్ కాలేజీలు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసి)నిబంధనలను పాటించకుండా యూజిసి, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదులు అందినట్టు తెలిపింది. విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాల చెల్లింపులో అక్రమాలు జరుగుతున్నాయని.. విద్యార్థులను బెదిరించి మానసికంగా వేధిస్తున్నారని వాటితోపాటు పారదర్శకత లేని ఫీజు పద్ధతులను అవలంభిస్తున్నారని.. దాంతోపాటు ధృవపత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన స్టయిఫండ్‌ని తరువాత కాలేజీ యాజమాన్యాలు బలవంతంగా ఆ మొత్తాన్ని విద్యార్థుల నుండి తిరిగి వసూలు చేస్తున్నాయని.. ఇంకా కొంతమంది వైద్య కళాశాల అధికారులు "మీ జీవితం మా చేతుల్లో ఉంది" అంటూ బెదిరిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారని ఏఎఫ్ఆర్‌సి తన లేఖలో పేర్కొంది.

ఇటువంటి చర్యలు అనైతికమే కాకుండా జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి), విశ్వవిద్యాలయ నిధుల కమిషన్ (యుజిసి) రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధమని తెలిపింది. ఇటువంటి పద్ధతులు విద్యార్థులకి సంబంధించిన విద్యతో పాటు వ్యక్తిగత శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని పేర్కొంది. అంతేకాకుండా రాష్ట్రంలోని వైద్య విద్య ఖ్యాతిని దెబ్బతీస్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో .. విద్యార్థులను మానసికంగా వేధించడం, బెదిరించడం. పారదర్శకత లేని ఫీజు పద్ధతులు.. సర్టిఫికెటు, ధృవ పత్రాలను నిలిపివేయడంతోపాటు.. విద్యార్థులకు చెల్లించిన స్టయిఫండ్ వివరాలకు సంబంధించిన సమాచారాన్ని, విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ అయిన మొత్తాన్ని స్పష్టంగా తెలిపేలా రుజువులతో (నెలవారీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, నెలవారీ లావాదేవీ రికార్డులు) సమర్పించాలని ఏఎఫ్ఆర్‌సి ప్రైవేటు మెడికల్ కాలేజీలను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను జూన్ 10 తేదీలోపు అందించాలని ఆదేశించింది.

# సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

## సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయ శాఖ ఒప్పందం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న వానాకాలం సీజనుకు పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను పంపిణీ చేసేందుకు గాను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో రాష్ట్ర వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకొన్నది. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం వ్యవసాయ శాఖ ఒక ప్రకటనలో ఇప్పటివరకు 89,302.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఆగ్రో రైతు సేవకేంద్రాలలో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు పేర్కొంది. తద్వారా ఇప్పటివరకు 1,17,912 మంది రైతులు 56,262.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేసినట్లు తెలిపింది. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 33,040 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. ఇప్పటికే నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఒక్కో కిట్ రూ.635 చొప్పున 750 ఎన్. ఎస్.సి కిట్లను పంపిణీ చేసిందని చెప్పింది.

# సీట్లు అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ కళాశాలలు

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇంజనీరింగ్ కళాశాలలు విచ్చలవిడిగా సీట్లు అమ్ముకుంటున్నాయని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ ఆరోపించారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం మాట్లాడారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 170కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల్లో లక్షా 50 వేల సీట్లు భర్తీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కళాశాలల్లో 30శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద ఉంటాయని, వీటిని కళాశాలలు నింపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తుందన్నారు. ప్రతీ సంవత్సరం జూన్ మొదటి వారం కల్లా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఒక సర్క్యులర్ జారీ చేసి, మేనేజ్మెంట్ సీట్లు ఎలా భర్తీ చేయాలో మార్గదర్శకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కానీ ఈ యేడాది మే నెల మొదటి వారం నుంచే కొన్ని ప్రైవేట్ కళాశాలలు మెరిట్ లేకుండా, అధికంగా డబ్బు చెల్లించే వారికి మేనేజ్మెంట్ సీట్లు అమ్మకానికి పెట్టిన పరిస్థితి నెలకొందన్నారు. ఒక్కొక్క సీటుకు 15 నుండి 20 లక్షల రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. గత సంవత్సరం విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో చెర్మన్ బాలకృష్ణ రెడ్డి వచ్చే ఏడాది నుంచే మేనేజ్‌మెంట్ సీట్లను మెరిట్ ఆధారంగా ప్రభుత్వమే భర్తీ చేస్తుందని ప్రకటించారని, కానీ ఈ ఏడాది మళ్లీ అదే పాత పరిస్థితి పునరావృతం అవుతంద న్నారు. గతంలో ఇచ్చిన హామీ ఏమైంది? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థుల రిజర్వేషన్ హక్కులు నష్టపో తున్న విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? అంటూ ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలపై నియంత్రణ లేకుం డా వైస్‌చాన్సలర్లు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న పరిస్థితిని వెంటనే ఆపాలని, విద్యార్థుల భవిష్య త్తును రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.

# 8 మంది నక్సల్స్ లొంగుబాటు



## 'పోరు కన్నా ఊరు మిన్న' కింద లొంగిన మావోయిస్టులకు ఆర్థిక సాయం

**ములుగు జిల్లా క్రైమ్, ప్రభాతవార్త:** గడచిన సంవత్సర కాలంగా మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఎదురు కాల్పుల ఘటనలతో, పోలీసులకు లొంగిపోతున్న మావోయిస్టులతో తెలంగాణలో మావోయిస్టులు తుడిచి పెట్టుకుపోతు న్నారనే సంకేతాలు కనబడు తున్నాయి. ఈ క్రమంలోములుగు జిల్లాలో ఎనిమిది మంది మావోయిస్టులు శుక్రవారం ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. లొంగిపోయిన వారి వివరాలు.. దోర్పెట్టి మిర్గు అలియాస్ లింగ అలియాస్ శివలాల్(35),మడవి టిడో అలియాస్ రామె(25), మిడియం బీమా (32),ఉయిక అనిత(22), మడకం (30), సోయం భీమ్ (28),మడవి మడక అలియాస్ గుడ్డు (20), మడవి ఇడుమ అలియాస్ భాస్కర్(38). శాంతి మార్గాన్ని ఆశ్రయించిన వారికి ములుగు ఎస్పీ తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25,000 చెల్లించి ప్రభుత్వ పునరావాస పథకాల ద్వారా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం "పోరు కన్నా ఊరు మిన్న" అనే పేరుతో లొంగిన మావోయిస్టులకు ఆర్థిక సహాయం అందిస్తుంది అని, మళ్లీ తమ ఊరికి వెళ్లాలని ఇది మంచి పరిణామం అని పేర్కొన్నారు. తెలంగాణలో మావోయిస్టులకు స్థానం లేదని, తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్న ఈ సమయంలో ఇతర రాష్ట్రాల మావోయిస్టులు చొరబడేందుకు యత్నిస్తే, తెలంగాణ పోలీసు శాఖ సహించబోదని స్పష్టం చేశారు. భద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులు తమ కాలం చెల్లిన సిద్ధాంతాలను వదిలేసి ప్రజల మధ్య జీవించాలి అని, ప్రభుత్వం వారిని స్వాగతిస్తుంది అని, స్వచ్ఛందంగా లొంగిపోతే పూర్తి సహకారం అందిస్తాం అని ఎస్పీ శభరీష్ పిలుపునిచ్చారు. ఈ లొంగుబాటుతో ములుగు జిల్లాలో శాంతికి మరింత బలం చేకూరనుంది అని, మావోయిస్టుల నుంచి, మావోయిస్టు ప్రభావిత గ్రామా లకు ఇది ఓ సానుకూల సంకేతంగా భావిస్తున్నామని అన్నారు.

# వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య ప్రవేశానికి నోటిఫికేషన్


## తెలంగాణ విద్యార్థులకే అన్ని సీట్లు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విద్యాల యాల పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం కింద గత పదేళ్లుగా 85 శాతం స్థానికులకు, 15 శాతం ఏపీ విద్యార్థులకు కోటా ఉండగా, ఈసారి మొత్తం సీట్లను తెలంగాణ విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. ఎస్సీ వర్గీకరణను ఈ ప్రవేశాల్లో తొలిసారిగా అమలు చేయనున్నారు. అలాగే వ్యవసాయ కూలీల కుటుంబాలకు తొలిసారిగా 15శాతం సీట్లు కేటాయించారు. ఉద్యాన వర్సిటీ పరిధిలో 40 శాతం సీట్లను, వ్యవసాయ, పశువైద్య వర్సిటీల పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాల విద్యార్థులకు కేటాయిస్తారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి లేదా వారి తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జాబ్‌కార్డు ఉండాలి. అంతే కాకుండా విద్యార్థి 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మధ్య కనీసం 4 ఏళ్లు ప్రభుత్వ పాఠశాలలు లేదా కళాశాలలో చదివి ఉండాలి. ఎలాంటి భూమి లేదని తహసీల్దారు నుంచి పొందిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇక బీఎస్సీ వ్యవసాయం, బీఎస్సీ ఉద్యాన, బీటెక్ వ్యవ సాయ ఇంజినీరింగ్, బీటెక్ ఆహార సాంకేతికత, బీఎస్సీ హోంసైన్స్, బీఎఫ్ఎస్సీ, బీవీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఈఏపీసెట్-2025లో ఉత్తీర్ణులై ఉండాలి. ఈ నెల 31 ఉదయం 10 గంటల నుంచి జూన్ నెల 28 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు.

# జపాన్‌లోని కుషిరో తీరంలో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత గుర్తింపు

**టోక్యో, మే 31:** జపాన్ ఉత్తర ద్వీపం హక్కైడోలోని కుషిరో తీరంలో శనివారం మధ్యాహ్నం తీవ్రస్థాయి భూకంపం సంభవించింది. భూకంపం 20 కిలో మీటర్ల లోతులో సంభవించిందని జపాన్ భూగర్భ వనరుల శాఖ ప్రకటిం చింది. భూకంపం రిక్టర్‌స్కేలుపై 6.1 తీవ్రతతో ఉందని వెల్లడించింది. అదే ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి తర్వాత మధ్యాహ్నం మళ్లీ 2.19 గంటలకు ప్రకంపనలు వచ్చాయి. షికోకు తీరంలో 3.5 తీవ్రతతోను, సాయంత్రం 4.45 గంటలకు కుషిరోలో 4.7 తీవ్రతతోను, సాయంత్రం 5.07 గంటలకు మరొక భూకంపం సంభవిం చిందని జపాన్ భూకంప అధ్యయన కేంద్రం తెలిపింది. జపాన్‌లోని భూకంప అధ్యయన కేంద్రం వివరాల ప్రకారం గత ఏప్రిల్‌లోకూడా జపాన్ క్యుషు ప్రాంతం లో రిక్టర్ స్కేలుపై ఆరు పాయింట్ల అయస్కాంత ప్రభావిత శక్తితో భూకంపం



సంభ వించింది. భూకంపం 30 కిలోమీటర్ల లోతన వచ్చింది. ఈ యేడాది జనవరిలోకూడా జపాన్ లోని నైరుతి ప్రాంతంలో 6.9తీవ్రతతో భూకంపం వచ్చింది. ఆ తర్వాత సునామీ హెచ్చరిక కూడా జారీచేసింది. రాత్రి 9.19 గంటలప్రాంతంలో మియాజాకిలో ఈ భూకంపం వచ్చింది. పసిఫిక్ బేసిన్‌లోని అగ్నిపర్వతా నుంచి వచ్చిన రాపిడి కారణంగా జరిగిందని అప్పట్లో భావించారు. సునామీ రావచ్చని పదేపదే సముద్రంలోకి వెళ్లవద్దని కూడా జపాన్ వాతావరణ సంస్థ గతంలోనే హెచ్చరించింది.



# చైనా విద్యార్థులకు ఇబ్బందులుండవు..

## వీసాల రద్దుపై మాటమార్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, మే 31:** చైనా విద్యార్థుల వీసాలపై దృష్టిసారిస్తామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో వెల్లడించినతర్వాత ఈ వీసాలపై అమెరికా అధ్యక్షుడి స్పందన భిన్నంగా ఉంది. చైనానుంచి వచ్చే విద్యార్థులకు భరోసా ఇచ్చేలా ఆయన వ్యాఖ్యలుచేసారు. అంతా బాగానే ఉంటారు. అంతా బాగానే జరుగుతుంది. వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని సమాధానం ఇచ్చారు. విదేశీ విద్యార్థుల పరంగా అమెరికా ప్రభుత్వం కఠిన విధానాలు అమలు చేస్తోంది. అమెరికాలో చదువుతున్న విద్యార్థుల్లో కొందరి వీసాలు రద్దు చేస్తున్నట్లు విదేశాంగమంత్రి మార్కోరుబియో ప్రకటించారు. వారిలోచైనా కమ్యూనిస్టుపార్టీతో సంబంధాలున్నవారుకూడా ఉంటారని తన సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. అమెరికా నిర్ణయంపై చైనా విద్యార్థుల్లో ఆందోళనలు పెరిగిపోయాయి. కొత్తగా దరఖాస్తుచేసిన వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వవచ్చా లేదా అన్నది అంచనావేయడంకోసం అధికారులు నిశితపరిశీలనచేస్తున్నారు. చైనా విదేశాంగప్రతినిధి మావోనింగ్‌మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యార్థులతోసహా చైనా విద్యార్థుల చట్టబద్ధమైన హక్కులు వారిప్రయోజనాలుకాపాడాలని అమెరికాను కోరుతున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య విద్యాపరమైన విషయాల్లో ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా చూడాలని కూడా అమెరికాను కోరినట్లు తెలిపారు.

# నావి విలువలతో కూడిన రాజకీయాలు : హారీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** పిసిసి అధ్యక్షుడి హోదాలో ఉండి మహేష్ కుమార్‌గౌడ్ చేస్తున్న చిల్లర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హారీష్‌రావు పేర్కొన్నారు. సూటిగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అంటూ శనివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. విలువలకు తిలోదకాలు ఇచ్చి, సిఎం రేవంత్‌రెడ్డి బాటలోనే మీరూ నడుస్తున్నారని మహేష్‌కుమార్ గౌడ్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. బట్ట కాల్చి మీద వేసినంత మాత్రానా అబద్దాలు, నిజం అయిపోవు అని పేర్కొన్నారు. పెళ్ళిలోనో, చావు లోనో కలిసిన సందర్భాలే తప్ప ఆయన ఆరోపించినట్లు ఇతర పార్టీ నాయకులను గానీ, తమ పార్టీ నుంచి వెళ్లిన నాయకులను గాని ఎప్పుడూ తాను వ్యక్తిగతంగా కలిసింది లేదని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తాను తప్ప, మహేష్‌కుమార్‌గౌడ్ లాగా చిల్లర రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూడను అని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలు మానుకొని, స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుపై దృష్టి పెట్టాలని మహేష్ కుమార్ గౌడ్‌కు హారీష్‌రావు సూచించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎలోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 26/2025/ తేది: 23.05.2025
జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి ఫైలు నెం. G/2397/2025 తేది : 23.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.A/19/2025 తేది: .05.2025

[illegible]

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : భువనగిరి గ్రామం : అనాజిపూర్

| సర్వే నెం/ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం.) | పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | విస్తీర్ణము (ఎ.గుం.) | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|
| 208 ఖుష్కి/పట్టా 0.09¼ | గేగు పోచయ్య తండ్రి : [illegible] | గేగు పోచయ్య తండ్రి : [illegible] | 0.07¼ | --- |
| | మన్నాల నిఖిత భర్త : ఇంద్రసేనరెడ్డి | మన్నాల నిఖిత భర్త: ఇంద్రసేనరెడ్డి | 0.02 | --- |
| 209 ఖుష్కి/పట్టా 0.32 | మన్నాల మల్లారెడ్డి తండ్రి : ప్రతాప్ రెడ్డి | మన్నాల మల్లారెడ్డి తండ్రి : ప్రతాప్ రెడ్డి | 0.13¾ | --- |
| | గేగు శ్రీహరి తండ్రి : మల్లయ్య | గేగు శ్రీహరి తండ్రి: మల్లయ్య | 0.11¾ | --- |
| | గేగు కొమురయ్య తండ్రి : మల్లయ్య | గేగు కొమురయ్య తండ్రి: మల్లయ్య | | --- |
| | ఎండి.జహంగీర్ తండ్రి : హరీఫ్ | ఎండి.జహంగీర్ తండ్రి: హరీఫ్ | 0.06½ | --- |
| | ఎండి.షేక్ మీరా [illegible] | ఎండి.షేక్ మీరా [illegible] | [illegible] | --- |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| | | మొత్తం | 11.20 | |

[illegible]

సం/-.ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), అర్ అండ్ అర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/-. జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO: 174/LA/PP/Advt/Pub/2025-26

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కాలంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులుమామిడి రైతులను తీవ్రనష్టాల పాల్చేశాయి.పలు జిల్లాల్లో కురిసిన వడగండ్ల వానలు,ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. చెడగొట్టు వానకు చేతికొచ్చిన వరిపంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ రెండు రాష్ట్రాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలకు తోడు గాలిదుమారానికి చేతికొచ్చిన మామి నేలపాలై రైతాంగం నష్టాల పాలయ్యారు. అసలే సీజను ప్రారంభంలో వాతావరణంలో వచ్చిన మార్పులు మామిడి రైతులకు శాపంగా మారాయి.శీతాకాలంలో వడగండ్లవర్షాలు, పొగమంచు, ఉష్ణోగ్రతల మార్పులతోమామిడి చెట్లుకు పూతరాలేదు.కొన్నింటి పూత వచ్చినప్పటికీ ఎక్కువభాగం రాలిపోయింది. ప్రధానంగా మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది. దీంతో మామిడిచెట్లపై పూతలేకపోవడం, కాస్తో కూస్తో ఉన్న పూతరాలిపోయింది. గత కొన్నిరోజులుగా ప్రతీరోజూ కురుస్తున్నవానలు కాయలను దెబ్బతీస్తున్నాయి. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఏంచేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. ఫిబ్రవరి నుండి ఎండల తీవ్రత పెరిగి నీటిఎద్దడితో చిరుకాయ దశలో ఉన్న మామిడి తోటలు అంతంత మాత్రంగా దిగుబడి రాగా, ఈ అకాల వర్షాలకు సగానికి పైగా కాయలు నేలరాలడంతో రైతులునష్టాల్లో మునిగిపోయారు. అంతేకాకుండా నెల రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రత సాధారణం కన్నా దాదాపు ఏడు డిగ్రీలవరకూ నమోదుకావడం, ఉదయంపూట పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున మామిడిపూతపై నలుపు రంగు మచ్చులు సైతంఏర్పడి పూతదశలోనే తోటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు మిరప రైతులను నట్టేటముంచిన తామరపురుగు మామిడి తోటలకు వ్యాపించడంతో పెద్దఎత్తున పెట్టుబడులను నష్టపోయారు.ఇప్పుడు వర్షాలతోనేలరాలిన మామిడి కాయలను మార్కెట్లకు తరలిస్తున్నా రైతులకు టన్నుకు 15 వేల రూపాయల ధర కూడా అందని పరిస్థితి నెలకొంది.

# మామిడి రైతులకు అకాల దెబ్బ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మండు వేసవిలో అకాల వర్షాలు అన్నదాతలను కుదేలు చేస్తున్నాయి. సీజన్ కాని సీజన్‌లో కురుస్తున్న వర్షాలు రైతులను ఆగమాగం చేశాయి. రెక్కలు ముక్కలు చేసుకుని కంటికి రెప్పలా కాపాడిన పంట చేతికందే సమయంలో దెబ్బతినడంతో విలపిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, పూత రాలడం, అకాల వర్షాలు, వడగండ్ల వానలు దిగుబడిని చాలావరకూ దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ఏటా మామిడి రైతులకు నష్టాలు, కష్టాలే మిగులుతుండగా, ఈసారి కూడా రైతుల పరిస్థితి అలాగే ఉంది. కనీసం పెట్టుబడులు కూడా చేతికివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం మామిడి తోటలుకాపు మీద ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల వానలతో సాగైన పంటల్లో ముఖ్యంగా కోతకు వచ్చిన మామిడి రాలిపోగా, ఈదురు గాలులకు చెట్లు కూలిపోయాయి. మామిడి సీజన్‌కు మే నెల అనుకూలం. ఇదే సమయంలో మంచి ధరలతో మిలమిల్లాడాల్సిన మామిడి రైతులుకంట తడిపెడుతున్నారు. సీజను ప్రారంభంలో వాతావరణప్రభావం, మంచు కారణంగా ఇప్పటికే మామిడి తోటలకు 15 శాతం కూడా పూతరాలేదు. పూత, పిందెదశలో కురిసిన మంచుతో బూడిద తెగులు, తేనె మంచు ఆశించి నష్టం జరిగింది. దీనికి తోడు మామిడి చెట్లకు తామర పురుగు వైరస్ వ్యాపించడంతో పూత రాలేదు. అంతంత మాత్రంగా ఉన్న ఆ పూతకూడా రాలిపోయింది. వైరస్ వ్యాపించడంతో మామిడి చెట్లకు పూత నిలవక పిందెలు కాక దిగుబడి భారీగా తగ్గిపోయింది. అంతేకాకుండా మామిడికి తేనె మంచు పురుగు ఆశించి నల్ల మచ్చలు ఏర్పడి కాయనాణ్యత దెబ్బతింది. దీనికి తోడు, ఇప్పుడు గత కొన్ని రోజులుగా అకాల వర్షాలు మామిడి రైతులనుకోలుకోలేని దెబ్బతీశాయి. ఇరవై రోజుల కిందట వివిధ జిల్లాల్లో వడగళ్ల వర్షాలు కురిశాయి. ఈ కారణంగా పండు ఈగ ఉధృతి అధికమైంది. పక్వానికి వచ్చే సమయం కావడంతో చెట్లపైనే కాయలు పాడవుతున్నాయి. పండ్లుగా మారి విపరీతంగా పడిపోతున్నాయి. కాయలు తెంపి మాగబెడుతున్నా లోపల పురుగులు కనిపిస్తున్నాయి. దీంతో మార్కెట్‌కు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తరలిస్తున్నా ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెలంగాణ మొత్తం మీద 3.20 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తద్వారా ఎకరానికి 4వేల టన్నులచొప్పున 12,70,364 టన్నుల మేర దిగుబడివస్తోంది. అయితే వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలకు 7 లక్షల టన్నులు కూడా వచ్చే పరిస్థితిలేదు. ఒక్క వికారాబాద్ జిల్లాలోనే మామిడి తోటల సాగు 13,150 ఎకరాలు కాగా, ఈ సారి దిగుబడి



అంచనా. 43,550 టన్నులు అయితే అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లవానలు, తెగుళ్లవంటి వాటితో29,460 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. అకాల వర్షాలు ఉమ్మడి వరంగల్ జిల్లా మామిడి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఈదురు గాలులు, వర్షాలకు మామిడి నేలరాలిపోతున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం, మహబూబాబాద్, జనగామ, వరంగల్ తదితర జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ప్రధానంగా కోతకు వచ్చిన మామిడి కాయలు రాలాయి. చెట్టుకు ఉన్న కాయలన్నీ నేలరాలాయి. సిద్ధిపేట జిల్లాలో 1,141 ఎకరాల మామిడి దెబ్బతింది. కరీంనగర్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి మామిడి రైతులునష్టపోయారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో ఈదురుగాలులకు మామడి కాయలు రాలిపోయాయి. నిర్మల్ జిల్లాలో ఈదురు గాలులతో పాటు, రాళ్లవర్షం కురియడంతోకోతకు వచ్చిన మామిడి దెబ్బతిన్నాయి. తెలంగాణలోని ప్రధానమైన బాటసింగారం మార్కెట్‌కు మామిడిని రైతులు తరలిస్తున్నారు. గత నెలలో టన్ను కాయల ధర రూ.30వేల నుండి రూ.40 వేల వరకూ పలకగా, ప్రస్తుతం ధరలు అమాంతం పడిపోయి కాయ నాణ్యతను బట్టి రూ.15 వేలు నుండి రూ.30 వేల లోపు పలుకుతున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు పదేళ్లకు పైబడిన చెట్లు కూడా వేరుకుళ్లు తెగులు ఆశించి ఎండిపోతున్నాయి. ఏటా పూత పూసింది మొదలు, కాయలు కోతకు వచ్చేవరకూ మామిడి రైతులు పెట్టుబడి రూపంలో రూ.25 వేల నుండి రూ.30వేలవరకూ ఖర్చు చేస్తున్నారు. ఇక పలువురు రైతులు మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. తోట వయసును బట్టి ఇసుక నేలల్లో ఎకరా రూ.30 వేల నుండి రూ.40 వేల వరకూ,ఎర్రనేలల్లోని తోటలను ఎకరానికి రూ.15 వేల నుండి రూ.25 వేలవరకూ కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు భావించారు. దీంతో ఎక్కువ ధరలకు తోటలు కొనుగోలు చేశారు. అయితే వాతావరణ మార్పులు, వైరస్ వ్యాపించడం తదితర కారణాలతో పూత రాక, వచ్చింది నిలవక రాలిపోతుండడంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు, ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలతో పాటు, చిత్తూరు జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కూడా చిత్తూరుతోపాటు పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో వర్షం కుర వడంతోపాటు బలమైన ఈదురు గాలులు వీచాయి. ఈ ప్రాంతాల్లోని మామిడి కాయలు నేల రాలాయి. ఇప్పటికే పెనుమూరు, యాదమరి, చిత్తూరు రూరల్, గుడిపాల, పలమనేరు, ఐరాల,తవణంపల్లె మండలాల్లో 435 ఎకరాల్లో మామిడితో పాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో మామిడి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. విజయవాడ రూరల్ మండలంలో నష్టం ఎక్కువగా జరిగింది. అసలే పూత ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు మామిడి రైతులు మరింత నష్టాలపాలయ్యారు. కాయలు దశకు తోటలు చేరుకోవడంతో గాలివానకు రూరల్ మండలంలో 50 ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లింది. 10 శాతం మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. కాగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించనున్నట్లు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కూడా రాష్ట్రంలో అకాల వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందజేసింది. పంటలు దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం అందించింది. ఈసారి కూడా అదే తరహాలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందజేయనుంది. అయితే వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20 వేలు పరిహారం చెల్లిస్తేనే కాని రైతులు కోలుకునే పరిస్థితి లేదు. ●

---

కర్ణాటక

# వివాద 'నాయగన్'!

పెదవి దాటితే పృథివిదాటుతుందంటారు. కాలుజారితే వెనక్కి తీసుకోగలం కానీ నోరు జారితే తీసుకోలేం కదా! ప్రముఖ తమిళ నటుడు కమల్ హాసన్ ఇప్పుడు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.'తమిళం నుంచి కన్నడం పుట్టింది' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య కన్నడనాట తీవ్ర వ్యతిరేకతను సృష్టించడమే గాక ఆయన సినిమాలను రాష్ట్రమంతా నిషేధించే సంక్షోభాన్ని కూడా తెచ్చింది. మణిరత్నం దర్శకత్వంలో కమల్ కొత్త సినిమా 'థగ్ లైఫ్' జూన్ ఐదవ తేదీన తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచమంతా విడుదల కావలసి ఉండగా, కర్ణాటకలో మాత్రం నిషేధానికి గురైంది. వారం రోజుల క్రితం ఆ చిత్రం ఆడియో విడుదల చెన్నైలో జరిగిన సందర్భంగా కార్యక్రమానికి ప్రముఖ కన్నడ నటుడైన శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. కమల్ ఆ సందర్భంలో అటువంటి వ్యాఖ్యలు చేయడంతో అది మరింత వివాదాస్పదంగా మారింది.'కన్నడ కంఠీరవ' డా. రాజ్‌కుమార్ ఉన్న కాలంలో కన్నడ భాష మీద ఈగ వాలినా సహించని పరిస్థితి కనిపించేది. అలాగే తమిళనాట కరుణానిధి, ఎమ్జీఆర్ ఉన్న కాలంలో భాషాపరమైన ఉద్యమాలు అనేకం జరిగినసందర్భాలు కూడా ఉన్నాయి. చివరికి కావేరీ జలవివాదం తలెత్తినా అది భాష రంగునే చివరకు అద్దుకొనేది. తాజా వివాదం కూడా అటువంటి రంగునే ఇప్పుడు అద్దుకొంటున్నట్లు కనిపిస్తోంది. బహుళ ప్రజాదరణపొందిన సినిమాలు కమల్‌కు చాలానే ఉన్నాయి. తమిళనాటనే గాక కర్ణాటక,ఉభయ తెలుగు రాష్ట్రాలు, కేరళ, హిందీరాష్ట్రాల్లో కూడా ఆయనకు ఫాలోయింగ్ ఎక్కువే. తమిళంలో తీసిన ఎన్నో చిత్రాలు దక్షిణాది భాషలన్నిటిలో డబ్ అయి సూపర్ హిట్‌లయ్యాయి. ఆ కారణంగా దక్షిణాది భాషల వారందరికీ కమల్ చిరపరిచితుడే. ఆయన మాట్లాడింది చెన్నైలో నైనా వేదిక మీద శివరాజ్ కుమార్ కూడా ఉండడం,ఆ సందర్భంగా కమల్ ఆ వ్యాఖ్య చేయడంతో అది కొన్ని క్షణాల్లోనే రాష్ట్రమంతా దవానలంలా వ్యాపించింది. కమల్ కన్న డిగులకు కూడా అత్యంత సన్నిహితుడే. రాజ్‌కుమార్ కమల్‌ను సొంత సోదరునిలా భావించేవారు. ఎంతో సుహృద్భావ వాతావరణం

**ఎ.వి.వి ప్రసాద్**

అన్ని భాషల వారిమధ్య కని పించేది. నిజానికి ఇప్పుడు కూడా గందరగోళ పరిస్థితి ఏదీలేదనే చెప్పాలి. అగ్రనటులు ఒకే వేది కపై కనిపించినా వారిమధ్య భాషాభేదాలు ఎప్పుడూ రావు. అందరూ అన్ని భాషలూ మాట్లాడగలరు. ఎన్టీఆర్, ఎఎన్నార్ చెన్నైలో ఉన్నా, బెంగ ళూరువెళ్లినా అక్కడి స్థాని కుల మాదిరిగానే వ్యవహరించడంతో రాజ్ కుమార్, ఎన్టీ ఆర్, ఎఎన్నార్, ఎమ్జీఆర్, శివాజీ అందరూ సోదరుల్లా ఉండేవారు. తర్వాత రజనీకాంత్, కమల్, శివరాజ్ కుమార్, ఉపేంద్రలు కూడా అంతే. ఎక్కడికి వస్తే అక్కడ ఆ భాషా కుటుంబమే అనిపిస్తారు.తానుచేసిన వ్యాఖ్య కూడా అటువంటి సదుద్దేశ్యం, ప్రేమాభిమానాలతోనే అనీ, వివాదం సృష్టించడానికి కాదనీ



కమల్ హాసన్

కమల్ చెబుతున్నామొత్తం ఎపిసోడ్ కర్ణాటకలో భాషా వివాదం రంగునే పులుముకోవడం విచారకరం. కర్ణాటక సిఎం సిద్దరామయ్య 'కమల్‌కు చరిత్ర తెలీదు. తెలియని విషయాలపై వ్యాఖ్యలు చేయడం తగదు' అంటూ రంగంలోకి దిగడంతో కన్నడ రక్షణ వేదిక కూడా జూలు విదిల్చింది. మరికొన్ని కన్నడ సంఘాలు కూడా బరిలోకి వచ్చేసాయి. దానితో చిన్నవ్యాఖ్య పెను వివాదంలా మారిపోయింది. కమల్ క్షమాపణ చెప్పకపోతే ఆయన సినిమాలపై నిషేధం విధిస్తామని హెచ్చరించిన కర్ణాటక ఫిలింఛాంబర్స్ అన్నంత పనీ చేసింది. మైసూరు, బెళగావి, హుబ్బళ్లి, బెంగళూరుతో పాటు అనేక ప్రాంతాల్లో కమల్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తునే ఆందోళనలు మొదలయ్యాయి. దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈలోగాకొన్ని తమిళ సంఘాలు కూడా కన్నడ సంఘాలకు వ్యతిరేకంగా చెన్నైలో ఆందోళనలు మొదలుపెట్టడంతో ఆ చిన్న వ్యాఖ్య రెండురాష్ట్రాల మధ్య వివాదంలా మారిపోతోంది. సిద్ధరామయ్యకు మరికొందరు మంత్రులు వంత పాడడంతో ఇది రాజకీయ వివాదంగా కూడా మారుతోంది. అంత వివాదం వద్దనీ, భాష పుట్టుక, చరిత్ర గురించి భాషావేత్తలు, చరిత్రకారులు చూసుకుంటారనీ, సినిమా నటులు, రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలు సాధారణమైనవేనని కూడా కమల్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఒకసినిమా ఆడియో ఫంక్షన్ గనుక, పక్కన కూర్చున్నది రాజ్ కుమార్ తనయుడైన శివరాజ్ కుమార్ గనుక ఆప్యాయత తోనే కమల్ మాట్లాడి ఉండవచ్చు. కానీ తమిళం నుంచి కన్నడం పుట్టిందనే వ్యాఖ్యచేయకపోయి ఉంటే ఇంత అలజడి వచ్చి ఉండేది కాదనిపిస్తుంది. కన్నడం, తెలుగు, తమిళం, మలయాళం ఒకే ద్రావిడ భాషా కుటుంబంలోని స్వతంత్ర భాషలు. తమిళం, మలయాళం మధ్య, కన్నడం, తెలుగు మధ్య కొన్ని సోదర పోలికలు కనిపిస్తాయి కానీ ఏ భాష నుంచి మరో భాష పుట్టలేదని భాషా శాస్త్రం తెలిసిన వారెవరైనా తేలికగానే చెబుతారు. శివరాజ్ కుమార్ పక్కన ఉండడంతో ఏదో యథాలాపంగా కమల్ ఆ వ్యాఖ్యచేసి ఉండొచ్చు కానీ ఆయనకు ఆ మాత్రం తెలియదని అనుకోవడానికి లేదు. గత నాలుగైదు దశాబ్దాలుగా కన్నడ, తమిళ రాష్ట్రాల మధ్య ఎన్నో వివాదాలను, విభేదాలను ఆయనా గమనించిన వారే. పైగా ఓ పార్టీకి అధినేత కూడా. అన్నీ తెలిసి వివాదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తారని అనుకోలేం కదా! కన్నడ సంఘాలు సంయమనం పాటించాలి .ఆ వ్యాఖ్య వల్ల తలెత్తిన వివాదానికి స్వస్తిపలికి కన్నడ, తమిళ సోదరులు ఎప్పటిలా సుహృద్భావంతో వ్యవహరించడం ఎంతైనా అవసరం. రాజకీయ నాయకులు తల దూర్చకపోతే ఏదీ వివాదంగా మారదనేది బహిరంగ రహస్యమే. కన్నడ కస్తూరి,తెలుగుతేనియ, తమిళ తాంబూలం అన్నీ అందరికీ అవసరమైనవే. మరి వివాదాలు ఎందుకు? ●

---

అమెరికా

# ఐక్యరాజ్యసమితికి ఆర్థిక సంక్షోభం!

ప్రపంచ వ్యాప్తంగా యుద్ధోన్మాదం వీడి తోటి దేశాలతో శాంతి సామరస్య వాతావరణంతో ముందుకుపోవాలన్న లక్ష్యంతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి ఇప్పుడు నిధుల కొరతను ఎదుర్కొంటున్నది.రెండోప్రపంచ యుద్ధం తర్వాత 1944లో మొత్తం 50దేశాల ప్రతినిధులు అత్యవసరంగా సమావేశమై ఒక విశ్వవేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో 51వ దేశంగా పోలండ్ కూడా అప్పట్లో వచ్చిచేరింది. మొత్తం 1945 జనవరి 26నుంచి ఐక్యరాజ్యసమితి ఏర్పాటైంది. అప్పటి నుంచి దేశాలు సభ్యత్వం పొందుతూనే ఉన్నాయి.దేశాల మధ్య సయోధ్య కుదర్చడం, సరిహద్దుల వివాదాలు పరిష్కారం, చర్చలు దౌత్యమార్గాల్లోనే పరిష్కార వేదికలు ఏర్పాటు, ప్రత్యేక భద్రతా మండలితో ఉగ్రవాదం, హింస నిర్మూలను కృషి చేయడం వంటి లక్ష్యాలతో ఈ సమితి ఆవిర్భవించింది. ప్రస్తుతం ఈ సమితిలో సభ్యత్వం కలిగిన 193కిపైగా దేశాలు ఏటా సమితికి నిధులను కూడా అందిస్తాయి. సర్వప్రతినిధులసభ, భద్రతా మండలి, ఆర్థిక సామాజిక మండలి, ట్రస్టీషిప్ మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం, సమితి అంతర్జాతీయ సచివాలయం వంటివి ఉండటంతోపాటు మానవహక్కుల విభాగం, మానవతా సహాయసూచీ మండలి వంటివి వీటిలో విభాగాలుగా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన అమెరికా 22శాతం చెల్లించాలి. ఇటీవలే చైనా కూడా సమితికిచెల్లించే వాటాను 20 శాతానికి పెంచింది. మొత్తం 193 దేశాల్లో 152 దేశాలు తమ నిధుల బకాయిలను చెల్లించాయి. కానీ ఇప్పటికీ అమెరికాతో సహా41 దేశాలు బకాయిలతోనే ఉన్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అంతర్జాతీయ సంస్థల్లోఅమెరికా భాగ స్వామ్యం, నిధుల అందచేత వంటివాటిని సమీక్షించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి బకాయిలు నిలిచిపోయాయి. సమితికి ఏటా 3.72 బిలియన్ డాలర్ల బడ్జెట్ ఇప్పుడు అనివార్యంగా కుదింపునకు గురవుతోంది. దీనివల్లనే సమితిలోసుమారు 60కిపైగా ఐక్యరాజ్యసమితి కార్యాలయాలు, ఏజెన్సీలు జూన్ మధ్యస్తం నాటికి 20శాతం సిబ్బందిని తగ్గించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**గన్ని మోహన్**

ఈ కుదింపుజనరల్ బడ్జెట్‌లోకి వచ్చే సుమారు 14వేల పోస్టులపై ప్రభావం పడుతుంది. అంటే కనీసం 2800 పోస్టులకు గండిపడు తోంది. వీటితో సమితి రాజకీయ, మానవతా కార్యాలయాల్లోని సిబ్బంది, శరణార్థులకు సహాయం చేయడం, లింగ సమానత్వం ప్రోత్సహించడం అంతర్జాతీయ వాణిజ్యం, పర్యావరణ పరిరక్షణ, నగరాలతో సమన్వయం చేసుకుని సంయుక్తంగా కృషిచేయడం వంటి కీలక బాధ్యతల నిర్వహణకు ఇప్పుడు నిధుల సమస్య అడ్డంకిగామారింది. ఇప్పుడు మరు భూమిగామారుతున్న పాలస్తీనా శరణార్థులకు మద్దతు ఇచ్చే యుఎన్ ఏజెన్సీతోపాటు ఐక్యరాజ్యసమితి శరణార్థుల సహాయ ఏజెన్సీలకు కూడా ఈనిధుల కొరత





ఐక్యరాజ్యసమితి

సమస్య ఎదురవుతోంది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటర్రెస్‌యునైటెడ్‌నేషన్స్ 80 పేరిట ఉన్నసమితి రాజ్యాంగ అధికరణాలను తప్పని పరిస్థితుల్లో అమలు చేయాల్సివస్తోంది. కనీసం ఏడు సంవత్సరాలుగా ఐక్యరాజ్యసమితి వనరులు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధానకారణం సభ్యదేశాలు తమ బకాయిలను చెల్లించలేకపోవడమే. ఇందుకోసం ఇప్పటినుంచే సమితి పొదుపు మంత్రం పాటిస్తోంది.ఏయే పోస్టులు తగ్గించాలో ఏజెన్సీల అధిపతులకు మార్గదర్శకాలు ఇస్తోంది. సలహాలు ఇస్తోంది. సమర్థత ఆధారంగా విధులు అంచనావేసి ఆపోస్టులు మాత్రమే కొనసాగించాలని, పరిస్థితుల ప్రభావం ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వాలని, ఏకీకరణ లేదా రద్దుకోసం అవసరమైన ప్రతిపాదనలు అందించాలనిసర్క్యులర్లు కూడా వెళ్లాయి. నిధుల లేమితో సతమతమవు తున్న ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన ఈకోతల జాబితాలను వచ్చే నెల 13నాటికే అందించాలని కంట్రోలర్‌కు అందచేయాలని సెక్రటరీ జనరల్ సూచనల్లో ఉంది. 2026 బడ్జెట్‌లో వాటిని చేర్చితే ఇక ఐక్యరాజ్యసమితికి సాలీనా అందించే నిధుల్లో కూడా కోత మరింతపడుతుంది. సమితిలో ప్రధానంగా అంతర్జాతీయ న్యాయస్థానం, శాంతిపరిరక్షక దళాలవిభాగం, మానవతాసాయం విభాగాలే కీలకంగా ఉంటాయి. వీటిపైనే ఈ నిధుల కోత ప్రభావం పడుతోంది. ప్రధానంగా అమెరికా కనుక నిధుల కేటాయింపు నిలిపివేస్తే కీలక విభాగాలపై ఈప్రభావం పడుతుంది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచి వైదొలిగిన అమెరికాసమితికి నిధులు నిలిపివేస్తే ఇకయూఎన్ నుంచి తొలిగినట్లే భావించాలి. అయితే ట్రంప్ చేష్టలను ప్రపంచం ఒకింత గమనిస్తూనే ఉంది. ఐక్యరాజ్యసమితి నిరంతరం పనిచేసే వేదికగా సంక్లిష్ట బాధ్యతలను నిర్వహిస్తోంది. ఒకవేళ అమెరికా నిలిపివేసినా ఇతర దేశాలు వీటిబాధ్యతలను భుజానకెత్తుకునే అవకాశాలు లేకపోలేదు. ప్రపంచ ఆహార పథకం విభాగం సిబ్బందిలో 30శాతం వరకూ కోతపడుతోంది. అలాగే యూఎన్ శరణార్థి సంస్థ, యుఎన్ మానవహక్కుల సంస్థల్లో కూడా 30శాతం వరకూ ఖర్చులు తగ్గిస్తున్నాయి. సీనియర్ స్థాయి పదవుల్లో కూడా 50శాతం కోతపడుతోంది. ఇక చిన్నారుల సంరక్షణ విభాగం యునిసెఫ్, యుఎన్ మానవతా సంస్థ ఒసిహెచ్ఎ వంటి ఇతర ఏజెన్సీల్లోకూడా కోతపడుతున్నందున రానురాను భవిష్యత్తులో సమితి మనుగడ మరింతప్రశ్నార్థకం అవుతుంది. ఈ పరిస్థితులు అధిగమించాలంటే వేదిక ఆవిర్భావానికి కీలకంగా పనిచేసిన ఇతర దేశాలు రష్యా, ఫ్రాన్స్,బ్రిటన్,చైనా దేశాలు కీలకభూమిక పోషించక తప్పదన్నది అర్థంఅవుతోంది.ఈనిధుల సమస్య నుంచి సెక్రటరీజనరల్ సమితిని ఎలా బయటపడేస్తారన్నదే ఇప్పుడు ప్రపంచ దేశాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిపోయింది. కాలమే సమస్యలకు పరిష్కారం అన్నట్లుగా ఇపుడు యుఎన్ సంస్థలు పనిచేస్తున్నాయనే మనం భావించాలి. ●

---

# 'ఫీజు రీయింబర్స్' తిప్పలు తప్పేదెప్పటికి?

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీ ఓ కీలక అంశంగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల నినాదాలలో 'విద్యాహక్కు', బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, విద్యార్థుల చదువులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి' అనే అస్త్రాలు కేంద్రంగా ఉన్నాయి. కానీ, రాష్ట్ర ఆవిర్భావానంతరం పదేళ్ల పాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో కనీస నిబద్ధతలేకపోవడం తీవ్ర ఆవేదనకరం. వాస్తవానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సామాజిక న్యాయం సాధనకు, వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యఅందించేందుకు అత్యంత కీలకంగా ఉండాలి. అయితే, గత ప్రభుత్వం అధికారంలోఉన్న సమయంలో ఈ పథకం క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. సంవత్సరాల తరబడి బిల్లు పెండింగ్ పెట్టడం, కాలేజీలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా ప్రైవేట్ కళాశాలలు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవడంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. తల్లిదండ్రులు అప్పులు తీసుకుని తమ పిల్లల చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యాసంస్థలు నష్టాల భయంతో వెనుకబడిన వర్గాల విద్యార్థులను అడ్మిషన్లు ఇవ్వడానికే నిరాకరించాయి. ఇది రాష్ట్ర అభివృద్ధిలో మేలుకాలాన్ని ఆశించిన లక్షల కుటుంబాలకు గట్టిదెబ్బ. ఇంతటి ఘోర నిర్లక్ష్యానికి కారణం ఏమిటంటే, ప్రభుత్వం నిధుల కేటాయింపులను నేరుగా విద్యార్థుల కోసం ఉపయోగించకపోవడమే కాదు, ఖర్చు ప్రణాళికలో జాగ్రత్తలు తీసుకోకపోవడమూ దీనికి కారణం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్లు అయ్యాయి. ఆర్థిక సంవత్సరానికి తగిన నిధులను కాలానుగుణంగా విడుదల చేయకపోవడం వల్లే ఈ సమస్య తీవ్రతరమైంది. అసలు ఉద్దేశం విద్యను హక్కుగా చేయడమే అయితే, విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ, గత ప్రభుత్వం ఈ బాధ్యతను విస్మరించింది. ఉద్యమస్ఫూర్తిని మరిచి, రాజకీయ ప్రయోజనాల కోసం సొంత ప్రచారమే కంటే విద్యార్థుల కష్టాలపై దృష్టి పెట్టలేదు. ఈరోజు కూడా వేలాది మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్ బకాయిల కింద సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మారినా సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం వలన ఏర్పడినబకాయిల భారం ఇప్పటికీ కొనసాగుతోంది. కనీసం ఇప్పుడు కొత్త ప్రభుత్వం విద్యను మానవ హక్కుగా గుర్తించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా క్లియర్‌చేసి, భవిష్యత్తులో నిర్లక్ష్యానికి తావులేకుండా క్రమబద్ధతతో ఈ పథకాన్ని అమలు చేయాలి. అప్పుడే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయకపోవడం వల్ల,కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు విద్యార్థుల పోరాటం ఎంతో కీలకమైనది. ఉస్మానియా యూనివర్సిటీ నుండి గ్రామీణ ప్రాంతాల వరకు, వేలాది మంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొనగా, కొందరు ప్రాణాలు కూడా త్యాగం చేశారు. అలాంటి త్యాగాలను ప్రభుత్వం గుర్తించకుండా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడడం హేయం.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యలో సమాన అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఒక శ్రేష్ఠమైన చర్య. పేద విద్యార్థులకు ఇది కొలమానమైన ఆర్థిక మద్దతుగా నిలుస్తోంది. కాని ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వాహకంగా అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు కష్టాల్లో పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలు రుసుము వసూలు చేయడానికి ఒత్తిడి చేస్తుండగా, విద్యార్థులు అప్పులు చేసి చదవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు ప్రభుత్వ ప్రాధాన్యతగా విద్యను ప్రకటిస్తూనే, మరోవైపు విద్యార్థుల హక్కులను నిర్లక్ష్యం

**మన్నారం నాగరాజు**



చేయడం వంశపారంపర్య పాలనల తీరుకుసమానం. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉన్న ప్రతి ప్రభుత్వం విద్యార్థుల నమ్మకాన్ని ద్రోహించడమే. తెలంగాణ విద్యార్థులు రాజకీయ లబ్ధికోసం కాదు, తమ హక్కుల కోసమే పోరాడారు.ఇప్పుడు వారిని మళ్లీ పోరాటానికి నెట్టడం దుర్మార్గం. కాబట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్వస్థితికి తేవాలి. పాత బకాయిలను సుమారు 8848 కోట్లు విడుదల చేసి, విద్యార్థుల భవిష్యత్తు కోసం విధిగా పనిచేయాలి. తెలంగాణ విద్యార్థులను మోసం చేయడం అనేది తక్షణమే ఆపాలి. ఇది న్యాయం కోసం చేసే మాట మాత్రమే కాదు, నైతికంగా నెరవేర్చాల్సిన బాధ్యత కూడా. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారీగాఅభివృద్ధి పనులకు పెట్టుబడులు పెట్టింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం,రోడ్లు, భవనాలు, పట్టణాభివృద్ధి వంటి రంగాల్లో ఖర్చులు పెరిగాయి. అయితే ఆదాయ వనరులు తక్కువగా ఉండటంతో, అప్పులు తీసుకోవడం తప్ప లేదు. అలాగే పునర్వినియోగానికి సరైన ప్రణాళిక లేకపోవడం, అలసత్వపు విధానాలు, అనవసర ఖర్చులు వల్ల అప్పులు ఎక్కువయ్యాయి. ఇక్కడ 'తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉంది అని ముఖ్యమంత్రి ఒక వేదికపై చెప్పారు - కానీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీల కొరకై 1, ఏప్రిల్ 2023, కేంద్రప్రభుత్వం, నాయకులు తమ జీతాలు పెంచుకున్నారు. కనీసం ఒక నెల జీతాన్ని పిల్లల విద్యకోసంఇవ్వలేరా? అనే ప్రశ్న. ఇక తెలంగాణ రాష్ట్రం అప్పులకూపంలో కూరుకుపోతున్న సంగతి అందరికీ తెలిసినదే. వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని, వాటి వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వ ఖజానా నిలబెట్టిన రీతిని చూస్తుంటే, ఇది పాలకుల చేతుల్లో ఆర్థిక పరిపాలనకు వచ్చిన పతనానికి నిదర్శనం. కానీ ఇది మనదేశంలో ఆశ్చర్యంగా భావించనవసరంలేదు. ఎందుకంటే ఒకవైపు అప్పుల సంగతి గగ్గోలు పెట్టుతుంటే, ఇంకొకవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు తమ జీతాలను సర్దుబాటు చేసుకుంటున్నారు. పైగా పెంచుకుంటూపోతున్నారు! పేదరికం, నిరుద్యోగం, రేషన్ కోత, విద్యుత్ ధరల పెంపు, ఎల్పీజీ ధరల బాదుడు ఇలా ఒక సామాన్యుడి బతుకు ప్రతీ మూలకు దెబ్బతింటుంటే, నాయకులకు మాత్రం వెండిగిన్నెల్లో భోజనం నడుస్తోంది. మంత్రుల వృధా ఖర్చులు, అధికారులు దుబారా ఖర్చులు ఎక్కువయ్యాయి. పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు లేక చదువుతుంటే, నాయకుల పిల్లలు విదేశీ స్కూళ్లలో చదువుతున్నారు.ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు, ప్రభుత్వ ఖర్చులలో నాయకులజీతాలు, భత్యాలు ఒక పెద్ద భాగాన్ని ఆక్రమిస్తుంటాయి. ప్రజల పిల్లలు విద్య కోసం అప్పులు చేస్తుంటే, నాయకులు మాత్రం అధికారానికి వందల కోట్లు ఖర్చుచేస్తూ ఎన్నికలు గెలుస్తున్నారు. కనీసం ఒక్క నెల జీతాన్ని రాష్ట్రంలోని పేద విద్యార్థుల విద్యకోసం విరాళంగా ఇవ్వడంవల్ల, వేలమంది చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు, ఫీజు సహాయం చేయవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, బలపరచిన తరగతి గదులు నిర్మించవచ్చు. విద్యాబోధనలో నాణ్యత పెంపు కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలు కల్పించవచ్చు. కనీస బాధ్యత చూపించాల్సిన అవసరం ఉంది. పెట్టుబడులు పెట్టి రాబడి ఆశించలేరు. కానీ పిల్లల చదువు మీద పెట్టిన ప్రతీ రూపాయి, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడి వంటిది. ఈ విషయాన్ని మీ పెద్ద మనసుతో గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారంతో పాటు బాధ్యతలూ మోసే సమయం వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన ఉద్యమంలో విద్యార్థుల పాత్ర అపూర్వం. వారి త్యాగాలు, పోరాటాలు, ప్రాణత్యాగాల పునాదులమీదే ఈ రాష్ట్రం నిలిచింది. అయితే, తెలంగాణ వచ్చిన తర్వాత వారికే రాష్ట్రం వివక్ష చూపుతుందనిపిం చడం బాధాకరం. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం చాలా మందికి ఆశాజ్యోతి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బీద విద్యార్థులకు ఇది నూతన జీవం ఇచ్చే ఉపకారం. కానీ వేలాది కోట్ల రూపాయల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ క్లియర్ చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరీక్షలకు అనుమతించకపోవడం, విద్యాసంస్థల నుంచి బయటకు పంపించటం వంటి పరిస్థితులు తరచూ వినిపిస్తున్నాయి. ఇది విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అంశం. ●

# దేశభద్రతకు కవచంగా నిలిచిన నారీశక్తి!



భోపాల్‌లో ప్రధాని మోడీ

**భోపాల్, మే 31:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పరాక్రమానికి చిహ్నంగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తుపాకీ గుళ్లకు ఫిరంగి గుళ్లతో బదులు ఇస్తామని పాకిస్థాన్‌కు హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ దేశచరిత్రలోనే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన అతిపెద్ద, విజయవంతమైన ఆపరేషన్ అని అన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, సైన్యం మొదటిసారి మహిళల కోసం రక్షణ ద్వారాలు తెరిచిందని తెలిపారు. నారీశక్తి దేశభద్రతకు కవచంగా మారిందని ప్రశంసించారు. దేశరక్షణలో మహిళల సామర్థ్యాన్ని ఇప్పుడు ప్రపంచమంతా చూస్తోందన్నారు. ఇందుకోసం గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని ప్రధాని మోదీ తెలిపారు. దేశరక్షణలో మహిళల సామ ర్థ్యాన్ని ప్రపంచమంతా చూస్తోందని ఇందుకోసం గత పదేళ్ల ప్రభుత్వం ఎన్నోచర్యలు తీసుకుంది. పాఠశాలల నుంచి యుద్ధభూమి వరకు దేశం తమ బిడ్డల ధైర్యసాహసాలపై పూర్తి నమ్మకంతో ఉంది. త్రివిధదళాల్లో మహిళలు కీలక బాధ్యతలు చేపడుతున్నారు. ఫైటర్ జెట్ల మొదలుకొని ఐఎన్ఎస్ విక్రాంత్ వరకు మహిళా అధికారులు సత్తా చాటుతున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళలు 250 రోజుల సముద్ర యాత్రను పూర్తి చేశారు. సవాల్ ఎంత పెద్దదైనా భారత మహిళలు విజయం సాధిస్తారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కానీ సీమాంతర ఉగ్రవాదం కానీ నేడు భారత మహిళలు దేశభద్రతకు కవచంగా మారారు. దేవీ అహల్య పవిత్రభూమి నుంచి దేశంలోని నారీశక్తికి మరోసారి సెల్యూట్ చేస్తున్నానని మోదీ తెలిపారు. భోపాల్‌లో నిర్వహించిన మహిళా స్వశక్తికరణ్ మహాసమ్మేళన్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ ఇండోర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రియారిటీ కారిడార్లను వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు ఇవ్వాల్సిన మొదటివిడత మొత్తాన్ని మోదీ బదిలీ చేశారు. 18వ శతాబ్దానికి చెందిన మాల్వాలోని హోల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి అసాధారణ పాలన, సామాజిక సంక్షేమంపై నిబద్ధతను కొనియాడారు. రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ.300 స్మారక నాణాన్ని ప్రధాని విడుదల చేశారు.

# సంక్షోభంలో ఐక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానిదే



## సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ బిఆర్ గవాయి

**అలహాబాద్, మే 31:** సంక్షోభాల సమయంలో దేశాన్ని ఐక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానిదే అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. దేశం సంక్షోభం ఎదుర్కొన్నప్పుడల్లా భారత రాజ్యాంగం దృఢంగా ఉందన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉండేలా రాజ్యాంగం చూస్తుందని తెలిపారు. అలహాబాద్ హైకోర్టులో అడ్వకేట్ ఛాంబర్లు, బహుళ స్థాయి పార్కింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్ పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, దాని తుది ముసాయిదాను సభముందు సమర్పించినప్పుడు రాజ్యాంగం సమాఖ్య అని కొందరు అన్నారు. ఇంకొందరు ఏకీకృతమని చెప్పేవారు. కానీ బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ రాజ్యాంగం పూర్తిగా సమాఖ్య లేదా ఏకీకృతం కాదని సమాధానం ఇచ్చారు. కానీ నేను మీకు ఒక విషయం చెప్పగలను. రాజ్యాంగం యుద్ధ సమయాల్లో భారతదేశాన్ని ఐక్యంగా, బలంగా ఉంచింది. మన దేశంపై దాడి జరిగినప్పుడల్లా రాజ్యాంగం విజయం సాధించిందని జస్టిస్ గవాయి అన్నారు. రాజ్యాంగం కారణంగా స్వాతంత్రం తర్వాత భారత్ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని సీజేఐ స్పష్టంచేసారు. భారత్ పొరుగు దేశాల పరిస్థితి ఎలా ఉందో నేడు మనం చూస్తున్నామన్నారు. స్వాతంత్రం తర్వాత భారత్ అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని చెప్పారు. దేశంలోని చివరి పౌరుడికి న్యాయం అందడం ప్రాథమిక విధిగా అభివర్ణించారు. శాసనసభ అయినా, కార్యనిర్వాహక వ్యవస్థ అయినా, న్యాయవ్యవస్థ అయినా ప్రతి పౌరుడిని చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువపై దృష్టి పెడుతున్నామన్నారు. దానితో మనం రాజకీయ సమానత్వాన్ని సాధించవచ్చని అన్నారు.

సంపద కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుంది. దీనిని మనం అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని సాధించలేం. బార్, బెంచ్ ఒకే నాణేనికి రెండు వైపులా ఉన్నాయి. రథానికి రెండు చక్రాలు లాంటివి. అవి కలిసి పనిచేయకపోతే న్యాయం జరగదని సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఫైటర్ జెట్‌లకు నష్టం సహజమే!

## సిడిఎస్ జనరల్ చౌహాన్

**న్యూఢిల్లీ, మే 31:** ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్, పాక్ మధ్య జరిగిన సైనిక ఘర్షణల్లో యుద్ధ విమానాలకు నష్టం జరిగినట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. అయితే ఎన్ని యుద్ధ విమానాలకు నష్టం వాటిల్లింది, ఎంత మేర నష్టం జరిగింది అనేది చెప్పలేదు. కానీ భారత్‌కు చెందిన 6 ఫైటర్ జెట్లను కూల్చివేసినట్లు పాక్ చేస్తున్న వాదనను మాత్రం ఆయన తోసిపుచ్చారు. అది పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేశారు. భారత్ కోల్పోయిన యుద్ధ విమానాలపై సీడీఎస్ స్పందించడం ఇదే తొలిసారి కావావడం గమనార్హం. సీడీఎస్ మాట్లాడుతూ, విమానాలను కోల్పోవడం కంటే దానికి గల కారణాలు కనుగొనడం ముఖ్యం. అప్పుడే భారత సైన్యం తన వ్యూహాలను మరింత మెరుగుపరుచుకొని, తిరిగి దాడి చేయగలగుతుందని జనరల్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ నెల ఆరంభంలో పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు



రోజుల సైనిక ఘర్షణల్లో భారత్ తన యుద్ధ విమానాలను కోల్పోయిందా? అని జనరల్ చౌహాన్‌ను అడగగా, ఆయన ఈ విధంగా తనదైన రీతిలో సమాధానం ఇచ్చారు. మంచి విషయం ఏమిటంటే, మేము చేసిన వ్యూహాత్మక తప్పిదాలను వెంటనే అర్థం చేసుకున్నాం. వాటిని సరిదిద్దుకున్నాం. రెండు రోజుల తర్వాత మేము మళ్లీ దాడులు చేశాం. పాక్‌లోని సుదీర్ఘ లక్ష్యాలపై మా ఫైటర్ జెట్లతో దాడి చేయగలిగామని సీడీఎస్ జనరల్ చౌహాన్ అన్నారు. అణు యుద్ధాన్ని ఆపానన్న డొనాల్డ్‌ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించడానికి జనరల్ చౌహాన్ నిరాకరించారు. అయితే 4 రోజుల భారత్–పాక్ ఘర్షణ అణు యుద్ధానికి ఏమాత్రం చేరువకాలేదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలను వాడాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని ఆయన అన్నారు. భారత్ దాడులను అడ్డుకోవడంలో చైనా రక్షణ వ్యవస్థలు ప్రభావవంతంగా పనిచేశాయన్న పాక్ వాదనను ఆయన తోసిపుచ్చారు. చైనాకు సంబంధించిన రక్షణ వ్యవస్థలు సరిగ్గా పని చేయలేదని త్రిదళాధిపతి స్పష్టం చేశారు. భారీగా రక్షణ వ్యవస్థలు మోహరించిన పాక్ వాయుసేన స్థావరాలపైనే, మీటర్ కూడా తేడా లేకుండా అత్యంత కచ్చితమైన దాడులు చేశామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం సీడీఎస్ జనరల్ చౌహాన్ షాంగ్రిలా డైలాగ్‌లో పాల్గొనడం కోసం సింగపూర్‌లో ఉన్నారు.

గతంలో ఈనెల11న ఇండి యన్ ఎయిర్‌ఫోర్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కూడా పరోక్షంగా సైనిక విమానాలు కోల్పోయిన విషయం తెలిపారు. సైనిక పోరాట్లో ఫైటర్ జట్‌లు కోల్పోవడం సహజమేనని ఆయన పేర్కొన్నారు.



## మహిళా కమాండెంట్ నేహాభండారికి ఆర్మీచీఫ్ సత్కారం

**జమ్మూ, మే 31:** ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్‌ఎఫ్ దళాలు పాకిస్థాన్ బలగాలను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. అయితే బీఎస్ఎఫ్ మహిళా ఆఫీసర్ అసిస్టెంట్ కమాండెంట్ నేహ భండారీ నేతృత్వంలోని మహిళా దళం కూడా అసాధారణ సత్తాను చాటింది. ఈ క్రమంలో నేహ భండారిని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సత్కరించారు. కమెండేషన్ డిస్క్‌తో ఆమెను సన్మానించారు. అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఆమెను కీర్తించారు. జమ్మూలోని అఖ్నూర్ సెక్టార్ వద్ద పాక్ ఫార్వర్డ్ దళాలను ఆమె బృందం అడ్డుకున్నది. అంతర్జాతీయ బోర్డర్ వద్ద ఉన్న పాకిస్థానీ పోస్టుపై చాకచక్యంగా నేహ భండారి బృందం ఎదుర్కొన్నది. జీరో లైన్ వద్ద సుమారు మూడు ఫార్వర్డ్ పోస్టులను ఆ దళం తిప్పికొట్టింది. చాలా విపత్కరమైన పరిస్థితుల్లో నేహ తన టీమ్‌ను లీడ్ చేసినట్లు తెలిపారు. నేహతో పాటు మరో ఆరు మంది మహిళా కానిస్టేబుళ్లు ఫార్వర్డ్ పోస్టుల వద్ద గన్ పొజిషన్‌లో ధీటుగా బదులిచ్చారు. సాంబా, ఆర్ఎస్ పురా, అఖ్నూర్ సెక్టార్ల వద్ద శత్రువులను ఎదుర్కొన్నారు. నేహ భండారి స్వరాష్ట్రం ఉత్తరాఖండ్. నేహ కుటుంబం ఆర్మీలో ఉన్నది. ఆమె మూడవ తరం ఆఫీసర్ కావడం విశేషం.

ఆపరేషన్ సిందూర్ సమయంలో అఖ్నూర్ సెక్టార్‌లోని పర్గ్వాల్ ఫార్వర్డ్ ఏరియాను ఆమె కమాండ్ చేశారు. ఇంటర్నే షనల్ బోర్డర్ వద్ద దళాలతో నిఘా నిర్వహిం చడం పట్ల గర్వంగా ఉందని, అఖ్నూరు పోస్టుకు 150 మీటర్ల దూరంలో పాకిస్థానీ పోస్టు ఉన్నట్లు ఆమె తెలిపారు. నేహ భండారి తాతయ్య ఇండియన్ ఆర్మీలో చేశారు. ఆమె తల్లితండ్రులు ఇద్దరూ సీఆర్పీఎఫ్‌లో విధులు నిర్వర్తించారు.

# వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి



## ఎదురుదాడులకు దిగిన కీవ్

**కీవ్, మే 31:** ఇటీవల తుర్కియే వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష శాంతి చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. వాటి వల్ల ఫలితం లేకపోవడంతో తాజాగా మరోసారి ప్రత్యక్ష చర్చల కోసం రష్యా ప్రతిపాదనలు చేసింది. ఒకవైపు శాంతి ఒప్పందానికి సన్నద్ధం అవుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాలు దాడులు కొనసాగిస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మాస్కో కీవ్‌పై దాదాపు వందకుపైగా డ్రోన్లు, ఐదు క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. వాటిలో 42 డ్రోన్లను తమ సైన్యం ధ్వంసం చేసిందని తెలిపింది. జపోరిజ్జియా ప్రాంతంలోని ఫ్రంట్–లైన్ గ్రామం డోలింకాపై జరిగిన దాడిలో 9 యేళ్ల చిన్నారి మృతి చెందగా.. భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు జపోరిజ్జియా గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు. పలువురు గాయపడ్డారన్నారు. దీంతో కీవ్ సైతం మాస్కోపై ప్రతీకార దాడులు చేసింది. రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల్లో 14 మంది గాయపడ్డారని, పలు భవనాలు ధ్వంసమయ్యాయని రష్యా ఆరోగ్య శాఖ వెల్లడించింది. శుక్రవారం ఉక్రెయిన్ ప్రభుత్వ సలహాదారు ఆండ్రీ యెర్మాక్ మాట్లాడుతూ సోమవారం ఇస్తాంబుల్‌లో రష్యాతో ప్రత్యక్ష శాంతి చర్చలను తిరిగి ప్రారంభించడానికి కీవ్ సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చల ప్రారంభానికి ముందు యుద్ధం ముగింపుపై తన వైఖరిని తెలుపుతూ వాగ్దానం చేసిన మెమోరాండాన్ని రష్యా తమకు అందించాలని షరతు పెట్టారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 19న ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్‌లో దాదాపు రెండు గంటలకుపైనే మాట్లాడుకున్నారు. అనంతరం పుతిన్ స్పందిస్తూ భవిష్యత్తు శాంతి ఒప్పందానికి సంబంధించి ఉక్రెయిన్‌తో కలిసి పని చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.

మరోవైపు ఉక్రెయిన్‌తో పోరాడ డానికి ఇప్పటికే వేలమంది సైన్యాన్ని, ఆయు ధాలను మాస్కోకు పంపిన ఉత్తర కొరియా తాజాగా మరో 14 వేల మంది సైన్యం, 9 లక్షల రౌండ్ల మందుగుండు సామగ్రి, 100 బాలిస్టిక్ క్షిపణులు, రాకెట్ లాంచర్లు రష్యాకు పంపినట్లు సమాచారం. దీంతో యుద్ధం ముగింపుపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.



## ఇండో-పసిఫిక్‌లో చైనా దూకుడును అడ్డుకుంటాం

### యుఎస్ రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్

**సింగపూర్ సిటీ, మే 31:** ఇండో–పసిఫిక్ ప్రాంతంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లో పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా నుంచి ఎదురవుతున్న ఆర్థిక, మిలిటరీ ఒత్తిడి గురించి ప్రస్తావించారు. ఇండో–పసిఫిక్‌లో చైనా దూకుడు ప్రదర్శిస్తే అమెరికా దానిని అడ్డుకుంటుందని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో చైనా దూకుడు నేపథ్యంలో తైవాన్‌లో సంఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని అంచనా వేశారు. చైనా నుంచి ముప్పు ఎదురైనట్లయితే మిత్రపక్షాలకు తాము అండగా ఉంటామని వ్యాఖ్యానించారు. భౌగోళిక, సముద్ర వివాదాల పరిష్కారంలో, తైవాన్ విషయంలో చైనా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని హెగ్సెత్ అన్నారు. భవిష్యతులో బీజింగ్ నుంచి రానున్న ముప్పును.. ముఖ్యంగా తైవాన్‌పై దాని దూకుడు వైఖరిని ఎదుర్కోవడానికి వాషింగ్టన్ విదేశాలలో తన రక్షణను బలోపేతం చేస్తుందని హెగ్సెత్ అన్నారు. తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడానికి చైనా చురుగ్గా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే తరచూ తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. మరోవైపు పనామా కాలువపై చైనా ప్రభావాన్ని తగ్గించడానికి అందరం కలిసి కృషి చేద్దామని యూరోపియన్ దేశాలకు పిలుపునిచ్చారు. దీనికోసం రక్షణ వ్యయాన్ని తమ స్థూల దేశీయోత్పత్తిలో 5శాతానికి పెంచాలని సూచించారు. ఇండో–పసిఫిక్ దేశాలకు అమెరికా మద్దతు ఇవ్వడం వల్ల స్థానిక ప్రభుత్వాలు సాంస్కృతిక, వాతావరణ సమస్యలపై పశ్చిమ దేశాలతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదని హెగ్సెత్ అన్నారు.

# చార్‌థామ్ యాత్రకు పోటెత్తుతున్న యాత్రికులు

## 30 రోజుల్లోనే 16 లక్షలమంది రాక



**డెహ్రాడూన్, మే 31:** చార్ ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి (ఏప్రిల్ 30) నుంచి ఇప్పటి వరకూ దాదాపు 16 లక్షల మంది గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సందర్శించారు. అత్యధికంగా కేవలం 30 రోజుల్లోనే కేదార్‌నాథ్ ఆలయాన్ని 6.50లక్షల మందికిపైగా భక్తులు సందర్శించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయి ఉంటుంది. తిరిగి వేసవిలో ఈ ఆలయ తలుపులు తిరిగి తెరుస్తారు. ఈ ఏడాది చార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైన విషయం తెలిసిందే. గర్వాల్ హిమాలయాల్లోని గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను అక్షయ తృతీయ సందర్భంగా తెరిచారు. ఆ తర్వాత కేదార్‌నాథ్ దేవాలయాన్ని మే 2న, బద్రీనాథ్ దేవాలయాన్ని మే 4న భక్తుల సందర్శనార్థం తెరిచారు. శీతాకాలంలో ఈ నాలుగు దేవాలయాలను మూసివేస్తారు అక్టోబర్ – నవంబర్ నెలల మధ్య మూసివేసి ఉంచుతారు. భక్తుల భద్రత కోసం యాత్ర మార్గాల్లో దాదాపు 6,000 మంది పోలీసులు, 17 కంపెనీల ప్రొవిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబులరీ సిబ్బంది, 10 కంపెనీల పారామిలిటరీ దళాలను మోహరించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 65కుపైగా ప్రాంతాల్లో రాష్ట్ర విపత్తు స్పందన దళ సిబ్బందిని మోహరించారు.

# షిరిడీ గోల్డెన్‌వాచ్ వేలం వేయాలని డిమాండ్

## వేయబోమని నిరాకరించిన సంస్థాన్ ట్రస్ట్

**షిరిడీ, మే 31:** శిర్డీలోని ద్వారకామాయిలో సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ భద్రతా సిబ్బందికి లభించిన క్వీన్ విక్టోరియా చిత్రంతో కూడిన బంగారు గడియారం సంచలనంగా మారింది. ఈ ప్రత్యేక వాచ్ ఎవరిదైతే వారు రుజువు సమర్పించి తీసుకెళ్లాలని సాయిబాబా సంస్థాన్ విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఈ గడియారాన్ని వేలం వేయాలని కొంతమంది శిర్డీ వాసులు, సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సీఈవో గోరక్ష్ గడిల్కర్ మాట్లాడుతూ బంగారు గడియారాన్ని వేలం వేయబోమని స్పష్టం చేశారు. ద్వారకామయిలో దొరికిన ఈ గడియారాన్ని వేలం వేయం. దాని యజమాని కోసం మేము మరో 10 రోజులు వేచి చూస్తాం. వాచ్‌ను తీసుకోవడానికి ఎవరు రాకపోతే, దానిని సంస్థాన్ లాకర్‌లో భద్రంగా ఉంచుతాం. భవిష్యత్తులో యజమాని వస్తే అతను రుజువు సమర్పించిన తర్వాత గడియారాన్ని తిరిగి ఇస్తాం. ఆలయ ప్రాంగణంలో భక్తుల విలువైన వస్తువులు కనిపిస్తే వాటిని సంస్థాన్ లో జమ చేస్తాం. ఎవరూ ముందుకు రాకపోతే వాటిని సంస్థాన్ లాకర్ లో భద్రపరుస్తాం. ఆలయ ప్రాంగణంలో దొరికిన వస్తువులను సంస్థాన్ వేలం వేయదు. భక్తులు సాయిబాబాకు సమర్పించినందున విరాళాలు, హుండీలో వేసిన వస్తువులను మాత్రమే వేలం వేస్తుంది సంస్థాన్ ట్రస్ట్ సీఈఓ తెలిపారు. విక్టోరియా చిత్రంతో ఉన్న గోల్డ్ వాచ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ గురించి శిర్డీకి చెందిన గ్రామస్థుడు ప్రమోద్ గోండ్కర్ స్పందించారు. సాయిబాబా సంస్థాన్ గడియారాన్ని పోగొట్టుకున్న భక్తుడిని తెలుసుకునేందుకు



ప్రయత్నించిందన్నారు. గడియారాన్ని తీసుకోవడానికి ఎవరూ రాకపోతే ట్రస్ట్ దానిని ఇతర క్లెయిమ్ చేయని వస్తువులతో పాటు వేలం వేయాలి. అలాగే వేలం వేసే అన్ని విలువైన వస్తువులను వివరిస్తూ ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేయాలి. ఈ ప్రత్యేకమైన గడియారాన్ని వేలం వేస్తే దాదాపు రూ. 3లక్షలురూ.4 లక్షల వరకు పలుకుతుందన్నారు. దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ సాయిబాబా దర్శనం కోసం వేలాది మంది భక్తులు శిర్డీకి వస్తారు. సాయిబాబా సమాధిని సందర్శించిన తర్వాత, భక్తులు బాబా తన జీవితాంతం ఫకీరుగా గడిపిన ద్వారకామాయికి కూడా వెళ్తారు. అయితే మే 21న ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు మహిళా భద్రతా గార్డులు రంజనా కుంభార్, రషీద్ షేక్‌లకు ద్వారకామాయిలోని సాయిబాబా కూర్చొన్న పవిత్ర రాయి దగ్గర రూ.2 లక్షల విలువైన బంగారు గడియారాన్ని గుర్తించారు. దానిపై విక్టోరియా రాణి చిత్రం ఉంది. అలాగే విక్టోరియా ఎంప్రెస్ అని రాసి ఉంది. వెంటనే భద్రతా సిబ్బంది దానిని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కు సమర్పించారు. ఆ తర్వాత ఈ వాచ్ ఎవరిదైతే వారు సరైన ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని ట్రస్ట్ భక్తులను కోరింది. అయితే, 10రోజులైనా ఎవరూ ఈ గడియారం తమదేనని ముందుకు రాలేదు.

# భారత్‌కు మద్దతు తెలిపిన కొలంబియా




## పాక్‌కు మద్దతుగా తెలిపిన ప్రకటన ఉపసంహారణ

**బగోటా, మే 31:** కొలంబియాలో భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాల దౌత్యం ఫలించింది. పాకిస్థాన్ భూభాగంపై భారత్ దాడుల్లో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ విడుదల చేసిన ప్రకటనను కొలంబియా ఉపహాసంరించుకుంది. కాంగ్రెస్ నేత శశిథరూర్ అందించిన ఆపరేషన్ సిందూర్ పూర్తి వివరాలను ఆ దేశం పరిగణలోకి తీసుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన కొలంబియా విదేశాంగమంత్రి యెలాండ్ తమ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. శశిథరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాకు వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావిసెన్సియోతో థరూర్ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి విషయాలను యెలాండ్‌కు తెలియజేశారు. అనంతరం భారత్ జరిపిన దాడుల్లో పాకిస్థాన్‌లో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ విడుదల చేసిన ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు యెలాండ్ ప్రకటించారు. భారతబృందం తమకు అన్ని విషయాలు తెలియజేసిందని చెప్పారు. కశ్మీర్‌లో ఏం జరిగిందనేది పూర్తిగా తెలుసుకున్నామన్న యెలాండ్ దాడులకు దారితీసిన పరిస్థితిపై అవగాహన వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రకటన అనంతరం శశిథరూర్ కొలంబియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై తమ వైఖరిని కొలంబియా పూర్తిగా తెలుసుకున్నారని థరూర్ తెలియజేశారు. అంతకుముందు కొలంబియా ప్రభుత్వం పాక్‌కు మద్దతుగా సంతాపం తెలపడంపై అసహనం వ్యక్తంచేశారు. కేవలం మా ఆత్మ రక్షణ హక్కును మాత్రమే వినియోగించుకున్నామని తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక ఉగ్రదాడులను భరించిందని చెప్పారు.

# ఏడు రాష్ట్రాల్లోని 15 కేంద్రాల్లో ఎన్‌ఐఎ దాడులు




**న్యూఢిల్లీ, మే 31:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శనివారం ఏడు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులుచేసింది. ఉగ్రవాదులకు నిధుల సాయం, ట్రావెల్ ఏజెన్సీ లింకులు వంటి సమాచారంపై ఈ దాడులు, సోదాలు నిర్వహించింది. పాకిస్తాన్ వేగులకు దేశ భద్రతకు సంబంధించిన కీలక రహస్యాలను చేరవేసిని సిఆర్‌పిఎఫ్ ఉద్యోగి మోతీరామ్‌జాట్‌ను అరెస్టు చేసిన తర్వాత ఎన్ఐఎ అధికారులకు కీలక సమాచారం అందింది. ఢిల్లీ, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాల్లో ఈ దాడులు సోదాలు నిర్వహించింది. కోల్‌కత్తాలో ఇప్పటికీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సోదాలు జరిపిన వాటిలో ఒక ట్రావెల్ సంసథకూడా ఉంది. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే అనుమానిత నగదు బదిలీలు ఉగ్రవాదులకువెళ్లాయని అంచనావేసారు. మూడు సందర్భాల్లో నగదును బదిలీచేసినట్లు తేలింది. 2024 ఏప్రిల్ మూడోతేదీ కూడా నగదు బదిలీ జరిగింది. ఇందుకోసమే షాపు ఓనర్ మసూద్ ఆలమ్‌ను ఇదేవిషయమై ప్రశ్నించేందుకు పిలిపించారు. 20–25 మంది ఎన్ఐఎ అధికారులు నగదు బదలీ లావాదేవీలుపరిశీలించారు. ఒక స్పష్టమైన లావాదేవీకోసం ప్రశ్నించారు. కానీ ఆ లావాదేవీ కనిపించలేదు. పేపాయింట్ ఇండియా వంటి థర్డ్‌పార్టీ యాప్‌ల సాయంతో బదలీ చేసారు. ఆధార్‌కార్డులను పరిశీలించి లావా దేవీలు చేస్తామని షాపు ఓనర్ చెప్పారు. ఈ మొత్తాలు పాకిస్తాన్ ఖాతాకు బదలీచేసారని మాత్రమే గుర్తించారు. ఫోను, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. తాను దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరిస్తానని మసూద్ ఆలమ్ స్పష్టం చేసాడు. పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లు టివి జర్నలి స్టుల ముసుగులో ఈ కీలక సమాచారం సిఆర్ పిఎఫ్ ఎఎస్ఐనుంచి రాబట్టారు. ముందు పహ ల్గాంలో డ్యూటీచేసిన జాట్‌ను దాడికిఐదు రోజుల ముందే ఢిల్లీకి బదిలీచేసారు. తనిఖీలు 15 ప్రాంతాల్లో జరిగాయన్నారు.




శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపి విహెచ్

# పేదల భూములు లేఔట్‌లకు ఎలా ఇస్తారు?

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మాజీప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చిన భూములను గుంజుకుంటే చూస్తూ ఊరుకోనని, అక్కడ రాగి కృష్ణారెడ్డి కూతుర్ల 36 ఎకరాలు వెంచర్లకు ఇచ్చారు.. హెచ్ఎండిఏ లేఔట్ ఉండని, పేదల భూములను లేఔట్‌కి ఎలా ఇస్తారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి వి.హనుమంతరావు ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. భూభారతిలో అసైన్డ్ భూ ములు స్థానికం చేసుకొని బదలాయింపు చేతిలో ఉన్న భూములను గుంజు కుంటామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారని, ఈ శుభ పరిణామం విహెచ్ అన్నారు. కీసర దాయరలో ఉన్న మాదిగల పట్టా భూమి 38వ సర్వేలో రాగి కృష్ణారెడ్డి చనిపోయిన దళితుల దొంగ సంతకులు ఫోర్జరీ చేసి కోడళ్ల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. కీసర దాయరలో 120 మంది కుటుంబాలు రోడ్డునపడ్డారని, ఎంఆర్ఓ కూడా పేదల భూములని సర్టిఫై చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని, మిగతా 50 ఎకరాలు పేదలకు ఇవ్వాలన్నారు. అక్కడ అన్యాయం జరిగితే నేను చూడ లేనని, పేదలకు ఎక్కడ అన్యాయం జరిగితే నేను అక్కడ ఉంటానని అన్నారు. దొరల దగ్గర భూములు లాక్కుంటాం అన్నా పొంగులేటి శ్రీని వాసరెడ్డి పేదలకు న్యాయం చేయాలన్నారు. ఈ భూమి ఇప్పిస్తే భూభార తికి, సిఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాణి అహల్యాబాయి జయంతి వేడుకలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాణి అహల్య బాయి హోల్కర్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థగత) చంద్రశేఖర్ తివారి, ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, బస్వాపురం లక్ష్మీనరసయ్య, సుభాష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్‌ది చోర్‌పత్తా రాజకీయం

### పిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌ది చార్ పత్త రాజకీయం కాదు, కానీ బిజెపి, బిఆర్ఎస్‌ది చోర్ పత్త రాజకీయం అని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తొండి మాటలను ఎవ్వరు నమ్మరన్నారు. కవిత లెటర్ వెనుకాల కాంగ్రెస్ ఉందనే బండి సంజయ్ మాటలు అర్ధ రహితం అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ డ్రామ రాజకీయాలు 11 ఏళ్ల నుండి తెలంగాణ ప్రజలకు తెలుసునని అన్నారు. అవినీతి బిఆర్ఎస్ పార్టీని కాపాడుతుంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కదా? అంటూ ప్రశ్నించారు. రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేశ ద్రోహి అనడం సిగ్గు చేటు అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు భద్రత కరువైందన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మోడీ భారత దేశ ఆత్మ గౌరవాన్ని అమెరికా అధ్యక్షుడికి తాకట్టు పెట్టారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుగుతుంది అనే విషయం కూడా హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి తెలియక పోవడం దౌర్భాగ్యం? అన్నారు. ఇందిరా గాంధీ గురించి బండి సంజయ్‌కి మాట్లాడే స్థాయి లేదని, దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. యుద్ధం ముందు అఖిల పక్షం సమావేశం పెట్టిన మోడీ యుద్ధం ఆగిపోయాక మోడీ అఖిల పక్ష సమావేశం ఎందుకు పెట్టలేదన్నారు.

## సింగరేణిలో వనమహోత్సవం

### 40 లక్షల మొక్కలు నాటే లక్ష్యం

### సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జూన్ 1వ నుంచి సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున వన మహోత్సవ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ ఏడాది తమ సంస్థ పరిధిలో 675 హెక్టార్లలో 40 లక్షల మొక్కలను నాటి సంరక్షించాలని చెప్పారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఏరియాల వారీగా వన మహోత్సవ లక్ష్యాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్స వాన్ని ప్రతి ఏరియాలో ఉత్సాహంగా నిర్వహించాలని, కార్మికులు, స్థానికులు పాల్గొనేలా చూడాలని సూచించారు. అలాగే సింగరేణి వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టిన నీటి బిందువు జలసింధువుపై సమీక్షించారు. సింగరేణి ప్రాంతంలో మొత్తం 62 మినీ చెరువులను తవ్వాలని నిర్ణయించగా, వీటిలో ఇప్పటికే 48 చెరువుల నిర్మాణం పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన మినీ చెరువుల నిర్మాణం వారం లోగా పూర్తి చేయాలని సూచించారు.

ఇప్పటికే ఆయా ఏరియాల్లో ఉన్న చెరువుల్లో 43 చెరువుల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇందులో 25 చెరువుల్లో పనులు పూర్తయినట్లు వివరించారు. వీటిని స్థానిక ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తద్వారా సింగరేణి ఆధ్వర్యంలో 105 నూతన చెరువుల నిర్మాణం, పూడికతీత చేసినట్లు అవుతుందని, ఇది అతి పెద్ద సామాజిక ప్రయోజన కార్యక్రమంగా నిలిచిపోతుందన్నారు. వర్షాకాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన చెరువుల్లో నీరు చేరే విధంగా తగు సివిల్ పనులు పూర్తి చేయాలని, నీటి నిలువ గరిష్టంగా ఉండేలా చూడాలని సూచించారు.

పనుల్లో నాణ్యత ఉండాలని, చెరువు కట్టలు పటిష్టంగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఇడి ఎస్.డి.ఎం.సుభాని, సింగరేణి అటవీ సలహాదారులు మోహన్ పరిగేన్ తదితరులు పాల్గొన్నారు.

# దిగుమతి సుంకం తగ్గింపుతో ఆయిల్‌పామ్‌కు అడ్డంకి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దిగుమతి సుంకం తగ్గింపుతో ఆయిల్ పామ్ సాగుకు అడ్డంకిగా మారుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అభ్యంతరం తెలిపారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనార్థం దిగుమతి సుంకాన్ని 27.5 నుంచి 40 కి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యర్థించినప్పటికి, దీనికి విరుద్ధంగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయం వలన ఆయిల్ పామ్ రైతులకు గెలల ధర తగ్గడంతో పాటు, దీర్ఘకాలికంగా దేశీయ ఆయిల్ పామ్ సాగును తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రాలు, రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తూ, ఈ పంట సాగు పెంపుపై దృష్టిసారిస్తున్న తరుణంలో, కేంద్ర నిర్ణయం రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఈ దిగుమతి సుంకం తగ్గింపు వలన కొత్తగా ఆయిల్ పామ్ సాగు ప్రారంభించాలనుకునే రైతులు వెనక్కి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది స్వదేశీ నూనె ఉత్పత్తిని ప్రోత్సహించాలన్న కేంద్ర, రాష్ట్రాల ఉద్దేశ్యాలకు విరుద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పాము సాగును ప్రోత్సహించేందుకు పలు ప్రోత్సాహక కార్యక్రమాలే కాకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెద్ద ఎత్తున రైతుల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. రైతుల ఆకాంక్షలు నిలబెట్టడంకోసం, దేశ ఆత్మనిర్భరత లక్ష్యాన్ని సాధించేందుకు ఆయిల్ పామ్ వంటి నూనె పంటల ఉత్పత్తికి భరోసా కల్పించే విధానాలను అమలు చేయాలని కేంద్రాన్ని కోరినట్టు వెల్లడించారు.

**దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం: రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల పామ్ ఆయిల్ సాగుచేసే రైతులపై తీవ్ర ప్రభావం పడ్తుందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగు పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలు ఇస్తుందని, దీంతో రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగు చేయడానికి రైతులు ముందు కొస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం తగ్గించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇది దిగుమతి చేసుకునే పరిశ్రమలకు లాభం చేరుకుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ, సబ్సిడీలు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వం పిడుగులాంటి ఈ నిర్ణయం పామ్ ఆయిల్ తోటల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గతంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలకు దిగుమతి సుంకం తగ్గించి కంపెనీలకు లాభాలు చేకూర్చిపెట్టిందని అన్నారు. ఈ దిగుమతి, ఎగుమతి పాలసి పామ్ ఆయిల్ తోటల వ్యవసాయంపైన ప్రభావం పడకుండా ఉండాలి అంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, రైతులను కూడా భాగస్వామ్యం చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ దిగుమతిపై సుంకాన్ని తగ్గించి తెలంగాణాలో సాగుచేసే పామ్ ఆయిల్ రైతులకు భారీ పెట్టుబడులు పెట్టి తోటలుపెంచి, ఆ లాభాలు రైతుకు అందకముందే ఈ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రైతు కమిషన్ తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

**నకిలీ ఆయిల్‌పామ్ విత్తనాలను అరికట్టాలి**

ఆయిల్ ఫామ్ రైతులకు సరఫరా అవుతున్న నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షులు తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 2.10లక్ష ఎకరాల్లో 44వేల మంది రైతులు ఆయిల్ ఫామ్ పంటను సాగుచేస్తున్నారన్నారు. ఆయిల్ ఫామ్ పంట వేసి నష్టపోతే పరిహారం అందించేందుకు సరైన చట్టాలు లేవన్నారు.

# గురుకులాలపై అసత్య ప్రచారాన్ని సహించం

### డిగ్రీ కాలేజీల్లో కూచిపూడి, కథాకళి నాట్య కోర్సులు ఈ యేడాది నుంచే ప్రారంభం

### గతంలో సొసైటీ నిధుల దుర్వినియోగంపై విచారణ

### ఎస్‌సి గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్‌సి గురుకులాలపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని.. రాజకీయ అవసరాల కోసం గురుకులాలను వాడుకుంటే చూస్తూ ఊరుకోబోమని గురుకుల సొసైటీ కార్యదర్శి విఎస్ అలగు వర్షిణి స్పష్టం చేశారు. ఈ యేడాది నుంచే గురుకుల డిగ్రీ కాలేజీల్లో కథాకళి, కూచిపూడి వంటి నాట్య కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనుమతి కోసం ఇప్పటికే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఈ యేడాది మే నెలలోనే గురుకుల స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయగలిగామని తెలిపారు. గురుకుల సొసైటీలో జరుగుతున్న పరిణామాలపై సొసైటీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గురుకులాల్లో 5వ తరగతిలో అడ్మిషన్లను మే నెలలోనూ పూర్తి చేశామని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో గత యేడాది వరకు 50 శాతం అడ్మిషన్లు కూడా జరగలేదని.. కానీ ఈ యేడాది 30 కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ బిపిఈడి కోర్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 12 జూనియర్ కాలేజీలకు భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతానికి వాటిల్లో అడ్మిషన్లు చేపట్టలేదని.. భవనాలను చూసి వెంటనే వాటిల్లో కూడా అడ్మిషన్లను చేపడతామని సెక్రటరీ తెలిపారు. పిల్లల చేత టాయిలెట్స్ శుభ్రం చేయిస్తున్నారనే దుష్ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌పై సోషల్ మీడియాలో ఉన్న వాయిస్ తనదేనని.. తాను రెండున్నర గంటలపాటు గురుకులాల్లో ఏమేమీ చేయాలో ప్రిన్సిపాల్స్‌కి చెప్పానని దానిలో కేవలం 4 నిమిషాల మాటలను అది కూడా ఎడిట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. ఇది కేవలం రాజకీయ అవసరాల కోసమే చేస్తున్నారని తెలిపారు. గతంలో సొసైటీ నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని తమ సాధారణ పర్యవేక్షణలో తేలిందని.. దానిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని.. ప్రభుత్వానికి ఇదే అంశంపై లేఖలు రాశామని.. ప్రభుత్వ నిర్ణయం మేరకు వాటి వివరాలన్నారు. రూ. 25 కోట్ల వరకు దుర్వినియోగం జరిగినట్టు ప్రాథమికంగా తేలిందని పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు. అద్దెబకాయిల విషయంలో తమ నుంచి కొన్ని పొరపాట్లు జరిగాయని తెలిపారు. వాటిని భవిష్యత్‌లో జరగకుండా చూసుకుంటామన్నారు.

## సంక్షేమ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త :** స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచింది. అర్హులైన సంక్షేమ విద్యార్థులు జూన్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, శారీరకంగా వికలాంగులైన విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం మే 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ కోసం టీఎస్ ఈ పాస్ వెబ్‌సైట్లో సెప్టెంబర్ 01, 2024 నుండి ప్రారంభించారు. అయితే దశల వారీగా గడువు పొడిగిస్తూ వచ్చారు. కాగా గత విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల లక్ష్యం 11,88,120 కాగా, ఇప్పటివరకు 10,75,041 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇంకా దాదాపు 1,13,079 దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం మరోసారి గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అన్ని సంక్షేమ శాఖలు రెన్యువల్, కొత్త స్కాలర్షిప్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై విస్తృత ప్రచారం చేయాలని. అర్హత ఉన్న విద్యార్థులందరూ 2024-25 విద్యా సంవత్సరానికి నమోదు చేసుకోగలిగేలా 30.06.2025 నాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


# ఎన్నికల ప్రస్థానంలో సంస్కరణలు తేవాలి

### అందుకు మీడియా, ప్రసార మాధ్యమాలు నడుం బిగించాలి: తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్.రామ్మోహన్‌రావు

### ఎన్టీఆర్‌ను ఏరూపంలో చూసినా హృదయాల్లో హత్తుకుపోయే చిరస్మరణీయుడు : డా. కొలకలూరి ఇనాక్

### కంఠంనేని రవిశంకర్‌కు ఎన్‌టిఆర్ పురస్కార ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 31, ప్రభాతవార్త :** నేడు ప్రజాస్వామ్యం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల గురించి తెలుసుకోకుండా ఎక్కువ డబ్బులిచ్చే అభ్యర్థికే ఓటేసే దౌర్భాగ్యస్థితి నెలకొందని, మీడియా, ప్రసార, సామాజిక మాధ్యమాలు మన ఎన్నికల ప్రస్థానంలో సంస్కరణలను తీసుకు రావాలని, లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉందని తమిళనాడు మాజీ గవర్నరు పి.ఎస్.రామ్మోహన్‌రావు స్పష్టం చేశారు. ఎన్నికల్లో పార్టీల విధానాలు, సమీక్షించే విశ్లేషణలు లేవని, శాసనసభ, పార్లమెంటులలో కూడా దేశం వనరులను శాంతిభద్రతలు, న్యాయం, ఆహారం, ఆరోగ్యం, విద్యలకు వినియోగించాల్సిందిపోయి



ఎన్‌టిఆర్ పురస్కారంతో రవిశంకర్‌ను సత్కరిస్తున్న రామ్మోహన్‌రావు, కొలకలూరి ఇనాక్, చంద్రకుమార్, ఎంకె. రాము తదితరులు

ముందున్న సమస్యలపై చర్చలు జరగడం లేదని, ప్రజాస్వామ్య విలువలు దిగజారి పోతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాలు వచ్చే ఆర్థిక పూర్తిగా విస్మరిస్తూ ఉచిత పథకాలకు ప్రాధాన్య తనిస్తూ అప్పుల ఊబిలో పడిపోయి ప్రజాస్వామ్యం కునారిల్లుతోందని చెప్పారు. రాజకీయాలు చాలా కలుషితమై పోయాయని, ఆయా పార్టీలు ఒకరినొకరు నిందించుకోవడమే విధిగా సాగుతూ ప్రజాస్వామ్య, ప్రభుత్వాల, ప్రజాసమస్యలకు తిలోదకాలు వదలారని ఆవేదన వ్యక్తపరిచారు. వీటిపై మాధ్యమాలు దృష్టిసారించాలన్నారు. చివరిగా ఎన్టీరామారావు తీసుకొచ్చిన సంస్కరణలు, విధానాలతోపాటు పలు సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న తెలుగు వన్ చానల్ అధినేత కంఠం నేని రవిశంకర్‌కు ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సబబుగా ఉందని ఆయన్ను అభినందించారు. ఆదాయ పన్నుశాఖ మాజీ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప సభాధ్యక్షతన జరిగిన ఎన్టీరామారావు 103వ జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.ఎస్. రామ్మోహన్‌రావు విశిష్ట అతిథులు పద్మశ్రీ డా. కొలకలూరి ఇనాక్, జస్టిస్ బి.చంద్ర కుమార్, డా. సముద్రాల వేణుగోపాలాచారి, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులతో కలిసి కంఠంనేని రవిశంకర్‌ను ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాస్వామ్యం ఉన్నంతవరకు సజీవంగా కాంగ్రెస్ పార్టీ

### పిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నంత వరకు కాంగ్రెస్ బతికే ఉంటుందని టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్, బిజెపిలు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను డైవర్ట్ చేయాలని కొత్త నాటకాలు ఆడుతున్నారని అన్నారు. బిజెపి దర్శకత్వంలో బిఆర్ఎస్ డ్రామా కంపెనీ నడుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగి పోయే నావ అని కవిత అంటుంది, మీ కల్వకుంట్ల పార్టీ మునిగి పోయే నావ అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎవరు మునిగి పోలేదన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకొని కెసిఆర్ ఎదిగిండు అన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత బండిసంజయ్, కిషన్‌రెడ్డిలకు లేదు అన్నారు. బిఆర్ఎస్, బిజెపిలో విలీనం చేయాలని చూస్తున్నారు అని కవిత ఇప్పుడు అంటుంది, కానీ కెసిఆర్ బిఆర్ఎస్‌ను ఎప్పుడో బిజెపిలో కలిపారని అన్నారు. మేము 2023లోనే బిజెపి, బిఆర్ఎస్‌లు ఒక్కటే అని అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. 2023 ఎన్నికల్లో 8 ఎమ్మెల్యే సీట్లు బిజెపి గెలిస్తే, 2024 లో 8 పార్లమెంట్ సీట్లు ఎట్లా గెలిచారు అంటూ ప్రశ్నించారు. ఒక్క ఎమ్మెల్యే లేకుండా 5పార్లమెంట్ సీట్లలో ఎట్లా గెలిచారు అన్నారు.

## నేడు బిజెపి కార్యాలయంలో ఎంపిలు, ఎమ్మెల్యేలతో వర్క్‌షాప్

### ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పదాధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, బిజెపి జిల్లా అధ్యక్షులలకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11 సంవత్సరాల పరిపాలన, రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాలు చర్చించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు వ్యవసాయ సంబంధించి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం తదితర అంశాలను చర్చించనున్నారని తెలిపారు.

# ఔట్‌సోర్సింగ్‌లో కండక్టర్ల నియామకంపై యూనియన్ల మండిపాటు

### రెగ్యులర్ విధానంలో నియామకాలకు డిమాండ్

### జూన్ 17న నిరాహారదీక్ష చేపట్టనున్న ఎస్‌డబ్ల్యుయు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)లో ప్రైవేట్ మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామకాలు చేపట్టాలనుకుంటున్న యాజమాన్య నిర్ణయాన్ని అన్ని యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఆర్‌టిసిలో నియామకాలు చేపట్టలేదని.. ఇప్పుడు కూడా రెగ్యులర్ విధానంలో నియామకాలు చేపట్టకుండా ఔట్‌సోర్సింగ్ విధానంలో కండక్టర్లను నియమించడంపై యూనియన్లు మండిపడుతున్నాయి. ఆర్‌టిసిలో 3,038 కొత్త ఉద్యోగాల నియామకానికి ఉత్తర్వులిచ్చిన సంస్థ వాటిని ఔట్‌సోర్సింగ్ విధానంలో ప్రైవేట్ మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవడం ఏమిటని సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కండక్టర్ పోస్టులను రెగ్యులర్ విధానంలోనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని అందుకు తగిన మార్గదర్శకాలను జారీచేసిన ఉత్తర్వులను వెంటనే నిలిపి వేయాలని, లేదంటే ఆర్‌టిసి కార్మికులతో పాటు లక్షలాది నిరుద్యోగ యువతి యువకుల్లో ప్రభుత్వంపై తీవ్రవ్యతిరేకత వస్తుందని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూని యన్(ఎస్‌డబ్ల్యుయు) తెలిపింది.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తిచేసి అపాయింటెడ్ డే ప్రకటిం చాలని ఎస్‌డబ్ల్యుయు జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై జూన్ 17న సామూహిక నిరాహార దీక్షను చేపట్టనున్నట్టు తెలిపారు.

సంనత్సరం నుండి ఆర్‌టిసిలో 3,038 పోస్టులకు కొత్త ఉద్యోగ నియామాలకు అనుమతిచ్చామని ఒకవైపు ప్రకటిస్తూ వస్తున్న ప్రభుత్వం మరోవైపు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామాకాలను చేపట్టాలన్న ప్రక్రియను నిలిపివేయాలి డిమాండ్ చేశారు. గతంలో వలే ఆర్‌టిసి యాజమాన్యమే శాశ్వత ప్రాతిపాదికన నియమించుకునేవిధంగా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా ఔట్‌సోర్సింగ్ విధానం అమలు చేయడం ఏమిటనీ.. నియామకాలను రెగ్యులర్ విధానంలోనే చేపట్టాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్‌రావు డిమాండ్ చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.కోదండరామ్. చిత్రంలో అజీజ్‌పాషా, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

## పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమాన్ని తక్షణమే ఆపాలి

### పలువురు ప్రముఖుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 31, ప్రభాతవార్త:** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమాన్ని తక్షణమే నిలుపుదల చేయడానికి భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పలువురు ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల వల్ల వేలాదిమంది పిల్లలు, మహిళలు, పురుషులు, ప్రజలు చనిపోతున్నారని, ఇప్పటికే అనేకమంది చనిపోయారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సిపిఎం నేత అబ్బాస్ తదితరులు మాట్లాడారు. నిస్సహాయస్థితిలో ఉన్న గాజాపై ఇజ్రాయెల్ దారుణంగా దాడులకు పాల్పడటం అన్యాయమన్నారు. అక్కడ 60 వేల మంది చిన్నారులు పోషకాహారం లోపంతో బాధపడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మానవతా సహాయాన్ని ఇజ్రాయెల్ నిరంతరం అడ్డుకోవడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఉమర్ అహ్మద్ హసిజ్, అబ్బాస్, సారా మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

### ప్రాథమిక పాఠశాలల పట్ల వివక్ష తగదు

### జూలై, ఆగస్టు నెలల్లో సర్దుబాటు చేయాలి

### ప్రభుత్వానికి సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జిటియు) డిమాండ్ చేసింది. జులై, ఆగస్టు నెలలో సర్దుబాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వ వివక్ష తగదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలని ఉద్దేశంతో తీసుకొచ్చిన అశాస్త్రీయంగా ఉన్న ఈ ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడిబాట తర్వాత నమోదు అయిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాల్సిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను బడిబాటకు ముందే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలు ఒకరు లేకపోతే ఇద్దరు ఉపాధ్యాయులతో నడుస్తూ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని.. 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు 18 సబ్జెక్టులు ఎలా బోధించాలన్నారు.

చాలా ఇబ్బందికరమైన పరిస్థితులలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం నిర్వహించడానికి, క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను అందించడానికి ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయులు, తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించకుండా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను కూడా సర్దుబాటు పేరుతో ఏకపక్షంగా తీసేస్తే పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం, గుణాత్మక విద్య అనేది శూన్యం అవుతుందన్నారు.

ప్రజా ప్రభుత్వం గనక బడుగు బలహీన వర్గాల పేద పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చిత్తశుద్ధితో కనుక ఉన్నట్లయితే సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలన్నారు.

బడిబాట కార్యక్రమంలో ఇప్పుడిప్పుడే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల వైపు నడిపిస్తున్న సమయంలో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోనికి నెట్టే విధంగా తీసుకొచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగులు టీచర్లున్నట్లు జూన్‌లోనే ఎలా తేల్చుతారని.. చాలా ప్రాంతాల్లో సర్కారు బడుల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకొస్తున్నారని బడిబాట ముగిసిన తరువాత పిల్లల నమోదును పరిశీలించి జులై, ఆగస్టు మాసాల్లో చేయాల్సిన సర్దుబాటును జూన్‌లోనే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.



మీనాక్షి నటరాజన్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

## గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తాం

### డిసిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి

### పాల్వంచలో తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనం

**పాల్వంచ టౌన్, మే 31, ప్రభాతవార్త:** గిరిజన అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. శనివారం కిన్నెరసానిలోని ఎస్టీ గురుకులంలో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్త సమ్మేళనంలో వారు పాల్గొని ప్రసంగించారు. పదేళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదని,ప్రజా ప్రభుత్వంలో సబ్ ప్లాన్ నిధులు తూచా తప్పకుండా ఖర్చు చేస్తున్నాం . సబ్ ప్లాన్ కింద గిరిజనులకు 17,169 కోట్లు కేటాయించాం, గతంలో ఖర్చు చేయని 1,296 కోట్ల నిధులు క్యారీ ఫార్వర్డ్ చేశాంఆత్మగౌరవం, సమ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే సాధ్యం.. అందుకు అనుగుణంగా పథకాలు ప్రవేశపెట్టాం. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ఏ ఇంటికి ఏ పథకాలు అందుతున్నాయి, ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో పూర్తి వివరాలను త్వరలో ఇంటింటికి పంపిణీ చేస్తాం నాయకులుగా సంక్షేమ పథకాల పై ప్రచారం చేయండి, అర్హులతో దరఖాస్తులు చేయించండిగిరిజనుల అవసరాలు ఏంటో తెలుసుకొని ఆ వర్గాల నాయకులను ఒకచోట చేర్చి ఏఐసిసి ద్వారా అమలు చేసేందుకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం ధరణి పేరుతో అసైన్డ్ భూములను హస్త గతం చేసుకుంటుంటే ఆందోళనలు చేశాం ధరణిని బంగాళాఖాతంలో వేస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చాం భూభారతి చట్టాన్ని తెచ్చాం రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకంలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా వెయ్యి కోట్ల నిధులు. దేశ చరిత్రలోనే ఇది ఓ రికార్డు అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో బతికేందుకు ఇందిరా సౌర గిరిజన వికాసం తీసుకువచ్చాం. 6.70 లక్షల ఎకరాలను 12,500 కోట్లు ఖర్చు చేసి సాగులోకి తీసుకువస్తాం.గిరిజనుల హక్కులు ఆత్మగౌరవం కాపాడేందుకే నల్లమల్ల డిక్లరేషన్ తీసుకువచ్చామన్నారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఈ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. ప్రజలు చైతన్యవంతులని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు చేస్తుందని అన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ నోట చర్చలు.. అవన్నీ బూటకమే : ఎంజె అక్బర్

**న్యూఢిల్లీ, మే 31:** విదేశాంగ శాఖ మాజీ సహాయమంత్రి ఎంజె అక్బర్ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాక్‌ను పాముతో పోల్చిన ఆయన.. అబద్ధాలతో కాలం గడిపే, కపటనీతి కలిగిన దేశంతో చర్చలు జరపడం కష్టమేనన్నారు. దాయాది దేశంతో చర్చలు జరపవచ్చు కదా? అంటూ కొందరు చేస్తున్న వాదనకు బదులిస్తూ.. దానికి వెనక లాజిక్ ఏమిటని ప్రశ్నించారు. బిజెపి ఎంపి రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలో విదేశాల్లో పర్యటిస్తున్న విపక్ష బృందంలో ఉన్న అక్బర్,.. కోపెన్‌హాగన్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాక్‌పై నిప్పులు చెరిగారు.'పాకిస్థాన్‌తో భారత్ ఎందుకు చర్చలు జరపదని కొందరు మిత్రులు అడుగుతున్నారు. అక్కడ చిత్తశుద్ధిలేని ప్రభుత్వం ఉంది. ఎవరితో చర్చలు జరపాలి? అక్కడ వాగ్దానాలను ఉల్లంఘించే ప్రభుత్వం ఉంది. ఎవరితో మాట్లాడాలి? విషపు నాలుక కలిగిన ప్రభుత్వం అది.. దానివల్ల ఎవరికి నష్టం?' అని అక్బర్ ప్రశ్నించారు. సర్పం ఎన్నడూ తన విషంతో చనిపోదన్న విషయాన్ని గుర్తు చేశారు.దేశంలో దీర్ఘకాలంగా అశాంతికి పాకిస్థాన్ ప్రధాన కారణమని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఓ సాకుగా మారిన విషయాలపై చర్చల కోసం భారత్ తన సమయాన్ని వృథా చేసుకోదని స్పష్టం చేశారు. చర్చల కాలాన్ని దాయాది దేశం మరో ఉగ్రదాడికి ఉపయోగించుకుంటుందని మండిపడ్డారు. పాక్ నోట చర్చలు అనేవి బూటకపు మాటలు తప్ప మరేమీ లేదన్నారు. అవసరమైన విషయాలపై చర్చలు జరుపుతామని, అవి కూడా పిఒకెని తిరిగి తీసుకునే విషయంపైనేనని స్పషం చేశారు.



## స్టీల్, అల్యూమినియంపై 50శాతానికి టారిఫ్‌లు!

**న్యూయార్క్, మే 31 :** వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా మరో నిర్ణయాన్ని వెల్లడించారు. స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు చెప్పారు. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. పెన్సిల్వేనియాలోని పిట్స్ బర్గ్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు. ప్రతి స్టీల్ పరిశ్రమ కార్మికుడికి 5 వేల డాలర్ల బోనస్ అదనంగా వస్తుందని ట్రంప్ చెప్పారు. నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్న నేపథ్యంలో అమెరికా స్టీలల్ పరిశ్రమ ఉద్యోగులు పేమెంట్, హైరింగ్ అంశంలో ఆందోళన చెందుతున్నారు. అయితే అమెరికా స్టీల్‌ను రక్షించినట్లు ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అమెరికాలోని అతిపెద్ద స్టీల్ పరిశ్రమ పిట్స్ బర్గ్‌లో ఉన్నది. 2018లో తొలిసారి అధ్యక్షుడు అయినప్పుడు టారిఫ్‌ను 25 శాతానికి ట్రంప్ పెంచారు. సుంకాన్ని 50 శాతానికి పెంచడం అంటే, అమెరికా ఉక్కు పరిశ్రమను ఆదుకోవడమే అని ట్రంప్ వెల్లడించారు.

# ఆరు గ్యారంటీలపై చర్చను దారిమళ్లించేందుకు కొత్త ఎత్తుగడ

### కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా బిజెపిని అడ్డుకోలేవు

### 14 పంటలకు ఎమ్మెస్పీ పెంపు హర్షణీయం

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ రూరల్,ప్రభాతవార్త:** కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ పార్టీ దర్శకత్వంలో కల్వకుంట్ల కవిత ప్రధాన పాత్రధారిగా 'చార్ పత్తా' సినిమాను నడిపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రజలకు ఎలాంటి మేలు కలిగించని డ్రామాలతో సాధించేదేమీలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, దీనిపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉండటంతో వాళ్ల దృష్టిని మళ్లించేందుకు ఇట్లాంటి ఎత్తుగడ వేస్తోందని విమర్శించారు. శనివారం కరీంనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో, చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్,బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. గతంలో కరీంనగర్ లోని అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రశాంతనగర్ లోని వడ్డెర బస్తీలో 13 గుడిసెలు పూర్తిగా, మరో 12 గుడిసెలు పాక్షి కంగా దగ్ధమైన విషయం తెలిసిందే అన్నారు.ఆ సమయంలో కేంద్ర మంత్రితోపాటు నాటి మేయర్ సునీల్ రావు బాధితులను పరామర్శించి తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేశామన్నాడు. అట్లాగే ఇండ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం అందించామని తెలిపారు. వారి బతుకు దెరువుకు అవసరమైన 13 డ్రిల్లింగ్ మిషన్లను ఎంపీ లాడ్స్ నుండి కొనుగోలు చేసి బాధితులకు పంపిణీ చేశామన్నారు. గంగాధర మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.2.63 కోట్ల వ్యయంతో 23 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అందులో భాగంగా రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అట్లాగే రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లెలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 2 కోట్ల 33 లక్షల కోట్ల నిధులతో చేపట్టిన హైలెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గంలో 2.64 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో 23 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.ప్రజల ఇబ్బందులను గుర్తుంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు.రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.అందులో భాగంగానే రూ.30 లక్షలతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ ని ప్రారంభించుకున్నట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో సీఆర్ఐఎఫ్ నిధులతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.బీజేపీ అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2014లో బీజేపీ ఇచ్చిన హామీని మోదీ నెరవేరుస్తున్నారనీ తెలిపారు. అందులో భాగంగానే ఈ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరను (ఎంఎస్‌పీ) పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. పెంచిన ధరల ప్రకారం, వడ్లకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు 69 రూపాయలు పెంచారన్నారు.పెంచిన ధరతో కలిపి సాధారణ వడ్లకు ఎంఎస్ పి 2,369 రూపాయలు, ఖిఏఖి గ్రేడ్ రకం వరి ధాన్యం ధర క్వింటాల్‌కు 2,389 రూపాయలైందన్నారు.




శనివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

# బాధితుల ఫిర్యాదులను నమోదు చేయండి

### స్టేషన్ హౌస్‌ఆఫీసర్లతో డిజిపి జితేందర్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** వివిధ రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్లలో బాధితులు అందజేస్తున్న ఫిర్యాదులను నమోదు చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుండి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శనివారం నాడు డిజిపి కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... శాంతి భద్రతల సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు పోలీస్ స్టేషన్ కి వస్తారని వారి ఇస్తున్న ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. దీనివల్ల కేసుల సంఖ్య పెరుగుతుందేమో అనే సందేహాలు పెట్టుకోవద్దని కేసులు పెరిగినప్పటికీ పోలీసు అధికారులు స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎవరూ ప్రశ్నించరని తెలిపారు. కేసులు నమోదు చేసిన తర్వాత దర్యాప్తులో వాస్తవాలను తెలుసుకొని బాధితులను రక్షించి నిందితులకు శిక్ష పడలే చేయాల నే క్రిమినల్ జస్టిస్ సిస్టం ను పాటించాలని తద్వారా ఉత్తమ పోలీస్ అధికారులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. బాధితులకు సరైన న్యాయం జరగనప్పుడు మాత్రమే వారు వివిధ రకాల వ్యక్తులు దగ్గరికి వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కే సిఫారసులు తీసుకొస్తారని ముందుగానే బాధితులకు న్యాయం చేయడం ద్వారా ప్రజల్లో అభిమానాన్ని, విధి నిర్వహణలో సంతృప్తిని పొందవచ్చు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు పౌర ఆధారిత పోలీసింగ్ చేయడం ద్వారా ప్రజలకు మేలు చేయవచ్చని పేర్కొన్నారు.

కొన్ని విదేశీ కంపెనీలు హైదరాబాదులో శాంతిభద్రతలు సక్రమంగా ఉన్నాయని భావించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, కాలక్రమేనా హైదరాబాద్ మహానగరం మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభవం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల వారు, మహిళలు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి సక్రమంగా పనిచేసేలా శాంతి భద్రతలను కాపాడాలని డిజిపి అన్నారు.

క్యూఆర్ కోడ్ ఆధారంగా ఇటీవల పోలీస్ స్టేషన్ల పనితీరును సమీక్షించినప్పుడు దాదాపు పది పోలీస్ స్టేషన్లో 100 శాతం ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. పది పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సాధ్యమైనప్పుడు ఇతరులకు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడు ఫిర్యాదులు నూరు శాతం సంతృప్తి వ్యక్తం చేస్తారని ఆయా ఫలితాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఇతర ఏజెన్సీల ద్వారా తాము సమీక్షిస్తామని డిజిపి వెల్లడించారు. మహిళా పోలీస్ సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగిం చుకోవాలని సూచించారు. సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్ ఎం భగవత్ మాట్లాడుతూ.... స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరును సమీక్షించేందుకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ ఉపయోగపడుతుందని, ఫిర్యాదుదారులకు క్యూఆర్ కోడ్ పట్ల అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

రానున్న బక్రీద్ పండగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా అరికట్టాలని, ఇతర రాష్ట్రాల నుండి గాని ఇతర జిల్లాల నుండి గాని వచ్చేవాటిపై నిఘా పెట్టాలని సూచించారు. గోవుల రక్షణ పేరిట ఇతరులు సమాచారం ఇస్తే తీసుకోవాలని, పరిస్థితులు వారి చేతిలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. అరికట్టేందుకు కొత్త క్రిమినల్ చట్టాల్లో ఉన్న సెక్షన్లను నమోదు చేయడం ద్వారా యూనిట్ ఆఫీసర్ల నుంచి ప్రతిపాదనలను పంపి అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలను కేంద్రాలను మూసివేయాలన్నారు. తద్వారా రైతులను ఆదుకోవాలని అన్నారు. ఏఐజి రమణ కుమార్, డీఎస్పీ సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు అభయహస్తం ఇవ్వలేదదని, భస్మాసుర హస్తంగా మారిందని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం బిజెపి రాష్ట్రకార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి దేశ పరువు, రాష్ట్ర పరువు అనే భావన ఉండదని అనిపిస్తుందని, ఎప్పుడు కూడా బజార్లో పెట్టే ధోరణే వారిది అన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వం నుంచి మొదలుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయివరకు ప్రత్యేకంగా రేవంత్ రెడ్డి వరకు ఒకే విధమైన దారుణ ధోరణి కనిపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ మధ్య కాలంలో సంభవించిన అతి పెద్ద విపత్తు ఏదైనా ఉందంటే, అది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో ఊరూరూ తిరిగిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఓటు వేసిన ప్రజలందరినీ ఎగతాళి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు లేదు. రైతు రుణమాఫీ ఎటు పోయిందో తెలీదు, రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో తెలియదన్నారు. యాసంగి సాగు మిగిలిపోయింది, వానా కాలం వచ్చేసింది. గ్రామాల్లో వడ్లు కొనే నాథుడు లేకుండా పోయాడన్నారు. రాష్ట్రం లో అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు, పరిపాలన లేదు. ఉన్నవి పిల్లచేష్టలు, పిచ్చి మాటలు మాత్రమే అన్నారు. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తిడితే, తాను గొప్ప నాయకుడిని అన్నట్టు రేవంత్ అపోహలో పడ్డాడని అన్నారు. ఒక రకంగా చూస్తే రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ కోసం, మోడీ విమర్శిస్తున్నాడని పిస్తుందన్నారు. రాహుల్ అపాయింట్మెంట్ రాకపోతే వచ్చే నిరాశ, ఫ్రస్టేషన్‌ను మోడీ మీద, తెలంగాణ ప్రజల మీద చూపిస్తూ చౌకబారు విమర్శలు చేస్తున్నాడని అన్నారు. నరేంద్ర మోడీపై విమర్శలు చేస్తే, భారత్ రాఫెల్ యుద్ధ విమానాలు కూలిపోయాయంటూ అసత్య ప్రచారాలు చేస్తే అపాయింట్మెంట్ దొరుకుతుందని అనుకుంటున్నాడు, రేవంత్ రెడ్డి ముఖం చూస్తే అపరిచితుడు కనిపిస్తున్నాడు. ఆ నటన రేపు మరింత ముదిరే అవకాశముందన్నారు.



## రఫెల్ విమానాలు కూలాయన్న సిడిఎస్‌ను దేశద్రోహి అంటారా?

### ఆపరేషన్ సిందూర్‌లో కోల్పోయిన విమానాలపై స్పష్టత ఇవ్వాలి

### యుద్ధ విమానాల కొరత దేశ భద్రతకు మంచిది కాదని ఆందోళన : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** భారత వాయుసేనకు అవసరమైన ఫైటర్ జెట్లు, ఆయుధ సంపత్తిని సకాలంలో సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కీలకమైన "ఆపరేషన్ సిందూర్" సమయంలో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో దేశ ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన అన్నారు. రక్షణ వ్యవహారాల్లో పారదర్శకత ఉండాలని, విజయాలతో పాటు ఎదురైన సవాళ్లను కూడా ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "రఫెల్ యుద్ధ విమానాలు కూలిపోయాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించినప్పుడు, కొందరు ఆయనను దేశ వ్యతిరేకిగా చిత్రీకరించారు. అయితే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) స్వయంగా ఒక ఇంటర్వ్యూలో రఫెల్ విమానాలు కూలిన విషయాన్ని అంగీకరించారు. మరి ఇప్పుడు సీడీఎస్ వ్యాఖ్యలపై ఏమంటారు? ఆయనను కూడా దేశ వ్యతిరేకి అంటారా?" అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ వివరాలను వెల్లడించాలని కోరుతూ, పాకిస్థాన్‌కు చెందిన ఎన్ని ఫైటర్ జెట్లు కూలిపోయాయో కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "దేశంలో తగినన్ని యుద్ధ విమానాలు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమైన విషయం. ఇది దేశ భద్రతకు ఎంతమాత్రం మంచిది కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి రాజకీయం చేయడం లేదని, దేశ ప్రయోజనాల దృష్ట్యానే తాము మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. యుద్ధానికి సంబంధించిన విషయాలను రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని, వాస్తవాలను ప్రపంచానికి, దేశ ప్రజలకు బహిరంగంగా తెలియజేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. "కేవలం విజయాలను మాత్రమే కాకుండా, ఆపరేషన్లలో ఎదురైన లోటుపాట్లను, నష్టాలను కూడా ప్రజలకు వివరించాలి. అప్పుడే ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది" అని ఆయన హితవు పలికారు. వాయుసేనను పటిష్టం చేయడం, వారికి అవసరమైన ఆయుధాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సకాలంలో అందించడం కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక విధి అని ఆయన గుర్తుచేశారు.

## నేటి నుంచి రైల్వేలో జమ్మూ కేంద్రంగా కొత్త డివిజన్

### భారత రైల్వే చిత్రపటంలో మరో డివిజన్

### గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

**గుంతకల్లు రైల్వే,మే 31,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో జూన్ 1(నేటి) నుంచి కొత్త డివిజన్‌గా జమ్ము తావి ప్రారంభమైంది. ఈమేరకు కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది జనవరిలో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రాజెక్టు సమగ్ర నివేదికను(డిపిఆర్)ను సిద్ధం చేసి పంపమని నార్థన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఆదేశించిన విషయం వార్త పాఠకులకు విధితమే. వివరాల్లోకి వెళితే భారతీయ రైల్వే 17జోన్లు ఉండగా, వీటిలో మొత్తం 68డివిజన్లలో పంజాబ్, జమ్మూకాశ్మీర్,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి మొత్తం 1,849,95 రూట్ కి.మీలతో ఫిరోజ్ డివిజన్ పని చేస్తోంది.

నేటి నుంచి ప్రారంభం కానున్న జమ్మూతావి రైల్వే డివిజన్‌లో ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలోని 742కి.మీలను విడదీసి జమ్మూ కేంద్రంగా కొత్తగా రైల్వే డివిజన్‌ను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పునర్ వ్యవస్థీకరణలో ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలో 21సెక్షన్లు ఉండగా వాటిలో నుంచి పఠాన్ కోట్-జమ్ము- ఉద్ధంపూర్-శ్రీనగర్- బారాముల సెక్షన్‌లోని 423రూట్ కి.మీలతో పాటు భోగ్‌పూర్-సర్వాల్-పఠాన్‌కోట్ సెక్షన్‌లోని 87కి.మీలు, బటలా-పఠాన్ కోట్ సెక్షన్‌లోని 68కి.మీలు, పఠాన్‌కోట్-జోగింధర్ నగర్(నారోగంజ్) సెక్షన్‌లోని 164కి.మీలు వెరసి మొత్తం 742కి.మీలతో జమ్మూ కేంద్రంగా జమ్ముతావి రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం తన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో నార్థన్ రైల్వే జోన్ పరిధిలో ప్రస్తుతం ఐదు డివిజన్‌లు ఉండగా కొత్తగా ఏర్పడనున్న జమ్మూ డివిజన్‌తో వీటి సంఖ్య ఆరుకు చేరింది. ఇదిలా ఉండగా కొత్త డివిజన్ ఏర్పాటుతో గ్రూప్-సి, గ్రూప్-డి,క్యాడర్ ఉద్యోగుల సంఖ్యలో ఆప్షన్స్, బదిలీలు తప్ప పెద్దగా మార్పు ఉండకపోగా అధికారుల సంఖ్య మాత్రం పెరుగనుంది.

## ముగ్గురు ఉగ్రసానుభూతిపరులను అరెస్ట్ చేసిన ఎన్ఐఏ

### వరంగల్ తనిఖీల్లో గుర్తింపు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఏపిలోని విజయనగరంలో బాంబు పేలుళ్లకు కుట్రపన్నారనే సమాచారాలతో ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) అక్కడ, ఇటూ తెలంగాణలోనూ అణువణువు ముమ్మరంగా జల్లెడ పడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ కౌంటర్ ఇంటలిజెన్స్ పోలీసుల సూచనల మేరకు ఎన్ఐఏ రంగంలోకి దిగి వరంగల్ జిల్లాకు చెందిన ఫరహాన్ మోయినుద్దీన్‌తో పాటే మరో ఇద్దరి ఉగ్రసానుభూతిపరులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే గ్రూప్‌లలో కలాపాల చాటింగ్‌ను గుర్తించడంతో రంగంలోకి దిగింది. మొదటగా విజయనగరానికి చెందిన సిరాజుద్దీన్‌ను అరెస్ట్ చేసి విచారించగా హైదరాబాద్‌లోని సమీర్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. వెంటనే స్థానికుల పోలీసులను అప్రమత్తం చేసి సికింద్రాబాద్ బోయిగూడలోని అతన్ని అదుపులోకి తీసుకుని ఇన్‌స్టాను తనిఖీ చేయగా ఫరహాన్, మరో ఇద్దరు కలాపాలు బయటపడ్డాయి. ఖాతా ఫాలోవర్లతో జరిపిన చాటింగ్‌ను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఫోన్‌సిగ్నల్ ఆధారంగా ఐపీ అడ్రస్‌లు కర్ణాటక, మధ్యప్రదేశ్, దుబాయ్, హైదరాబాద్, వరంగల్ చెందినవిగా తేలింది. ఫరహాన్ మొబైల్ స్వాధీనం చేసుకొని సిరాజ్, సమీర్‌ల ఫోన్‌నెంబర్లలో మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. దీంతో ఏడాదిన్నర క్రితం సిరాజ్‌కు దుబాయ్ హ్యాండర్లను సంప్రదించాడు. అక్కడ ఉన్న కీలకవ్యక్తులు కూడా హైదరాబాద్, బీహార్‌కు చెందినవారేనని కనుగొన్నారు. వారి ఆదేశాలతోనే సిరాజ్, సమీర్‌లు పేలుళ్ల కుట్రకు పథకాన్ని రూపొందించారని ఆధారాలను సైతం ఎన్ఐఏ సేకరించింది. ఈ క్రమంలో వీరిద్దరు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పాతబస్తీలో సంచరించినట్లు గుర్తించారు. వీరు వాడుతున్న సిగ్నల్‌యాప్‌ను పరిశీలించగా అహీం అనే గ్రూపులో మరో 12మందితో చాటింగ్ చేస్తున్నట్లు తెలింది.




### పేలుళ్ల ఆదేశం దుబాయ్ నుంచే..

హైదరాబాద్‌లో పేలుళ్ల జరపమని సిరాజ్‌కు దుబాయ్ నుంచి ఆదేశాలు రాగా, విజయనగరం లోనే పేలుళ్ల జరిపితే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని కోడ్‌భాషలో చెప్పినట్టు ఎన్ఐఏ ఆధారాలను సేకరించింది. విజయనగరంలో రద్దీగా ఉండే నాలుగు ప్రదేశాల ఫోటోలు, వీడియోలు హ్యాండ్లర్లకు అందినట్టు గుర్తించారు.అతను చెప్పిన విషయాలకు అంగీకరించిన హ్యాండ్లర్లు తొలుత పేలుడు పదార్థాలు తయారు చేసి రిహార్సల్‌నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో బ్యాటరీలు, పేలుడు పదార్థం తయారు చేసేందుకు వినియోగించే ముడి పదార్థాలు తీసుకున్నట్లు భావించారు.

## భారత్, పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్

### 11 సార్లు చెప్పినా స్పందించని ప్రధాని మోడీ: జైరామ్‌రమేష్

**న్యూఢిల్లీ, మే 31:** భారత్, పాక్ కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎప్పుడు స్పందిస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. తానే మధ్యవర్తిత్వం చేశానని ట్రంప్ బల్లగుద్ది చెప్పుకుంటున్నా మోదీ స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని పేర్కొంది. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. భారత్ పాక్ కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ చెప్పుకుంటున్న ఒక వీడియో క్లిప్‌ను తన ట్వీట్‌కు జైరాం రమేశ్ జతచేశారు. గత 21 రోజుల్లో మోదీ గొప్ప స్నేహితుడు ట్రంప్ ఈవిషయాన్ని చెప్పుకోవడం 11వసారి. ఇంతకీ దీనిపై ప్రధాని ఎప్పుడు మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. అమెరికా వాణిజ్య శాఖ మంత్రి కూడా ఈవిషయాన్ని మే 23న న్యూయార్క్‌లోని కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో చెప్పారని జైరాం రమేశ్ గుర్తు చేశారు. అయినప్పటికీ డొనాల్డ్ భాయ్ స్నేహితుడైన నరేంద్రమోదీ ఈ అంశాన్ని పట్టించుకోనట్టుగా వదిలేసి, మౌనం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇంతకీ దీనిపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడటం లేదో అర్థం కావడం లేదన్నారు. ట్రంప్ సగమైనా నిజం చెబుతున్నారా,ప్రధాని మోదీ నిత్యం చేసే పనినే అధ్యక్షుడు ట్రంప్ కూడా చేస్తున్నారా లేదంటే ఆయన సగమైనా నిజం చెబుతున్నారా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా ట్రంప్ ప్రకటనలపై క్లారిటీ ఇచ్చి, వాటిపై అధికారికంగా అభ్యంతరాన్ని వ్యక్తం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

‘భైరవం సినిమాకి ఇంత అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్ యూ. ఇది నాకు వెరీ మెమరబుల్ డే. సినిమాని అందరూ థియేటర్స్ లోనే చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను: ప్రెస్ మీట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ‘భైరవమ్ కు ఇంత ప్రేమ, ఆదరణ చూపించిన ప్రతి ఒక్కరికి థాంక్యూ: హీరో మంచు మనోజ్ ‘భైరవమ్ కు ఆడియన్స్ నుంచి గ్రేట్ రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది: హీరో నారా రోహిత్‌బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ‘భైరవమ్. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పించారు. మే 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్‌లో

# ‘భైరవమ్ కు అద్భుతమైన రెస్పాన్స్



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. మా అందరికీ కొంచెం గ్యాప్ వచ్చినా ఆడియన్స్ నుంచి ఇంత సపోర్టు, ప్రేమ రావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా తప్పకుండా మీరందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలి. ఇలాంటి మంచి సినిమా చూస్తే మీకు కూడా ఒక మంచి ఫీలింగ్ ఉంటుంది. ఆ రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటారు. ఇలాంటి సినిమా మీరందరూ చూసి మమ్మల్ని ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. . నాకు ఈరోజు వెరీ హ్యాపీ మూమెంట్. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నమెంట్ కి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. ఇది నాకు వెరీ మెమొరబుల్ డే. ఈ సినిమాని, నన్ను సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి థాంక్యూ. తప్పకుండా ఈ సినిమాని అందరూ థియేటర్స్ లోనే చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నానుఅన్నారు.హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. భైరవం సినిమాకి గొప్ప విజయం ఇచ్చినందుకు ఆడియన్స్‌కి థాంక్యూ. ఈ సినిమా మాకు ఇచ్చిన డైరెక్టర్ విజయకి జీవితాంతం రుణపడి ఉంటాం. సినిమాని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. మా టీమ్ అందరికీ థాంక్ యూ. తమ్ముడు సాయి శ్రీనివాస్ గ్రేట్ పర్ఫామెన్స్ ఇచ్చాడు. రోహిత్ బాబాయ్ కంగ్రాజులేషన్స్. 9సంవత్సరాలు తర్వాత వచ్చిన నాకు ఇంత ప్రేమ ఆదరణ చూపించిన ప్రతి ఒక్కరికి థాంక్యూ. రేపటి నుంచి ప్రతి ఒక్క ఊరికి రావడం జరుగుతుంది. ఇది విజిల్స్ వేసి గోల చేసే సినిమా. ప్రతి ఒక్కరూ వెళ్లి థియేటర్స్ లో చూడండి. ఈ సినిమాని ఇంకొంచెం పెద్ద విజయం చేసి సూపర్‌డూపర్ హిట్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# ‘సైయార్హా టీజర్ విడుదల..

యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై అహాన్ పాండే, అనీత్ పద్దా జంటగా మోహిత్ సూరి తెరకెక్కించిన ‘సైయార్హా టీజర్ విడుదల.

యష్ రాజ్ ఫిల్మ్స్ (వైఆర్ఎఫ్) నిర్మాణంలో మోహిత్ సూరి తెరకెక్కించిన



చిత్రం ‘సైయార్హా వైఆర్ఎఫ్ నీ బ్యానర్ నుంచి వచ్చే ప్రేమ కథా చిత్రాలకు ఉండే ఫాలోయింగ్, క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగానే ఈ ‘సైయార్హా చిత్రాన్ని రూపొందించారు. అహాన్ పాండేను హిందీ చిత్ర పరిశ్రమకు ఈ చిత్రంతోనే హీరోగా పరిచయం చేయనున్నారు.ఈ క్రమంలో అహాన్ పాండే, అనీత్ జంట ఎలా ఉండబోతోంది? అసలు వారిద్దరి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియజేసేందుకు టీజర్‌ను విడుదల చేశారు. ఇంటెన్స్ లవ్ స్టోరీగా రాబోతోన్న ఈ ‘సైయార్హా టీజర్‌ను రిలీజ్ చేశారు. సైయారా చిత్రాన్ని కంపెనీ సిఇఓ అక్షయ్ విధాని నిర్మించారు. ఇక ఈ మూవీ టీజర్‌ను గమనిస్తే. ఇదొక ఇంటెన్స్ లవ్ డ్రామా అని అర్థం అవుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ ప్రేమ కథను అంతే అందంగా తెరకెక్కించారు. హీరో హీరోయిన్ల పరిచయం, ప్రేమ, బ్రేకప్ వంటి సీన్లతో టీజర్‌ను అందంగా మలిచారు. ఇద్దరి నటన ఈ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు. ఇక విజువల్స్, మ్యూజిక్ ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానున్నాయి. సైయారా అంటే ఆకాశంలోని ఒంటరి తార అని టీజర్ చూస్తే అర్థం తెలుస్తోంది.

# ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ్ణ నుంచి ప్లెజెంట్ టీజర్

**మేఘాలు** చెప్పిన ప్రేమకథ చాలా నిజాయితీగా తీసిన ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్. తప్పకుండా అందరికీ నచ్చుతుంది: టీజర్ లాంచ్‌ఈవెంట్ లో డైరెక్టర్ విపిన్ టీంయంగ్ హీరో నరేష్ అగస్త్య అప్ కమింగ్ మూవీ మేఘాలు చెప్పిన ప్రేమ కథతో అందరినీ ఆకర్షించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ చిత్రం సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఉమా దేవి కోట నిర్మిస్తున్నారు. విపిన్ దర్శకత్వం వహించిన కంటెంట్‌రిచ్ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ఇది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు టీజర్ ను లాంచ్ చేశారు. ఈఒకప్రతిభావంతమైనసంగీతకారుడి చుట్టూ తిరుగుతుంది. అతడు ఒక గొప్ప ఆల్బమ్‌కి స్ఫూర్తి పొందేందుకు ప్రశాంతమైన పర్వతప్రాంతానికి వెళ్తాడు. అక్కడ ఓ అమ్మాయిని కలుస్తాడు. ఈ ఇద్దరి జర్నీ హృదయానికి హత్తుకునే బంధాన్ని తెరపై ఆవిష్కరిస్తాయి. టీజర్ చివర్లో హీరో లేచిపోయిన



జంటని చూశావాఅని హీరోయిన్ ని సరదాగా అడిగే సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.నరేష్ అగస్త్య తన పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. రబియా ఖతూన్ లైవ్లీగా కనిపించింది రాధికా శరత కుమార్ కథకు బలాన్నీ, వాల్యూని జోడించుతుంది. దర్శకుడు విపిన్ ఒక అందమైన ప్రేమకథను ఎంచుకున్నారు, అద్భుతమైన పర్వతప్రాంతంలోని నేపథ్యంలో సాగుతుంది, అక్కడ సంగీతం ఒక కీలకమైన పాత్రను పోషిస్తుంది. సినిమాటోగ్రాఫర్ మోహన కృష్ణ సహజ సౌందర్యాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరణ్ మ్యూజిక్ మ్యూజికల్ గా వుంది. డైలాగ్స్ కట్టిపడేస్తున్నాయి. ఆర్ట్ డైరెక్టర్‌గా తోటా తరణి, ఎడిటర్‌గా మార్తాండ్ కె. వెంకటేష్ అద్భుతమైన వర్క్ అందించారు. టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్‌విడుదల కోసం ప్రేక్షకుల్లో క్యురియాసిటీని పెంచింది. ఈవెంట్ లో డైరెక్టర్ విపిన్‌మాట్లాడుతూ.అందరికీ నమస్కారం. ఇది చాలా క్లీన్ ఎంటర్టైనర్. చూసినప్పుడు మంచి ఫీలింగ్ వస్తుంది. మా సినిమాలో ప్రిన్స్ రామ వర్మనే పెద్ద సంగీత విద్వాంసులు, ట్రావెల్ కోర్ వారసులు ఒక ఇంపార్టెంట్ గెస్ట్ రోల్ చేశారు. ఆయన రాచరికాన్ని అన్నిటిని త్యాగం చేసి మంగళంపల్లి వారి దగ్గర 18 సంవత్సరాలు సంగీత సాధన చేశారు. అలాంటి స్పెషల్ పర్సన్ మన సినిమాలో పాడారు. అలాగే నటించారు. ఇందులో ఒక పాట ఉంది. అనే బ్యూటిఫుల్ లొకేషన్లో జరిగే బ్యూటిఫుల్ కథ ఇది.

# “ధర్మచక్రమ్ణ సినిమా ఆడియోరిలీజ్



విశ్వ విఖ్యాత నందమూరి తారకరామారావు జన్మదినోత్సవం పురస్కరించుకొని మహానాడు పర్వదిన సందర్భంగా వెంకటరమణ పసుపులేటి సృష్టించిన “ధర్మచక్రమ్ణ సినిమా ఆడియో విడుదల.సంచలనాలకు తెర లేపబోతున్న ‘ధర్మచక్రమ్ మూవీచంద్రన్న చరిత్ర స్ఫూర్తితో ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ నిర్మాణంతెలుగు రాజకీయ, సినీ రంగాల్లో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోన్న చిత్రం ‘ధర్మచక్రమ్ . ఈ సినిమాను నిస్వార్థ సేవా దృక్పథంతో స్థాపితమైన ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థను స్థాపించిన వ్యక్తి, గత ముప్పై ఏళ్లుగా సొంత ఖర్చులతో, ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంల ‘ధర్మచక్రమ్ సినిమా షూటింగ్ పూర్తయినట్లు ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ ప్రకటించింది. ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ, ‘ధర్మచక్రమ్ సినిమా చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడి, పార్టీ విలువలను కాపాడిన జీవన గాథకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ సినిమా ద్వారా నోటు రుచి మరిగిన వారికి పదవులిస్తే ఓటు విలువ తగ్గుతుందనే సందేశాన్ని ప్రేక్షకులకు అందిస్తున్నాం. ధర్మం గెలుస్తుంది అనే సందేశాన్ని తెరకెక్కించాము. రాముడుని అడవికి పంపించే దాక మందర నిద్రపోని విధంగా, ఈ సినిమాను ఆపాలని కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ, ‘ధర్మచక్రమ్ సినిమా సూపర్ హిట్ అవుతుంది, చంద్రబాబునాయుడు చరిత్రకారుడు అవుతారు అని ధర్మచక్రం ఋజువు చేస్తుంది అని ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ ధీమాగా ఉంది. రాముడు దేవుడయ్యాడు, మందర చరిత్ర హీనమైంది. విశ్వవిఖ్యాత నందమూరి తారకరామారావు జన్మదినోత్సవం పురస్కరించుకొని మహానాడు పర్వదిన సందర్భంగా “ధర్మచక్రమ్ణ సినిమా ఆడియో విడుదల కావడం సంతోషంగా ఉందని అన్నారు.సినిమా విడుదలకు ముందు,ఎస్ఐఎఫ్ఎఎ గ్రూప్ సభ్యులు ఐకమత్యంతో సోషల్ మీడియాలో పాటలను, చిత్ర విశేషాలను ప్రచారం చేసి, జాతరో జాతర సృష్టించాలని చిత్ర యూనిట్ పిలుపునిచ్చింది, ఎస్ఐఎఫ్ఎఎ సంస్థ తమ విలువలకు కట్టుబడి, ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి కృషి చేస్తోంది. సినిమాను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.దర్శకుడు: వెంకటరమణ పసుపులేటి, లిరిక్స్: వెంకటరమణ పసుపులేటి,సంగీతం: రాజకిరణ్, గాత్రం: మాళవిక, రాంకీ, వినాయక్, పీఆర్వో: కడలి రాంబాబు, అశోక్ దయ్యాల .



రశ్మిక మందన్నా

# ‘జర్నీఆఫ్ ఎమోషనల్ స్కై టీజర్ణ్ లాంచ్

**త్వరలో** గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న మూవీ.. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా నటిస్తున్న సినిమా “స్కైణ. ఈ చిత్రాన్ని వాలోర్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ లో నాగి రెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న “స్కైణ సినిమా నుంచి జర్నీ ఆఫ్ ఎమోషనల్ స్కై టీజర్ణ్ లాంఛ్ చేశారు. హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మూవీ టీమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగాహీరోయిన్ శృతి శెట్టి మాట్లాడుతూ , “స్కైణ సినిమాలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. మా టీమ్ అంతా మనసు పెట్టి ఈ మూవీకి వర్క్ చేశాం. వీలైనంత త్వరగా “స్కైణ సినిమాను మీ ముందుకు తీసుకురావాలని ఎగ్జైటింగ్ గా ఉన్నాం. మా సినిమా ప్రతి ఒక్క ఆడియెన్ కు నచ్చుతుంది. అన్నారు.హీరో, నిర్మాత మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ, నన్ను నేను హీరోగా కంటే ఒక నటుడిగా భావిస్తా. ఈ సినిమాలో ప్రతిభ గల టీమ్ తో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది.



రీసెంట్ గా మా మూవీ స్క్రీనింగ్ చేసినప్పుడు నా క్యారెక్టర్ ను మర్చిపోయి సినిమాను ఎంజాయ్ చేశా. నేను ఎలా నటించాను అని మా టీమ్ మెంబర్స్ ను అడిగితే ఎంకరేజింగ్ గా చెప్పారు. మా టీమ్ లో రసూల్ గారి లాంటి చాలా ఎక్స్‌పీరియన్స్ టెక్నీషియన్ ఉండటం ఎంతో కాన్ఫిడెన్స్ ఇచ్చింది. త్వరలోనే “స్కైణ మూవీతో మీ ముందుకు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం. అన్నారు.సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ మాట్లాడుతూ ఒక కాంపాక్ట్ బడ్జెట్ లో పర్ఫెక్ట్ గా ఒక మూవీ చేస్తే ఎలా ఉంటుంది అనేందుకు మా “స్కైణ సినిమా ఎగ్జాంపుల్.ఛాలెంజింగ్ గా తీసుకుని ఈ సినిమాకు ప్రతి ఒక్కరం పనిచేశాం. ఆ ప్రయత్నంలో సక్సెస్ అయ్యామని నమ్ముతున్నాం. మా “స్కైణ సినిమాకు మీడియా మిత్రులు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. మీరు సపోర్ట్ చేస్తే మరిన్ని ఇలాంటి మంచి చిన్న బడ్జెట్ మూవీస్ వస్తాయి. డైరెక్టర్ పృథ్వీ పొయెటిక్ కథతో చాలా ప్యాషనేట్ గా ఈ మూవీని రూపొందించారు. మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుందని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల మాట్లాడుతూ, సినిమా మేకింగ్ అంటే ఏంటో, ఏ క్రాఫ్టులు కలిసి పనిచేస్తాయో అవగాహన తెచ్చుకుంటూ ఈ చిత్రానికి సన్నాహాలు చేసుకున్నాం. డైరెక్టర్ గా నాకు ఇది డెబ్యూ మూవీ. నేను ముందు ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గారిని కలిశాను. ఆ తర్వాత రసూల్ గారిని కలిశాను. సినిమా మీద ప్యాషన్ తో మేమంతా వర్క్ చేశాం. ఇటీవల “స్కైణ మూవీ షో చూసి మూవీ చాలా బాగుందని అంతా చెప్పారు.

# ‘దండోర్ణా తో నటిగా అదితి భావరాజుఎంట్రీ

లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ‘దండోర్ణా మూవీతో నటిగా ఎంట్రీ ఇస్తోన్న సింగర్ అదితి భావరాజులౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ను స్థాపించి తొలి చిత్రం కలర్‌ఫోటోతో అందరి దృష్టిని ఆకర్షించిన డైనమిక్ ప్రొడ్యూసర్ రవీంద్ర బెనర్జీ ముప్పనేని.. ఆ తర్వాత ‘బెదురులంక 2012ణ వంటి సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. మరోసారి ఆయన తన సక్సెస్‌ఫుల్ బ్యానర్‌పై నిర్మిస్తోన్న లేటెస్ట్ ఎగ్జయిటింగ్ మూవీ ‘దండోర్ణా. ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వంవహిస్తున్నారు.గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో రూపొందుతోన్న‘దండోర్ణాలో బలమైన ప్రేమ కథాంశంతో పాటు కఠినమైన నిజాలను, సమాజంలో కొనసాగుతోన్న సామాజిక దుష్ప్రవర్తలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మోనికా రెడ్డి, బిందు మాధవి,రాధ్య తదితరులు ప్రధాన పాత్రల్లో మెప్పించనున్నారు.ఇప్పుడు టాలెంటెడ్ సింగర్ అదితి భావరాజు నటిగా ఈ చిత్రంతో సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇస్తున్నారు. ఎన్నో చార్ట్ బస్టర్ సాంగ్స్‌ను ఆలపించిన అదితి ‘దండోర్ణా చిత్రంలో నటనా ప్రతిభను ప్రదర్శించనుంది. ఆమె ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు.దండోరా మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది.తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు కీలక షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల విడుదలైన మూవీ ఫస్ట్ బీట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని ఆసక్తికరమైనవిశేషాలనుతెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్నఈ సినిమాకు మార్క్ కె.రాబిన్‌సంగీతాన్నిసమకూరుస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రాఫర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ఆర్ట్ డైరెక్టర్‌గా, రేఖా బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఎడ్వర్డ్ స్టీవెన్‌సన్ పెరెజి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కొండారు వెంకటేష్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. బియాండ్ మీడియా నుంచి నాయుడు సురేంద్రకుమార్, ఫణికందుకూరి మీడియా మేనేజ్‌మెంట్ పిఆర్ వర్క్‌ను. టికెట్ ఫ్యాక్టరీ మార్కెటింగ్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.



# నార్నే నితిన్ “శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు ట్రైలర్ లాంచ్

ఘనంగా యంగ్ హీరో నార్నె నితిన్ “శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు ట్రైలర్ లాంచ్, జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కు వస్తున్న మూవీనార్నె నితిన్ ,చిత్ర పరిశ్రమలోకి ఎన్టీఆర్ బావమరిదిగా ఎంట్రీ ఇచ్చి వరుస విజయాలు అందుకుంటున్న యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో.తనకంటూ ఓ పందాన్ని ఏర్పరచుకుని ప్రేక్షకుల మదిలో నటన పరంగా మంచి మార్కులు సంపాదించుకుంటున్నారు నార్నే నితిన్ .అలాగే జాతీయ అవార్డు విన్నర్ , “శతమానం భవతి“ దర్శకులు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో నార్నె నితిన్ “శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు జూన్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన సరసన సంపద హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. అన్నికమర్షియల్ ఎలిమెంట్స్ తో యూత్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంఅత్యధిక థియేటర్లలో జూన్ 6న ప్రేక్షకులకు ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ నుహైదరాబాద్‌లో రిలీజ్ చేశారు ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు సతీష్ వేగ్నేష్న, నిర్మాత చింతపల్లి రామారావు, కో ప్రొడ్యూసర్ సుబ్బారెడ్డి,, దర్శక నిర్మాత రాజేష్ పుత్ర, రఘు కుంచే, రచ్చ రవి, సంగీత దర్శకుడు కైలాషా మీనన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగాదర్శకుడు సతీష్ వేగేశ్న మాట్లాడుతూ, మా “శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు సినిమా సాంగ్స్, ట్రైలర్ ను సక్సెస్ చేసిన మీ అందరికీ థ్యాంక్స్. ఈ సినిమాలో నరేష్ గారు ఒక డైలాగ్ చెబుతారు. మనల్ని మనం జయించుకోవడమే సక్సెస్ అంటే. ఈ కాన్సెప్ట్ తో సినిమాను రూపొందించాం. మా హీరో నార్నే నితిన్ పక్కింటి కుర్రాడిలా మొదలుపెట్టి, యాక్షన్ పరంగా ఆకట్టుకుంటూ అద్భుతంగా పర్ ఫార్మ్ చేశాడు. హీరోయిన్ సంపద మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. నా సినిమాల్లో ఎక్కువమంది ఆర్టిస్టులు ఉంటారు. కారణం మన కుటుంబాల్లో ఎలా ఎక్కువమంది మనవాళ్లు ఉండేవారే. నా కథల్లోనూ అలాంటి పాత్రలే పలకరిస్తాయి. మరుగున పడిన కొన్నింటిని చూపించాలనే నా మూవీస్ ద్వారా తాపత్రయపడుతుంటాను. అలాంటి ప్రయత్నమే “శ్రీ శ్రీశ్రీ రాజావార్ణు . ఈ సినిమా మిమ్మల్ని నిరాశపర్చదు. అన్ని విషయాల్లో ఆకట్టుకుంటుంది. నా టెక్నికల్ టీమ్ అందరూ చాలా కష్టపడి పనిచేశారు. అయితే మేము ఎంత కష్టపడినా మీ ఆదరణ ఉంటేనే సక్సెస్ అవుతుంది. జూన్ 6న థియేటర్స్ లోకి వస్తున్న “శ్రీ శ్రీ శ్రీ రాజావార్ణు సినిమాను సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ, ఒక మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ తో బిగ్ హిట్ మూవీని నిర్మించాలని నార్నె నితిన్, వేగేశ్న సతీష్ కాంబినేషన్లో ఈ చిత్రాన్ని రూపొందించాం. మా చిత్ర హీరో నార్నె నితిన్ ఇటీవల మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మూవీస్ తో వరుస విజయాలు అందుకుంటున్నారు. ఇక శ్రీశ్రీశ్రీ రాజావారు విషయానికొస్తే మంచి గ్రామీణ నేపథ్యంలో సాగే వెరైటీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది.పూర్తి కమర్షియల్ ఫార్మాట్ లో భారీ తారాగణంతో తెరకెక్కించారు దర్శకుడు సతీష్ వేగేశ్న. అలాగే ఎన్టీఆర్ ఎంతో మెచ్చి, ఈ కథను ఎంపిక చేశారు. ఆయన అంచనాల మేరకు దర్శకుడు ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కించారు. కచ్చితంగా ఈ జూన్ 6న నార్నె నితిన్ ఖాతాలోఆయ్, మ్యాడ్ తరహాలో మరో సూపర్ హిట్ హిట్ పడుతుందని గట్టిగా నమ్ముతున్నాం. అని అన్నారు.నటీనటులు: నార్నే నితిన్, సంపద, రావు రమేష్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరయు, రమ్య, ప్రియ మాచిరాజు, భద్రం, ఆనంద్, జబర్దస్త్ నాగి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.్నికల్ టీమ్: సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల, ఎడిటర్: మధు, పాటలు: శ్రీమణి, పబ్లిసిటీ డిజైనర్: ఈశ్వర్, పి అర్ ఓ: బి. వీరబాబు, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర, మురళీకృష్ణ చింతలపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సి.హెచ్.వి. శర్మ, రాజీవ్‌కుమార్, సహ నిర్మాత: ఎమ్. సుబ్బారెడ్డి, నిర్మాత: చింతపల్లి రామారావు, రచన,దర్శకత్వం: సతీష్ వేగేశ్న.



# మిస్ వరల్డ్ విజేతకు బహుమతిగా..



ప్రపంచ సుందరిగా గెలిచిన అందాల రాణి కోట్ల రూపాయల నగదు మాత్రమే బహుమతిగా అందుకోదు. లండన్‌లో ఏడాది పొడవునా నివాసం, అలంకరణ దుస్తులతో పాటు మేకప్, చెప్పులు, నగలు... అన్నీ విజేతకు ఉచితంగా దక్కుతాయి. అంతేకాదు, పోషకాహార, ఫిట్నెస్ నిపుణులు, పీఆర్ సిబ్బంది... ఈ కాలంలో ఆమెకు సహాయంగా ఉంటారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఒప్పందాలను అనుసరించి 'బ్యూటీ విత్ పర్పస్' ప్రాజెక్టులకు ప్రసిద్ధి చెందింది. ఈ సంవత్సరం మొత్తం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్, అది వారు దాతృత్వ కార్యక్రమాలకు రాయబారిగా వ్యవహరించారు. అలానే, గెలిచిన అందాలరాణి... తన సొంత సేవాకార్యక్రమాలనూ నిర్వహించవచ్చు. అయితే, మోడలింగ్, నటన అవకాశాలు వస్తే మాత్రం... మిస్ వరల్డ్ సంస్థ అనుమతితో కొనసాగుతుంది. □

## ప్రయోగాలతో నేర్పిద్దామా?



ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలకు ఆటవిడుపు వినోదాన్నే కాదు. విజ్ఞానాన్నీ అందిస్తే బాగుంటుంది కదా! చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు వారిలో కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని ఇస్తాయి. ఉదాహరణకు వినెగర్‌తో బేకింగ్ సోడా చర్య జరిపినప్పుడు కార్బన్‌డయాక్సైడ్ వాయువు ఉత్పత్తి అవుతుంది. దాన్ని పిల్లలకు ప్రత్య క్షంగా చూపించేందుకు ఓ గాజు గ్లాసు లోకి 1/3 వంతు వినెగర్ తీసుకోండి. ఆపై అందులో చెంచా బేకింగ్ సోడా వేస్తే సరి. ఈ రెండూ కలిసినప్పుడు నీళ్ల నురగలు/బుడగలు కక్కుతూ సీసా బయటకి పొంగుతాయి. ఆ బుడగలే కార్బన్‌డయాక్సైడ్ వాయువు అని చెబితే వాళ్లకి థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దాంతో మరో ప్రయోగం చేద్దామా అని మిమ్మల్నే అడుగుతాడు. □

# వైద్యురాలు మిస్ వరల్డ్ వేదికపై..



వైద్యురాలు.. కానీ మిస్ వరల్డ్ వేదికపై కిరీటం కోసం పోటీలో ఉన్నారు. మిస్ **తుర్కియే ఇదిల్ బిల్గెన్.** ఎందుకంటే నా అందాల పోటీ జీవితాన్ని సాకారం వేదిక అని చెప్తున్నారు మహిళల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఈమె హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో ఆసియా ఓషియానా తరఫున విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. మనతో తన ప్రయాణాన్ని పంచుకున్నారిలా....

కుటుంబానికి తల్లే జీవనాధారం. అటువంటి ఆమె ఆరోగ్యాన్ని పట్టించుకోకపోతే జరిగే నష్టం భర్తీ చేయలేనిది. ఆ బాధేంటో నాకు బాగా తెలుసు. మా అమ్మ రొమ్ము క్యాన్సర్‌తో చనిపోయారు. నా కష్టం వేరెవరికీ రావొద్దనుకున్నా. దానికోసం ఏదైనా చేయాలనుకున్నా. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. వాటిల్లోనూ ఎక్కువమంది బాధితులు మహిళలే. వీళ్ల తమ ఆరోగ్యానికి ఎప్పుడూ ప్రాథమిక ప్రాధాన్యత ఇవ్వరు. పరీక్షలు వగైరా చేయించుకోరు. ఈ విషయం నన్ను కలవరపరిచింది. ఇక్కడ ప్రధాన సమస్య అవగాహన లేకపోవడమే. మా అమ్మ కూడా అలాగే చనిపోయింది. వీటిని ముందే గుర్తిస్తే చాలా వరకు నష్టాన్ని నివారించొచ్చు. అందుకే మెడిసిన్ పూర్తిచేశాక మహిళలకు తీవ్ర సమస్యగా మారుతున్న రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ల మీద అవగాహన కల్పించడం ప్రారంభించింది. అంతేకాదు, ప్రస్తుతం అమెరికాలో రేడియేషన్ అంకాలజీలో స్పెషలైజేషన్ చేస్తున్నా. అక్కడి ప్రముఖ క్యాన్సర్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నా. రేడియేషన్ ఆంకాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణలపైనా పనిచేస్తున్నా. అందాల పోటీలు సౌందర్య ప్రదర్శనకే కాదు... ఎంతో మందిని చేరుకునే వేదిక కూడా. ఈ అవగాహన వచ్చాకే అందాల పోటీల్లో పాదం మోపా. అందుకే నా బ్యూటీ విత్ ఎ పర్పస్ ప్రాజెక్ట్ కూడా.. మహిళలకు ఆరోగ్య ప్రాధాన్యాన్ని చెప్పడం, దానిపై దృష్టిసారించేలా చేయడం, క్యాన్సర్‌కు సంబంధించి మోమోగ్రామ్ పరీక్షలు చేయించుకునేలా చూడటమే. దీనికోసం ఐక్యరాజ్యసమితి సహా పలు సంస్థలతో కలిసి తుర్కియే, ఉక్రెయిన్‌ల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. వైద్యపరీక్షలపై భయాన్నీ పోగొడుతున్నా. క్యాన్సర్ బాధితుల్లో ధైర్యాన్నీ పెంచుతున్నా. రేడియేషన్ ఆంకాలజిస్ట్ అయ్యాక నా సేవల్ని ప్రపంచవ్యాప్తం చేయాలి. ఇందుకోసం అనేక సంస్థలతో పనిచేయాలి. అందుకు మిస్ వరల్డ్ ప్లాట్‌ఫామ్ చక్కని వేదిక. దీనిద్వారా యువతరానికి చేరువ కావొచ్చు. పోటీల సమయంలో ఎంతోమందిని కలుసుకున్నా. నా లక్ష్యం నెరవేర్చుకునే అవకాశాలూ మెరుగు పడ్డాయి. బలమైన నెట్‌వర్క్ ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో క్యాన్సర్ ఆసుపత్రులు, వైద్యనిపుణులతో కలిసి పనిచేసే అవకాశం లభించింది. మహిళలూ.. ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వండి. ఒక వయసు దాటాక క్యాన్సర్ పరీక్షలు తప్పక చేయించుకోండి. హెచ్‌పివి వ్యాక్సిన్లు వేయించుకోండి. ఈ మెసేజ్ ప్రపంచ నలుమూలలకీ చేర్చాలి. వైద్యురాలిగా రాణించాలన్నవో నా లక్ష్యాం. □

# అపార్థాలకు తావివ్వకూడదంటే..



భార్యాభర్త లిద్దరి ఆలోచనలు ఒకేలా ఉండాలని రూలేం లేదు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుంటూ మంచిచెడులను తర్కించుకుంటూ ఒకటిగా అడుగేసినప్పుడే ఆ దాంపత్యం కలకాలం నిలుస్తుంది. అందుకు ఇద్దరూ ఒకరి మాటను ఒకరు విని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాకుండా తమ భాగస్వామి మాట్లాడేటప్పుడు ఎప్పుడూ, ఎదో ఒక ఫిర్యాదు చేస్తూనే ఉంటుంది అంటూ తీసిపడేసినా, వినీవినట్లు ఉన్నా ఆపోహలు తప్పవు. అపార్థాలకు తావివ్వకూడదంటే ఇలా చేసి చూడండి. మీ భాగస్వామి వ్యక్తి గత, వృత్తి కుటుంబ విషయమై ఏదైనా మీకు ఫిర్యాదు చేసినప్పుడు దాన్ని తారీఖుతో సహా వారిముందే డైరీలో రాసుకోండి. దీనివల్ల మూడు ఉపయోగాలు ఉన్నాయి. . సమస్యపై మీరు స్పందించడం లేదనో, పట్టించుకోవడం లేదనో భావన వారిలో పోతుంది. తప్పు మీలో ఉంటే దాన్ని సరిచేసుకుని మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తపడచ్చు. వ. మీరు సమస్య వింటున్నారు, దాన్ని సరిచేసుకునేందుకు ప్రయత్నిస్తారని వాళ్లకు తెలుస్తుంది. దాంతో గంభీరంగా ప్రారంభమైన వారి సంభాషణ చల్లబడుతుంది. వాదోపవాదాలు లేకుండా పరిస్థితి గట్టెక్కుతుంది. తీరిక సమయాల్లో ఆ డైరీని తిరగవేయమని చెప్పండి. చిన్నచిన్న విషయాలకే వారు ఫిర్యాదులు చేస్తుంటే దాన్ని మానుకునే అవకాశం ఉంటుంది. □

# మల్టీపర్పస్ ఎగ్ బాయిలర్





వంటలన్నీ చకచకా చేసేవాళ్లు కూడా కోడిగుడ్డు ఉడకబెట్టే విషయంలో కొంచెం చిరాకుపడటం చూస్తుంటాం. మామూలుగా గుడ్లు మునిగేవరకూ నీళ్ల పోసి మీడియం ఫ్లేమ్ మీద ఏడెనిమిది నిమిషాలు ఉడికిస్తే సరిపోతుంది. కానీ పనుల ఒత్తిడిలో దాని సంగతి మర్చిపోతే కష్టమే. సరిగ్గా ఉడకకపోయినా, ఎక్కువ ఉడికిరాయిలా తయారైనా లాభంలేదు. ఈ సమస్యను నివారించే పరికరం ఎగ్ బాయ్‌లర్ ఆటోమాటిక్ ఎలక్ట్రానిక్ కుకర్. చూసేందుకు ఫ్లాస్క్‌లా ఉంటుంది. ఇందులో గుడ్లు ఉడికించవచ్చు. ఆమ్లెట్ వేసుకోవచ్చు. ఎగ్‌రోల్స్ లాంటివీ తయారుచేయొచ్చు. ఇందుకు ప్రత్యేకించి ప్యాన్ కానీ కడాయి కానీ అవసరం లేదు. నాన్ స్టిక్ కుకింగ్ ఛాంబర్ ఉన్న ఈ మల్టీ పర్పస్ పరికరాన్ని ఎక్కువ కాలం మన్నేలా రూపొందించారు. దీన్ని శుభ్రపరచడమూ సులువే. □

### చెలి చిట్కా

తేనెను కొంచెం వేడిచేసి ముఖమంతాపూసి అరగంట తర్వాత కడిగి వేయండి. తరువాత చల్లటి నీటిని జల్లులాగా ముఖము మీద వేస్తే మంచింది. □

# చికెన్‌తో కొత్త రుచులు

ఇంట్లో చికెన్ ఉంటే.. దాంతో పులుసు పెట్టాలా లేదా వేపుడు చేయాలా అని ఆలోచిస్తాం లేదా గబగబా బిర్యానీ వండేస్తాం. కానీ చికెన్‌తో అవే కాదు మరికొన్ని రుచులూ చేసుకోవచ్చు.

## అచారీ చికెన్



**కావలసినవి :** చికెన్: అరకేజీ, ఎండుమిర్చి: నాలుగు, ధనియాలు: రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు: పావుటేబుల్‌స్పూను, జీలకర్ర: టేబుల్‌స్పూను, మెంతులు: పావుచెంచా, సోంపు: ఒకటిన్నర చెంచా, ఉల్లిముక్కలు: కప్పు, టొమాటోముక్కలు: ముప్పావుకప్పు, నూనె: రెండుటేబుల్‌స్పూన్లు, అల్లంవెల్లుల్లి : టేబుల్‌స్పూను, పసుపు: పావుచెంచా, కారం: ఒకటిన్నరచెంచా, చక్కెర: ఒకటిన్నర చెంచా, పెరుగు: అరకప్పు, ఆవకాయ గుజ్జు: టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు: పావుకప్పు, అల్లం తరుగు : చెంచా.

**తయారీ విధానం :** ఎండుమిర్చి, ధనియాలు, ఆవాలు, జీలకర్ర, మెంతులు, సోంపు నూనె లేకుండా వేయించి తీసుకోవాలి. చల్లారాక మిక్సీలో పొడి చేసుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి నూనె వేసి, వేడయ్యాక ఉల్లిముక్కలు, అల్లంవెల్లుల్లి ముద్ద, ముందుగా చేసుకున్న పొడి వేయాలి. రెండు నిమిషాలయ్యాక టొమాటో గుజ్జు, కారం, పసుపు, తగినంత ఉప్పు, చక్కెర వేసి బాగా కలపాలి. అన్నీ వేగాక గిలకొట్టి పెరుగు,దాని తరువాత చికెన్ ముక్కలు,అరకప్పు వేణ్నీళ్లు పోయాలి. చికెన్ పూర్తి ఉడికాక ఆవకాయ గుజ్జు, కొత్తిమీర తరుగు, అల్లం తరుగు వేసి బాగా కలిపి దింపేయాలి.

## చెట్టినాడ్ పెప్పర్ చికెన్



**కావలసినవి:** చికెన్ : అరకేజీ, జీలకర్ర: చెంచా, ధనియాలు: రెండు చెంచాలు, ఎండు మిర్చి: అయిదు, మిరియాలు: మూడుచెంచాలు, దాల్చినచెక్క: చిన్న ముక్క, యాలకులు: నాలుగు, సోంపు: చెంచా, ఎండుకొబ్బరిపొడి: పావుకప్పు, అల్లం: చిన్న ముక్క, వెల్లుల్లి రెబ్బలు: పది నూనె: అరకప్పు, బిర్యానీ ఆకులు: రెండు, ఆవాలు: చెంచా, ఉల్లిపాయ ముక్కలు, రెండు కప్పులు, పచ్చిమర్చి తరుగు: చెంచా, కరివేపాకు రెబ్బలు: రెండు టొమాటోగుజ్జు: ఒకటిన్నర కప్పు, ఉప్పు: తగినంత, కారం: రెండు చెంచాలు, పసుపు: చెంచా, చింతపండుగుజ్జు: రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు.

**తయారీ విధానం :** జీలకర్ర ధనియాలు, ఎండుమిర్చి, మిరియాలు, దాల్చినచెక్క, యాలకులు, సోంపు , ఎండుకొబ్బరి, అల్లం, వెల్లుల్లి రెబ్బలు వేయించి, చల్లారాక అన్నీ మిక్సీలో గ్రైండ్ చేయాలి. అదే బాణలిలో బిర్యానీ ఆకులు, ఆవాలు వేసి వేగాక ఉల్లిముక్కలు, పచ్చిమర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించాలి. చికెన్ ముక్కలు వేసి కాసేపు వేయించి రుబ్బిన మసాలా టొమాటో గుజ్జు, ఉప్పు, కారం, పసుపు, కప్పు నీళ్ల పోసి ఉడికించాలి. ఆపై చింతపండుగుజ్జు చేసి మరికాసేపు ఉడికించి దించేముందు కొత్తిమీర చల్లాలి.

## చికెన్ రోస్ట్



**కావలసినవి :** చికెన్: కేజీ, పసుపు: పావుచెంచా, కారం: పావు చెంచా, ధనియాలపొడి: పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు: అయిదు, పచ్చిమిర్చి: అయిదు, ఉప్పు: తగినంత, ఉల్లిపాయలు: మూడు, టొమాటో : ఒకటి 'పేస్టులా చేసుకోవాలి) కరివేపాకు రెబ్బలు: మూడు, గరంమసాలా: పావుచెంచా, మిరియాలపొడి: పావు చెంచా, నిమ్మకాయ: ఒకటి, నూనె: వేయించేందుకు సరిపడా.

**తయారీ విధానం :** చికెన్ని కడిగి చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. మిక్సీలో పసుపు, కారం, ధనియాలపొడి, చెంచ నిమ్మరసం, వెల్లుల్లి తరుగు, మూడు పచ్చిమిర్చి ముక్కలు, తగినంత ఉప్పువేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలపైన వేసి బాగా కలపాలి. గంట తరువాత స్టౌమీద బాణలి పెట్టి టేబుల్‌స్పూను నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు వేయించుకుని తీసుకోవాలి. అదే బాణలిలో కప్పు నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి తీసుకోవాలి. మరో బాణలిలో రెండు టేబుల్‌స్పూన్ల నూనె వేసి మిగిలిన పచ్చిమిర్చి కరివేపాకు వేయించాలి. నిమిషం తరువాత టొమాటో గుజ్జువేసి.. ముందుగా వేయించుకున్న చికెన్ ముక్కల్ని వేయాలి. చికెన్ ముక్కలు టొమాటో గుజ్జు పట్టాక ఉల్లిపాయ ముక్కలు, గరంమసాలా, మిరియాలపొడి మిగిలిన నిమ్మరసం వేసి బాగా కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి.


## చిల్లీ చైనీస్ చికెన్



**కావలసినవి :** చికెన్: అరకేజీ, మొక్కజొన్నపిండి: రెండు టేబుల్‌స్పూన్లు, సోయాసాస్ : నాలుగు టేబుల్‌స్పూన్లు, గుడ్డు: ఒకటి, ఉల్లిపాయలు: రెండు, నూనె: కప్పు, ఎండుమిర్చి: ఆరు, వెల్లుల్లి తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం తరుగు: చెంచా, టొమాటో కెచప్: రెండు టేబుల్‌స్పూన్లు, క్యాప్సికం: రెండు ఉప్పు: తగినంత.

**తయారీవిధానం :** చికెన్ని చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఓ గిన్నెలో చికెన్ ముక్కలు, మొక్కజొన్నపిండి, సోయాసాస్, గుడ్డు సొన వేసి అన్నింటినీకలిపి పెట్టుకవాలి. స్టౌమీద బాణలి పెట్టి రెండు టేబుల్‌స్పూన్లనూనె వేసి ఎండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, అల్లంవెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. అవివేగాక టొమాటో కెచప్, తగినంత ఉప్పు వేసి ఓసారి కలిపి దింపేయాలి. మరోబాణలిని పొయ్యిమీద పెట్టి మిగిలిన నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి టొమాటోసాస్‌లో వేయాలి. తరువాత అన్నింటినీ కలిపి స్టౌమీద పెట్టి క్యాప్సికం ముక్కలు, కప్పు వేడి నీళ్ల పోసి స్టౌని సిమ్‌లో పెట్టాలి. మిశ్రమం కాస్త చిక్కబడ్డాక దింపేయాలి. □

# దేవుడితో సహవాసం గొప్ప ధన్యత..



అంతర్వాణి

'ఆయన(దేవుని)తో సహవాసము చేసినయెడల నీకు సమాధానము కలుగును' (యోబు 22:21). నిజమే దేవుడితో మనం సహవాసం కలిగి వుంటే అన్నివిషయాల్లోనూ సమాధానంగా ఉంటాం. దేవుడితో సహవాసం అంటే ఎలా ఉండగలం? రోజూ బైబిల్ చదవడం, ప్రార్థన చేయడం, చర్చికి వెళ్లి ఆయన వాక్యాన్ని వినడం, దేవుడి బిడ్డలతో సహవాసంతో దేవుడి గురించి చర్చించుకోవడం, కుటుంబ సభ్యులతో దేవుడి ప్రేమను, ఆశ్చర్యకార్యాలను చర్చించుకోవడం వంటివన్నీ దేవుడితో సహవాసం కిందకే వస్తుంది. ఆయనతో ఇంకా వ్యక్తిగత సహవాసం అంటే ప్రార్థన, బైబిల్ చదవడం..ఒక్కమాటలో చెప్పాలంటే ఏకాంతంగా ఆయనతో గడపడమే. దావీదు మహారాజు గురించి తెలియని వారుండరు. ఆయన బత్షెబతో పాపం చేసినప్పుడు దేవుడి తన అనుబంధాన్ని దాదాపు 9నెలలు కొనసాగించలేక పోయాడు. ఆ బిడ్డను దేవుడు హత మార్చినప్పుడు, నాతాను అనే ప్రవక్త వచ్చి దావీదులో చెప్పినప్పుడు, అప్పుడు దావీదు తన తప్పును తెలుసుకుని, దేవుడి సన్నిధిలో ఒప్పుకుని, తిరిగి దేవుడితో సహవాసాన్ని కొనసాగించాడు. ఆ సహవాసం మరణించేంతవరకు సాగింది. అందుకే దేవుడే దావీదు గురించి గొప్ప సాక్ష్యం చెప్పాడు. 'బత్షెబ విషయంలో తప్ప దావీదు ఏవిషయంలోనూ పాపం చేయలేదని, దేవుడికి నమ్మకంగా జీవించాడు అని చెప్పాడు. అబ్రాహాము కూడా భార్య శారా మాట విని, హాగరును వివాహం చేసుకుని, ఇష్మాయేలను కుమారుడిని కన్న తర్వాత దాదాపు 13 సంవత్సరాలు దేవుడి అబ్రాహాముతో మాట్లాడినట్లు మనకు బైబిల్‌లో కనిపించదు. వారిద్దరిమధ్య 13 సంవత్సరాల సహవాసం లేనట్లుగా కనిపిస్తుంది. తర్వాత దేవుడు ఆదికాండం 17వ అధ్యాయం మొదటి వచనంలో ప్రత్యక్షమై..'నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము' అని చెప్పాల్సి వచ్చింది. అంటే దేవుడు అబ్రాహామును తన సన్నిధిలో జీవించాలి అని దేవుడి కోరిక. అలాగే దావీదును సరిచేసేందుకు నాతాను అనే ప్రవక్తను దేవుడు పంపాల్సి వచ్చింది. అబ్రాహాము, దావీదు వంటి గొప్ప భక్తులే దేవుడి నుంచి తాత్కాలికంగా దూరమయ్యారు. మనం ఏపాటివారం. కాబట్టి శరీరబలహీనతలో మనం దేవుడికి చాలాసార్లు దూరమైపోతుంటాం. పర్వాలేదు. ఆదూరాన్ని మరింత దూరం చేసుకోకుండా సరిచేసుకుని, తిరిగి దేవుడితో నిత్యం సహవాసాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిద్దాం. ఆయన నమ్మదగిన దేవుడు, మనం క్షమించమని వేడుకుంటే, తప్పకుండా తన సహవాసంలో జీవించేందుకు మనకు సాయం చేస్తాడు. అప్పుడే మనం అన్నింట్లోనూ సమాధానంతో జీవించగలం. ఆ కృప దేవుడు మనకందరికీ దయచేయునుగాక..

-పి.వాణిపుష్ప

# దోశ ప్రింటర్



ప్రింటర్ అవసరమైన కథనాలు కాపీలు తీస్తాం. అది మనందరికీ తెలిసిందే! దోశలు కూడా అలా తీయొచ్చు అంటే దోశ బొమ్మల ప్రింటవుట్ కాదండోయ్. అసలైన దోశలే. ఇదెక్కడి చోద్యం అనుకుంటున్నారా? అలాంటి పరికరం నిజంగానే ఉంది మరి. ఇందులో పిండిని లోడ్ చేస్తే చాలు. 360 డిగ్రీల ఫుడ్ గ్రేడ్ కోటెడ్ రోలర్ లోంచి నిమిషంలో దోశలు డౌన్‌లోడ్ అవుతాయి. ఎంత మందంగా కావాలి. ఏ మాత్రం వేగాలి మొదలైన కంట్రోల్ బటన్‌లు కూడా ఉన్నాయి. దీన్ని కొనుక్కున్నామంటే చెమటలు కక్కుతూ దోశలు వేయాల్సి పనేలేదు. ఎంచక్కా మీట నొక్కితే చాలు. కరకరలాడే దోశలు వచ్చేస్తాయి. □

# షూటింగ్ వరల్డ్‌కప్‌లో మోనాకు రజతం

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాలో జరిగిన పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో మోనా అగర్వాల్ రజత పతకాన్ని గెలుచుకుంది. చాంగ్‌వాన్‌లో శనివారం జరిగిన 2025 పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో మహిళల పి2-10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో భారతదేశానికి చెందిన మోనా అగర్వాల్ ఈ రజతాన్ని కైవసం




చేసుకుంది. ఇక దక్షిణ కొరియాకు చెందిన యున్రీ లీ పారాలింపిక్స్‌లో రజతం గెలుచుకుంది. మోనా అగర్వాల్ కూడా పారా షూటింగ్ ప్రపంచ కప్‌లో పాల్గొంది, అక్కడ ఆమె స్వర్ణం మరియు కాంస్యం గెలుచుకుంది. అంతకు ముందు ఆమె పారిస్ పారాలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. పారాలింపిక్స్‌లో అవని లేఖరా అదే ఈవెంట్‌లో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా అవతరించింది.

## ఫిఫా మహిళల ఫుట్‌బాల్‌లో

# భారత్ ఓటమి

### 0-1 తేడాతో ఉజ్బెకిస్థాన్ విక్టరీ



**న్యూఢిల్లీ:** రెండు ఫిఫా అంతర్జాతీయ మహిళల ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో ఉజ్బెకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. బెంగుళూరు పదుకొనే ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో జరిగిన రెండు పోటీల్లో భాగంగా మొదటి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు టీమ్‌లోని డియోరాఖోన్ ఖబిబుల్లేవా ఏకైక గోల్ చేయడంతో భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు పరాజయం చెందింది. గోల్ లేని మొదటి అర్ధభాగం తర్వాత, ఖబిబుల్లేవా 56వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించి ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. భారత్ జట్టు ప్రారంభంలోనే కొన్ని కార్నర్‌లను సంపాదించగా, గోల్ కీపర్ పాంథోయ్ చాను ఉజ్బెకిస్తాన్ దాడిదారులను ఆరంభంలో అడ్డుకుని రాణించాడు. కెప్టెన్‌గా బరిలోకి దిగిన పాంథోయ్, ఉజ్బెకిస్తాన్ ఫార్వర్డ్‌ను భారత రక్షణ వెనుక నుండి ఆడించిన తర్వాత, ఎనిమిదో నిమిషంలో నిలుఫర్ కుద్రటోవా నుండి బంతిని సేకరించడంలో కృతకృత్యులైయ్యింది. ఆట సాగుతున్న కొద్దీ, భారత్ జట్టు నిదానంగా వ్యవహరించింది. కౌంటర్‌లో ఉన్న సౌమ్య గుగులోత్, డాంగ్‌మీ గ్రేస్‌కు పాస్‌ను థ్రెడ్ చేసింది, ఉజ్బెకిస్తాన్ బ్యాక్ లైన్‌ను దాటి వేగంగా దూసుకెళ్లింది. అయితే, మప్తునా జోనిమ్‌క్లోవా తన లైన్ నుండి బయట ఎదుర్కొని భారత ఫార్వర్డ్ పాదాల నుండి బంతిని లాక్కుంది. తర్వాత, డియోరాఖోన్ ఏరియల్ త్రూ బాల్‌లోకి పరిగెత్తింది మరియు పాంథోయ్‌ను ఓడించడానికి మాత్రమే మిగిలి ఉంది. అయితే, భారత సెంటర్‌బ్యాక్ శిల్కీ దేవి తన భౌతిక ఉనికితో ఉజ్బెకిస్తాన్ ఫార్వర్డ్‌ను నియంత్రించి, పాంథోయ్ బంతిని లాక్కోవడానికి కొంత అవకాశం కల్పించింది. ఎడమ పార్శ్వం నుండి తప్పించుకున్న మప్తునా షోయిమోవా, ఇండియా బాక్స్‌లోకి పిన్‌పాయింట్ క్రాస్ పంపింది. 56వ నిమిషంలో డియోరాఖోన్ దానిని దగ్గరగా కొట్టి తన జట్టుకు ఆధిక్యాన్ని అందించింది.

# పాక్‌దే టి20 సిరీస్

### 57 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో పాకిస్తాన్ 57 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. పాకిస్తాన్ టాప్ ఆర్డర్ వరుసగా రెండోసారి 201 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. మరియు ఎనిమిది మంది బౌలర్లలో ఏడుగురు వికెట్లు తీసి బంగ్లాదేశ్‌ను 19 ఓవర్లలో 144 పరుగులకే ఆలౌట్ చేశారు.




ఛేజింగ్‌లో మొదటి రెండు ఓవర్లలో తంజిద్ హాసన్ మొత్తం 32 పరుగులు చేశాడు. కానీ అబ్రార్ అహ్మద్ షార్ట్ ఫైన్ లెగ్ వద్ద అద్భుతమైన రిఫ్లెక్స్ క్యాచ్‌తో 33 పరుగులకే ఔటయ్యాడు. పవర్‌ప్లే ముగిసే సమయానికి, బంగ్లాదేశ్ 543తో ఉంది మరియు కొన్ని అద్భుతమైన క్యాచ్‌లతో వెనుకబడి ఉంది. వరుస పదునైన గూగ్లీలతో అబ్రార్ తోహిద్ హ్రిడోయ్, జాకర్ అలీలను లెగ్ బిఫోర్ వికెట్‌గా నిరోధించాడు. ఆటలో సగం సమయానికి బంగ్లాదేశ్ 78/7తో నిలిచింది. 9వ ర్యాంకర్ బ్యాట్స్‌మన్ తంజిమ్ హసన్ సాకిబ్ మాత్రమే 31 బంతుల్లో 50 పరుగులు చేసి అతని తొలి T20 అర్ధ సెంచరీ చేశాడు. ఫాస్ట్ బౌలర్ షోరిఫుల్ ఇస్లాం తన మొదటి ఓవర్‌లోనే గాయంతో బ్యాటింగ్ చేయలేకపోయిన తర్వాత చివరిగా ఔటయ్యాడు. ఫర్హాన్ 54 బంతుల్లో 103 పరుగులు జోడించి, మొహమ్మద్ హారిస్ (41) తో కలిసి కొత్త కోచ్ మైక్ హెస్సన్ నాయకత్వంలో దూకుడుగా ఆడాడు. 11వ ఓవర్లో హారిస్ బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద క్యాచ్ అవుట్ అయ్యాడు, మరియు ఫర్హాన్ తర్వాత ఓవర్‌లో బంగ్లాదేశ్ కెప్టెన్ లిట్టన్ దాస్ స్టంప్స్ వెనుక క్యాచ్ అవుట్ అయ్యాడు. పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్ హాసన్ నవాజ్ 25 బంతుల్లో మూడు సిక్సర్లు మరియు రెండు ఫోర్లతో 51 పరుగులు చేశాడు. కానీ పాకిస్తాన్ చివరి ఐదు ఓవర్లలో 40 పరుగులు మాత్రమే చేసింది, ఫాస్ట్ బౌలర్ హాసన్ మహ్మద్ 247తో అద్భుతమైన పునరాగమనం చేశాడు.




# టైటిల్‌పై ఆర్‌సిబి ఆశలు

### 18 యేళ్లుగా ఊరిస్తున్న ఐపిఎల్.. ఫైనల్స్ చేరుకోవడం ఇది 4వ సారి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో గత 18 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ కప్పును ఈ సారి ఏమైనా సాధించాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పట్టుదలతో ఉంది. ప్రతీసారి కప్ మనదే అంటూ రావడం, ఆ తరువాత నిరాశ పరచడం గత కొన్నాళ్లుగా ఆర్‌సీబీ తీరు ఇది. ఈ సీజన్‌లో మాత్రం ఆర్‌సీబీ అదరగొడుతోంది. క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుని చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి కేవలం అడుగు దూరంలో నిలిచింది. 9 ఏళ్ల విరామం తరువాత ఆర్‌సీబీ ఫైనల్ మ్యాచ్‌లో అడుగుపెట్టింది. ఈ జట్టు ఫైనల్‌కు చేరుకోవడం ఐపీఎల్ చరిత్రలో ఇది నాలుగో సారి. 2009, 2011, 2016లోనూ ఇలాగే ఫైనల్ చేరుకున్నప్పటికి నిరాశ తప్పలేదు. ఐపీఎల్ 2008లో ఆరంభమైంది. తొలి సీజన్‌లో ఆర్‌సీబీ నిరాశజనక ప్రదర్శన చేయడంతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంతో టోర్నీని ముగించింది. రెండో సీజన్‌లో అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ అనిల్ కుంబ్లే సారథ్యంలో ఫైనల్‌కు దూసుకువెళ్లింది. ఫైనల్‌లో డెక్కన్ ఛార్జర్స్‌తో తలపడింది. గిల్ క్రిస్ట్ నాయకత్వంలోని డెక్కన్ ఛార్జర్స్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఆర్‌సీబీ 9 వికెట్లు కోల్పోయి 137 పరుగులకే పరిమితమై 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. అలాగే 2011లో రెండో సారి ఐపీఎల్ ఫైనల్ చేరుకుంది. ఈసారి డేనియర్‌వెటోరీ ఆర్‌సీబీని ముందుండి నడిపించాడు. అయితే ఫైనల్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో చెన్నై అడ్డుపడింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల స్కోరు సాధించింది. ఆ తరువాత లక్ష్య ఛేదనలో ఆర్‌సీబీ 8 వికెట్ల నష్టానికి 147 పరుగులకే పరిమితం కావడంతో మరోసారి తనిరాశే తప్పలేదు. ముచ్చటగా మూడోసారి 2016 ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేరుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ భీకర ఫామ్‌తో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. కోహ్లీ ఊపు చూస్తే ఆర్‌సీబీ మూడో ప్రయత్నంలో కప్పును ముద్దాడుతుందని అంచనావేశారు. అయితే డేవిడ్ వార్నర్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆర్‌సీబీకి గట్టి షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ తొలుత బ్యాటింగ్ చేసి 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. తదుపరి ఆర్‌సీబీ 7 వికెట్ల నష్టానికి 200 పరుగుల దగ్గర ఆగిపోయి 8 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మూడు సందర్భాల్లో కూడా ఆర్‌సీబీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఈ క్రమంలో జూన్ 3న జరిగే ఐపీఎల్-2025 ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ తొలుత బ్యాటింగ్ చేయడంతో పాటు, కప్పు సాధించాలనే దిశగా తీవ్ర యత్నం చేస్తోంది.


## ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

# సచిన్, పారుల్‌కు రజతం

### విద్య, అనిమేష్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 చివరి రోజు కూడా భారత్ అథ్లెట్లు సత్తా చాటారు. జావెలిన్ త్రో విభాగంలో సచిన్ యాదవ్ రజతాన్ని పరుగు మహిళల ఈవెంట్‌లో పరుల్‌చౌదరి రజతాన్ని, హర్డిల్స్ మహిళల విభాగంలో విద్యా రామరాజ్, పరుగులో అనిమేష్ కుజుర్ కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. దక్షిణ కొరియాలోని గుమిలో శనివారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో సచిన్ 85.16 మీటర్ల త్రోతో వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. అతని స్వదేశీయుడు యశ్ వీర్ సింగ్ ఐదవ స్థానంలో నిలిచాడు, కానీ 82.57 మీటర్ల త్రోతో వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన కూడా చేశాడు. అయితే పాకిస్తాన్‌కు చెందిన అథ్లెట్ నదీమ్ స్వర్ణపతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన తొలి ఆసియా ఛాంపియన్‌షిప్ పతకాన్ని సాధించడంలో 86.40 మీటర్ల దూరం










జావెలిన్‌ను విసిరాడు. అలాగే మహిళల 5000 మీటర్ల పరుగులో పారుల్ 15:15.33 సెకన్లలో కజకిస్తాన్‌కు చెందిన నోరా జెరుటో తనూయ్ (14:58.71 సెకన్లు) కంటే వెనుకబడి రజతం గెలుచుకుంది. జపాన్‌కు చెందిన యుమా యమమోటో 15:16.86 సెకన్లతో కాంస్యం గెలుచుకుంది. ఇక తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల విద్య మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో 56.46 సెకన్లతో మూడవ స్థానంలో నిలిచింది, చైనాకు చెందిన మో జియాడీ మరియు బహ్రెయిన్‌కు చెందిన ఒలువాకేమి ముజిదత్ అడెకోయా తర్వాత నిలిచింది. ఇక మరో భారత్ అథ్లెటిక్ అనిమేష్ 20.32 సెకన్ల పరుగుతో పురుషుల 200 మీటర్ల జాతీయ రికార్డును బద్దలు కొట్టి కాంస్యం గెలుచుకున్నాడు. ఈ పతకంతో అనిమేష్ 2015లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున రెండవసారి 200 మీటర్ల పతక విజేతగా ధరంబీర్ సింగ్ సాధించిన ఘనతను సమం చేశాడు. ఇక జపాన్‌కు చెందిన తోవా ఉజావా మీట్ రికార్డ్ టైమింగ్ 20.12 సెకన్లతో స్వర్ణం గెలుచుకున్నాడు. సౌదీ అరేబియాకు చెందిన అబ్దులాజీజ్ అటాఫీ 20.31 వ్యక్తిగత ఉత్తమ సమయంతో రజతం సాధించాడు.

# నష్టాలను తగ్గించుకుంటున్న వొడాఫోన్ ఐడియా!




**ముంబయి, మే 31:** వొడాఫోన్ ఐడియా జనవరి మార్చి త్రైమాసికానికిగాను మొత్తం రూ.7166 కోట్ల నష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.7674 కోట్లకంటే కొంతమేర తగ్గించగలిగింది. 6.62శాతం నష్టాలు తగ్గినట్లు కంపెనీ ప్రకటించింది. వ్యయాలను నియంత్రించుకోవడంతోనే క్రమానుగతంగా నష్టాలను తగ్గించుకుంది. అయితేనికరనష్టం మాత్రం 8.42శాతంగా ఉంది.అంతకుముందు త్రైమాసికంలో 6609కోట్లకంటే కొంతమేర పెరిగింది. టెల్కో ఆర్థిక వ్యయాలు రూ.6471కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 6280 కోట్లకంటే మూడుశాతంపెరిగాయి. వొడాఫోన్ బోర్డు సమావేశంలో రూ.20 వేల కోట్లు నిధుల సమీకరణకు ఆమోదం తెలిపింది. ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్, ప్రైవేటు ప్లేస్‌మెంట్‌ద్వారా సంస్థాగత ప్లేస్‌మెంట్ క్యూఐపిద్వారా కూడా నిధులు సమీకరించేందుకు ఆమోదం పొందింది. కంపెనీ ఒక కస్టమరుపైనా సగటు రాబడి ఈ త్రైమాసికంలో 164రూపాయలుగా ఉందని తెలిపింది. అంతకుముందు 163 నుంచి స్వల్పంగాపెరిగింది. గడచిన మూడు త్రైమాసికాల్లో రూ.163,రూ.154, రూ.146గా ఉన్నాయి. ట్యారిఫ్‌లు పెంచడంవల్ల చందాదారులు పెరగడం వల్ల వొడాఫోన్ కస్టమర్‌బేస్ పెరిగిందని ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 126.4 మిలియన్లుగా ఉంది. గత త్రైమాసికాల్లో 122.6 మిలియన్లు, 124.7 మిలియన్లు, 125.6 మిలియన్లనుంచి కొంతమేర పెంచుకోగలిగింది. అయితే జియో, ఎయిర్‌టెల్‌కంటే నాలుగోత్రైమాసికంలో చందాదారులను ఎక్కువ కోల్పోతోంది. 1.6 మిలియన్లమంది ఇతర టెల్కోలకు మారిపోయారు. మూడోత్రైమాసికంలో అయితే ఏకంగా 5.2 మిలియన్లమంది ఇతరవాటికి బదలీకాగా నాలుగోత్రైమాసికంలో తగ్గించుకోగలిగింది. స్థూల రెవెనూనయ రూ.11,014కోట్లుగా ఉంది. వార్షికపద్ధతిలోచూస్తే 3.83శాతం వృద్ధి ఉంది అలాగే వడ్డీ, పన్నులుచెల్లింపులు, తరుగుదలకు ముందు చూస్తే 7.47శాతంగా ఉంది. అంటే 4659 కోట్లుగా ఉందని అంచనా. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 4335 కంటే కొంతమేర మెరుగుపడింది.

## షాపూర్జీకోసం

### డచ్‌బ్యాంక్ 3.35 బిలియన్ డాలర్ల సమీకరణ

**ముంబయి, మే 31:** షాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్ కోసం డచ్ బ్యాంక్ అమెరికా వెలుపల అతిపెద్ద ప్రైవేట్ క్రెడిట్ లావాదేవీని ప్లాన్ చేసింది, దీని ద్వారా షాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్ కోసం 3.35బిలియన్లడాలర్లను సేకరించింది. ఈ మౌలిక సదుపాయాల గ్రూపు తన టాటా సన్స్ వాటాలో కొంత భాగాన్ని పూచీకత్తుగా ఉపయోగించుకుంది, బ్లాక్‌రాక్ మరియు మోర్గాన్ స్టాన్లీతో సహా ప్రధాన ప్రపంచ పెట్టుబడిదారుల నుండి మొత్తం ఈ నిధులు సమీకరించింది. మూడు సంవత్సరాల నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి) ద్వారా ఈ ఫైనాన్సింగ్ రాబట్టింది, ఇవి 19.75 శాతం దిగుబడిని అందిస్తాయి వార్షికపద్ధతిలో గణించి మెచూరిటీ సమయంలో చెల్లిస్తారు. ఇది మునుపటి రుణజారీల నుండి పెరుగుదలను సూచిస్తుంది, దీని వలన రాబడి దాదాపు ఒక శాతం పాయింట్ తక్కువగా ఉంటుంది. 2023లో, ఎస్పీగ్రూప్ యొక్క గోస్వామి ఇన్‌ఫ్రాటెక్ 18.75 శాతం దిగుబడితో 1.7 బిలియన్లడాలర్లను సేకరించింది.డచ్ బ్యాంక్ బాండ్ జారీకి 8.93 మిలియన్లడాలర్లకు కట్టుబడి ఉందిదాని పుస్తకాలలో !!500 మిలియన్లకు పైగా నిలుపుకుంటుందని భావి స్తున్నారు. జర్మన్ బ్యాంక్ ఈ ఒప్పందాన్ని బ్లాక్‌రాక్, సోనా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ మరియు పిఐఎంకో వంటి విస్తృత శ్రేణి ప్రపంచ పెట్టుబడిదారులకు సిండికేట్ చేసింది. ముఖ్యంగా, ఈ లావాదేవీ సోనా క్యాపిటల్ మరియు పిమ్కో సంస్థలకు భారతదేశంలో మొట్టమొదటి ముఖ్యమైన ప్రైవేట్ క్రెడిట్ ట్రేడ్‌ను గుర్తించింది.ఇంకా చదవండి: షాపూర్జీ పల్లోంజీ గురుగ్రామ్‌లో రూ.1,400 కోట్లకు పైగా లగ్జరీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు!!3.35 బిలియన్ల నిధుల రౌండ్ మూడు విభిన్న పెట్టుబడిదారుల సమూహాలనుఒక్క గ్రూప్‌గా మార్చిందని చెప్పవచ్చు. స్టెర్లింగ్ బాండ్ల ప్రస్తుత బాండ్ హోల్డర్లు, గోస్వామి బాండ్లలో ప్రస్తుత పెట్టుబడిదారులు అమెరికా, యుకె, హాంకాంగ్, సింగపూర్, భారతదేశంప్రైవేట్ క్రెడిట్ పెట్టుబడిదారుల కొత్త బృందం.

# 4.4 శాతానికి చేరిన ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ, మే 31:** కేంద్రప్రభుత్వం తన ఆర్థికలోటును కొంతమేర మెరుగుపరుచుకుంటున్నది. గత బడ్జెట్ అంచనాలతోపోలిస్తే సవరించిన అంచనాల్లో చూపించిన 4.84శాతం కంటే 4.77శాతానికి తీసుకురాగలిగింది. కాగ్ శుక్రవారం విడుదలచేసిన గణాంకాలు ఆర్థికలోటు తగ్గుదలను చూపిస్తున్నాయి. అలాగే జిడిపి 2025కి గాను 330.68 లక్షలకోట్లుగా ఉంది. అంతకుముందు సవరించిన అంచనాల్లో 324.11 లక్షలకోట్లకంటే కొంతమేర మెరుగుపడింది. జిడిపి దిగివచ్చిన శాతంతో బేరీజువేసి ఆర్థికలోటును గణిస్తారు. ఆర్థికలోటు సవరించిన 2025 అంచనాల్లో 77 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రభుత్వ వ్యయం పెంచడంతో పెట్టుబడులు కూడా పెరిగాయని దీనివల్లనే కొంతమేర జిడిపి కూడా వృద్ధిలో ఉందని చెపుతున్నారు. రెవెన్యూ వ్యయంలో దాదాపు రూ90వేల కోట్లను




ఆదాచేయగలిగినట్లు ఇక్రా ఆర్థికవేత్తలుచెపుతున్నారు. 2022లో 6.7శాతం, 2023లో 6.4శాతం ఆపై సంవత్సరంలో 5.6శాతంగా ఉన్న ఆర్థికలోటు 2025కిమాత్రం 4.77 శాతంగా ఉంది. ఇక సవరించిన అంచనాల ఒడ్జెట్‌లో 4.4శాతానికి దిగివచ్చినట్లు కేంద్రం చెపుతోంది. మొత్తం రాబడులపరగాచూస్తే 30.78 లక్షలకోట్లుకాగా పన్ను రాబడులు 24.98 లక్షలకోట్లుగా ఉన్నాయి. ఇక మూలధన వ్యయం 1052 లక్షలకోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయం చూస్తే 46.56 లక్షలకోట్లుగా ఉంది. పన్నేతర రాబడులు 5.38 లక్షలకోట్లు మాత్రమేనని ప్రభుత్వ అంచనాలు స్పష్టంచేస్తున్నాయి. 2025 ఆర్థికసంవత్సరంలో మూలధన వ్యయం 10.5 లక్షలకోట్లుగా ఉంది. దీన్నిబట్టిచూస్తే మౌలికవనరుల రంగంపై వ్యయం పెరిగింది. సుమారుగా 103.3శాతం పెరిగినట్లు తేలింది.

# మే నెలలో ఎఫ్‌పిఐల పెట్టుబడులు రూ. 19, 860 కోట్లు!




ముంబయి, మే 31: భారత మార్కెట్లలో విదేశీ పెట్టుబడులు రికార్డుస్థాయికి పెరిగాయి. నికర ఎఫ్‌పిఐలు 19,860 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాదిలో అత్యుత్తమంగా పెట్టుబడులు ఆకర్షించిన మాసంగా మేనెల రికార్డయింది.

## వాణిజ్యం

ఈనెల 26 నుంచి 30వ తేదీవరకూ చూస్తే విదేశీ ఇన్వెస్టర్లు నికరంగా 6024.77 కోట్లు పెట్టుబడులుపెట్టారు. ఇదొక సానుకూల పరిణామం అని మార్కెట్‌నిపుణులు చెపుతున్నారు. నికరంగా శుక్రవారం ఒక్కరోజు మాత్రమే 1758.23 కోట్లు అమ్మకాలు కనిపించాయి. అంటే విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. నెలవారీగాకూడా రికార్డుస్థాయిలో పెట్టుబడులు రాబట్టిన మార్కెట్లు 2025లో కొంతమేర ప్రతికూలంగానే ఉంది. జనవరినుంచి మే వరకూ నికరంగా 92,491 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. అయితే మేనెలలో మారిన దోరణులతో విదేశీ ఇన్వెస్టర్లలో నమ్మకాలుపెరిగి మళ్లీ పెట్టుబడులు పెరిగాయి. మొత్తంగా 19,860 కోట్లు పెట్టుబడులు కుమ్మరించినట్లు నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరీ నివేదికలు తేటతెల్లంచేస్తున్నాయి. ఈ వారంలోఐదు ట్రేడింగ్‌సెషన్లలోనూ ఎఫ్‌పిఐలు పెరిగాయి. ఒక్క శుక్రవారం రోజుమాత్రమే విత్‌డ్రా జరిగినట్లు తేలింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎఫ్‌పిఐలు భారత ఈక్విటీల్లో వరుసగా 78,027 కోట్లు, 34,574 కోట్లు మేర విత్‌డ్రాచేసుకున్నారు. మార్చినెలలో కూడా 3973 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. అయితే మేనెల చివరిలో మళ్లీ రీబౌండ్ కావడంతో ఎఫ్‌పిఐలు మరింతపెరుగుతాయన్న అంచనాలున్నాయి.




# పసిడి కొనుగోళ్లపై పెరుగుతున్న క్రేజ్

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

**ముంబయి, మే 31:** బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం పదిగ్రాములు పదిరూపాయలుపెరిగింది. ట్రేడింగ్ ఆరంభంలోనే ఈ పెరుగుదల నమోదుచేస్తే ట్రేడింగ్‌ముగిసేనాటికి మరింత పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ప్రస్తుతం పదిగ్రాముల బంగారం 97,320 రూపాయలుగా ట్రేడ్ అవుతున్నట్లు తెలుస్తోంది. అలాగే వెండిధరలుచూస్తే 100 రూపాయలు తగ్గింది. కిలో వెండి 99,800గాట్రేడ్ అవుతోంది. అదే సమయంలో 22 కేరట్ల బంగారందరలు కూడా పదిరూపాయలుపెరిగి పదిగ్రాములు 89,210 రూపాయలుగా అమ్మకాలు సాగుతున్నాయి. ముంబయి, కోల్‌కత్తా, చెన్నైలలో ఈ 24 కేరట్ల బంగారం 97,320గా కొనసాగుతోంది. ఢిల్లీలోపదిగ్రాముల 24 కేరట్ల బంగారం 97,470రూపాయలుగా కొనసాగుతోంది. ఇక ముంబయిలో 22 కేరట్ల బంగారం 89,210గా నడుస్తోంది. కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలోకూడా ఇవేధరలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో 22 కేరట్ల బంగారంరూ.89,360గా కొనసాగుతోంది. ఇక ఢిల్లీకోల్‌కత్తా, ముంబయిలలో కిలో వెండి రూ.99,800గా నడుస్తోంది. కిలో వెండిపరంగా చెన్నైలో మాత్రమే 1,10,800రూపాయలుగా నడుస్తోంది. అమెరికాలో పసిడిధరలు కొంతమేరపెరిగాయి. తాజా సుంకాల భారం నేపత్యంలో ద్రవ్యోల్బణం కూడా కొంతమేర తగ్గిన వార్తలతో అమెరికా ఫండ్‌రేట్లు కూడా తగ్గించవచ్చన్న అంచనాలుపెరిగాయి.

స్పాట్‌గోల్డ్ 0.7శాతం తగ్గి ఔన్స్ ఒక్కంటికి 3,293.59 డాలర్లుగా నడిచాయి. స్పాట్ మార్కెట్‌లో వెండికూడా 1.2శాతం క్షీణించి ఔన్స్‌కు 32.94గానడిచింది. ఇక ప్లాటినమ్ 2.5శాతం క్షీణించి ఔన్స్‌కు 1055.05గా ఉంది.

పల్లాడియం విలువలు 0.6శాతం క్షీణించి 967.30 డాలర్లుగా నడుస్తున్నట్లు బులియన్ వర్గాలుప్రకటించాయి.




# తుర్కియేతో ఇండిగో లీజు ఒప్పందం రద్దు!

### విమానయానసంస్థకు డిజిసిఎ అల్టిమేటమ్

**న్యూఢిల్లీ, మే 31:** పౌరవిమానయానరంగ పర్యవేక్షణ సంస్థ డిజిసిఎ ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు అల్టిమేటమ్ జారీచేసింది. టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో ఉన్న అన్ని ఒప్పందాలను మూడునెలల లోపు ముగించాలని ఆదేశించింది. అంటే ఆగస్టు 31వ తేదీలోపు అన్ని టైఅప్‌లనను రద్దుచేసుకోవాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించడంతోపాటు ఆయుధాలు, సైనికులను కూడా సరఫరాచేసిన క్రమంలో భారత్ తుర్కియేతో అన్ని ఒప్పందాలను పునఃసమీక్షిస్తోంది. ఇండిగో ప్రస్తుతం బి777-300 ఇ ఆర్ విమానం తుర్కియే ఎయిర్‌లైన్స్‌నుంచి లీజుకు నడుపుతోంది ప్రస్తుత లీజు ఈనెలాఖరుతోనే ముగిసింది. ఇండిగో గతంలో ఆరునెలలు పొడిగించాలని కోరింది. అయితే తుర్కియేతో ఉన్న విభేదాల దృష్ట్యా ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆగస్టు 31వ తేదీవరకూ మాత్రమే ఒప్పందాన్ని అనుమతించింది. ఆ తర్వాత తుర్కియేతో అన్ని ఒప్పందాలు రద్దుచేసుకోవాలని డిజిసిఎ ఆదేశించింది. ఈ ఆదేశాలపై ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ మాట్లాడుతూ ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగాను, ఆదేశాలకు అనుగుణంగానే ముందుకువెళతామని చెప్పారు. ద్వైపాక్షిక ఎయిర్‌సర్వీస్ ఒప్పందం పరిధిలో రెండుదేశాలమధ్య విమానసర్వీసులు నడుస్తున్నాయి. ఈనెలలోనే ఏవియేషన్ సెక్యూరిటీ సంస్థ బికాస్ తుర్కియే కంపెనీ సెలెబి ఎయిర్‌పోర్టు సర్వీసెస్‌కు సెక్యూరిటీ క్లియరెన్సులను రద్దుచేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.